

తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందులో ప్రధానంగా పడకేసిన గ్రామీణాభివృద్ధిని గాడిన పెట్టాలని కసరత్తు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించింది. అందులో భాగంగా అంతర్గత సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలతోపాటు వివిధ గ్రామాలను కలిపే రోడ్లను తారు రోడ్లుగా మార్పు చేసే ప్రక్రియ చేపట్టింది. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో వీటిని చేపట్టనున్నారు. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి రూ.15కోట్ల విలువైన ప్రతిపాదనలను ఇవ్వాలని యంత్రాంగం సూచించగా, ఆయా నియోజకవర్గాల కీలక నేతలు వాటిపై దృష్టిసారించారు.

ఉపాధితో ప్రగతిబాట!



టంగుటూరు మండలంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీఆర్ డైరెక్టర్ కృష్ణతేజ

గ్రామీణ ప్రాంత మౌలిక సదుపాయాలపై కూటమి దృష్టి

భారీగా రోడ్లు, డ్రెయిన్లు, తదితర నిర్మాణాలు

ఆ పనులకు ఉపాధి హామీ పథకం నిధులు అనుసంధానం

నియోజకవర్గానికి రూ.15కోట్లు

ప్రతిపాదనలు స్వీకరిస్తున్న అధికారులు

వేగం పెంచిన కూటమి ప్రభుత్వం

ఒంగోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు ఎటువంటి అభివృద్ధి లేక కునారిల్లుతున్న గ్రామీణప్రాంతాలకు తీపికబురు. గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పల్లెలకు ఊరటనిచ్చేలా తాజా సర్కారు ప్రణాళికలు రూపొందిస్తోంది. అందులో భాగంగా ఉపాధిహామీ మెటీరియల్ నిధులతో రోడ్లు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు నిర్మించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ప్రతి నియోజకవర్గానికి నిధులు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ఉపాధి హామీ పథకం పనులు పెద్దఎత్తున చేపట్టారు. ఆ పనులతో కూలీలకు వేతనం రూపంలో వచ్చే నిధులతోపాటు భారీగా మెటీరియల్ కోటా కింద నిధులు వస్తాయి. మొత్తం ఉపాధి వ్యయంలో 60శాతం కూలీల వేతనం, మిగతా 40శాతం మెటీరియల్ కోటాగా ఉండటంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున ఈ నిధులను సద్వినియోగం చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆ ఐదేళ్ల కాలంలో రూ.4వేల కోట్ల మేర అటు వేతనాలుగా, ఇటు మెటీరియల్ కోటా కింద నిధులు వచ్చాయి. వందలాది గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, పాఠశాలల ప్రహరీలు, శ్మశానాల అభివృద్ధి, ఇతర భవన నిర్మాణాలు జరిగాయి. అలాగే పండ్లతోటల పెంపకం, నీటి సంరక్షణ ఇతర పలు పనులు చేశారు.



వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకాన్ని ఆ స్థాయిలో సద్వినియోగం చేసిన పరిస్థితి లేదు. మెటీరియల్ కోటా కింద నిధులు కల్పనలోనూ వెనుకబడిపోగా, ఉన్న నిధులలో కూడా అధికశాతం జగనన్న కాలనీల పేరిట తినేశారు. కొన్ని సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల పేరుతో భవన నిర్మాణాలు చేపట్టినా ఎక్కువశాతం పూర్తికాలేదు. చాలావరకు నిరుపయోగంగానో లేక అసంపూర్తిగానో మిగిలిపోయాయి. ఇక అంతర్గత రహదారులు, మురుగుకాలువలు, శ్మశానాల అభివృద్ధి పనులు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. కాగా తిరిగి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక నెలరోజుల్లోనే గ్రామీణ ప్రాంతాల పనులపై దృష్టిసారించింది.

నియోజకవర్గానికి రూ.15కోట్లు

ఈ నేపథ్యంలో జిల్లాలో ఉపాధి హామీ నిధులు అనుసంధానంతో నియోజకవర్గానికి రూ.15 కోట్లు వంతున పనుల కేటాయింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు చర్యలకు కలెక్టర్లను ఆదేశించింది. తదనుగుణంగా ప్రస్తుతం డ్వామా, పంచాయతీ అధికారులు సంబంధిత పనుల ప్రతిపాదనలు సేకరణలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు స్థానిక నాయకులతో చర్చించి సదరు పనులను ఎంపిక చేస్తున్నారు.

పలు నియోజకవర్గాల్లో అత్యధిక పనులను ఒక్కొక్కటి రూ.10లక్షలు ఉండేలా ప్రతిపాదనలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కువభాగం గ్రామాలలో అంతర్గత సిమెంటు రోడ్లు ఉంటున్నాయి. కొన్నిచోట్ల గ్రామాలకు, గ్రామాలకు మధ్య రోడ్లను కూడా ప్రతిపాదిస్తున్నారు. ప్రతిపాదనలను ఈ వారంలో తీసుకుని పీఆర్ ఇంజనీర్లు అంచనాలు సిద్ధం చేస్తే వాటిని డ్వామా ద్వారా కలెక్టర్ మంజూరు చేస్తారు. ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేసి వచ్చే నెలలో

వచ్చే నెలలో పనులు ప్రారంభం

పనులు ప్రారంభించే యోచన చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఒక్కో నియోజకవర్గానికి రూ.15 కోట్లు కేటాయింపు హేతుబద్ధత కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడొంతులు పట్టణ ప్రాంతంగా ఉండే ఒంగోలు, మార్కాపురంలకు రూ.15 కోట్లు సరే అనుకన్నా మొత్తం గ్రామీణ ప్రాంతంగా ఉండే కొండపి, వైపాలెం, ఎస్ఎన్‌పాడు వంటి నియోజకవర్గాలకు రూ.15కోట్ల ఎలా సరిపోతాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.120కోట్లు వచ్చే అవకాశం

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు రూ.224 కోట్లు మేర ఉపాధి వ్యయం జరిగింది. అందులో రూ.220 కోట్లు కూలీలకు వేతన రూపంలో లభించగా మెటీరియల్ వ్యయం కేవలం రూ.4కోట్లు మాత్రమే జరిగింది. అంతేకాక వార్షిక పని దినాలు లక్ష్యం కోటి 56లక్షలలో కోటి 6 లక్షల మాత్రమే జరిగాయి. అంటే ఇంకా 50 లక్షలు పని దినాలకు అవకాశం ఉండగా సుమారు రూ.100కోట్లకుపైగా వేతన రూపంలో సమకూరనుంది. అలా మొత్తం కూలీల వేతనం రూ.320 కోట్లకుపైగా కానుండగా ఆ ప్రకారం జిల్లాకు మెటీరియల్ కోటా కింద సుమారు రూ.120కోట్లు వరకు లభించనున్నాయి.

నేడు ఉపాధి గ్రామసభలు

ఒకే రోజు అన్ని పంచాయతీల్లో నిర్వహణ

చేసిన పనులపై సమీక్ష, కొత్తవి 87 రకాల వాటికి అనుమతి

ఒంగోలు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు పెద్దఎత్తున సాగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో శుక్రవారం గ్రామసభలు జరగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో ఒకేరోజున వీటిని నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉపాధి కూలీలకు వేతనాలు భారీగా లభించేలా పనుల కల్పన, మరోవైపు మెటీరియల్ కోటా ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపకరించే పనులకు అవకాశం ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పథకాన్ని అంతగా ఉపయోగించిన పరిస్థితి లేకపోగా భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో మళ్లీ ఉపాధి పథకంపై దృష్టిపెట్టింది. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా ప్రత్యేక దృష్టిసారించారు. ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పథకం అమలు కోసం మార్గదర్శకాలను జారీచేసింది. ఇప్పటివరకు జరిగిన పనుల సమీక్షలతో పాటు కొత్తవి చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం శుక్రవారం ఒకేరోజున అన్ని ఊళ్లల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

కొత్త పనుల గుర్తింపు

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో కోటి 56లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటివరకు కోటి ఆరు లక్షలు కల్పించారు. దీంతో రూ.228కోట్లు కూలీలకు వేతన రూపంలో లభించగా దాదాపు రూ.120 కోట్ల మెటీరియల్ పనులకు అవకాశం ఉన్నా ఆ వైపు గత ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. కూటమి ప్రభుత్వం వీటన్నింటిని సమీక్షించి అవసరమైన ప్రాంతాల్లో కొత్తవి గుర్తించి అదనంగా పనిదినాలను కల్పించాలని నిర్ణయించింది. ఈ పనులను శుక్రవారం జరిగే గ్రామసభల్లో గుర్తించనున్నారు. మొత్తం 87రకాల పనులను ఎంపిక చేశారు. వీటన్నింటిని జిల్లాస్థాయిలో నెలాఖరులోపు పరిశీలన చేసి మంజూరుతోపాటు వచ్చేనెల నుంచి చేపట్టేలా ప్రభుత్వం సూచనలు చేసింది.

పనులను పరిశీలించిన డైరెక్టర్

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఎం.కృష్ణతేజ గురువారం జిల్లాలో ఉపాధి పనులు పరిశీలించారు. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం, జయవరంలలో ఆయన ఫీడర్ ఛానల్ మరమ్మతులు, హార్టికల్చర్ పనులు పరిశీలించడంతోపాటు కూలీలతో మాట్లాడారు. వారు చేస్తున్న పనులు, అందుతున్న సౌకర్యాలు, లభిస్తున్న వేతనాలు అడిగి తెలుసుకున్నారు.

సీఐలకు స్థానచలనం



ఎస్పీని కలిసిన సీఐ శ్రీనివాసరావు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 22 : గుంటూరు రేంజి పరిధిలో 13 మంది సీఐలకు స్థానచలనం కల్పిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు పీటీసీలో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును గుంటూరు జిల్లా పత్తిపాడు సర్కిల్‌కు బదిలీ చేశారు. ఒంగోలు మహిళ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఖాజావలిని కనిగిరి సర్కిల్‌కు బదిలీ చేశారు. రేంజి వీఆర్‌లో ఉన్న సీహెచ్.ప్రభాకర్‌రావును ఎర్రగొండపాలెం సర్కిల్‌కు, డీసీఆర్‌బీలో పనిచేస్తున్న భీమానాయక్‌ను పామూరు సర్కిల్‌కు బదిలీ చేశారు.

ముగ్గురు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు టూటౌన్ సీఐగా మేడా శ్రీనివాసరావు, పామూరు సీఐగా భీమానాయక్, పొదిలి సీఐగా టి.వెంకటేశ్వర్లు ఆయా సర్కిల్ కార్యాలయాల్లో బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు.

ఒంగోలు అభివృద్ధికి ఎయిర్‌పోర్టు కీలకం

మాగుంట శ్రీనివాసులరెడ్డి

ఎమ్మెల్యే దామచర్ల, జేసీలతో ఎంపీ సమావేశం



భూముల వివరాలను ఎంపీ, ఎమ్మెల్యేకు వివరిస్తున్న జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22 : ఒంగోలులో ఎయిర్‌పోర్టుతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం ఎమ్మెల్యే జనార్దన్‌తో కలిసి జేసీ గోపాలకృష్ణతో సమావేశమయ్యారు. ముందుగా కొత్తపట్నం మండలం అల్లూరు పరిసర ప్రాంతాల్లో గతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పరిశీలించిన భూమిపై చర్చించారు. వాటి మ్యాప్‌లతోపాటు గతంలో తీసుకున్న నిర్ణయాలపై మాట్లాడారు. అనంతరం విలేకరులతో ఎంపీ మాగుంట మాట్లాడుతూ 2004లో తాను ఒంగోలుకు ఎయిర్‌పోర్టు అవసరాన్ని గుర్తించి, అందుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అప్పటికి ముఖ్యమంత్రి 2006లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆమోదం తెలిపారని వివరించారు. 730 ఎకరాల భూమి అవసరం అవుతుందన్నారు. ప్రస్తుతం వాణిజ్యపరంగా ఒంగోలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం ఎంతో అవసరంగా ఉందన్నారు. ప్రతిపాదిత భూమి ఒంగోలుకు ఆరుకిలోమీటర్ల దూరంలోనే ఉందని చెప్పారు. వాన్‌పిక్ భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అప్పుడు అంగీకారం తెలిపిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. పాత జిల్లాల్లో ఎక్కడైతే మంజూరై పెండింగ్‌లో ఉన్నాయో వాటి నిర్మాణానికి పౌరవిమానయాన మంత్రి అంగీకారం తెలిపారన్నారు. ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడులు ఇటీవల రాష్ట్రంలో ఏడు ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు ప్రకటించగా అందులో ఒంగోలు కూడా ఉందన్నారు. అందుకు అవసరమైన భూసేకరణపై జేసీతో చర్చించామని తెలిపారు. గతంలో వాన్‌పిక్ కోసం ఆరువేలకుపైగా ఎకరాల భూసేకరణ చేశారన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 730 ఎకరాలకు గాను 600 ఎకరాలు వాన్‌పిక్‌లోనే ఉందని, అప్పట్లో ఆ సంస్థ ఒప్పుకున్నందున ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎలాంటి అవరోధాలు లేవని చెప్పారు. మిగిలిన భూమిని మాత్రమే సేకరించాల్సి ఉందన్నారు. త్వరలో ఈ విషయంపై సీఎంను కలిసి వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో సుబ్బారెడ్డి, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ప్రక్షాళన


సిద్ధమవుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం

క్లస్టర్ విధానంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు

ఐదువేల మందికి ఒకటి ఏర్పాటు

కొన్నిశాఖల ఉద్యోగులను

మాతృశాఖకు అప్పగించే అవకాశం



ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22 : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండువేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో 10 నుంచి 14 మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. కొన్నిశాఖల వారికి సచివాలయాల్లో పనులు లేకుండా ఖాళీగా ఉంటున్నారు. జిల్లాలో 884 గ్రామ, 174 వార్డు సచివాలయాలు కలిపి 1,050 ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో పదివేల మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అక్కడ పని చేసే ఉద్యోగుల్లో కొందరికి పనిభారం ఎక్కువ ఉండగా మరికొందరికి అసలు పనులు లేకపోవడంతో ప్రక్షాళన తప్పనిసరి అని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

ప్రచారానికే సచివాలయాలు

అప్పట్లోనే క్లస్టర్ విధానంపై సమగ్రమైన ప్రణాళికలు రూపొందించినా అది కార్యరూపం దాల్చకముందే వచ్చిన వైసీపీ సర్కార్ గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. ఎక్కువమందికి ఉద్యోగాలు కల్పించామన్న ప్రచారం తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదు. ఈ వ్యవస్థను ఎలా ప్రక్షాళన చేయాలన్న దానిపై కూటమి ప్రభుత్వం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలకు అవసరమైన ఐదారుగురు ఉద్యోగులను అక్కడే ఉంచి మిగిలిన వారిని ఆయా మాతృశాఖలకు పంపడం ద్వారా వాటిని బలోపేతం చేసినట్లు అవుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. మినీ మండలాలు, మినీ మున్సిపాల్టీలుగా సేవలు అందించేలా సచివాలయాలను తీర్చిదిద్దాలని చూస్తోంది. తద్వారా మానవ వనరులు వృథా కాకుండా ప్రజలకు విస్తృత సేవలు అందించే అవకాశం కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రక్రియ త్వరలోనే ఒక కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది.

సగం మంది ఉద్యోగులు మాతృశాఖలకు...

గ్రామాల్లో ఏఎన్ఎం, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్లు, సంక్షేమ కార్యదర్శి, మహిళా సంరక్షణ కార్యదర్శులను ఉంచి మిగిలిన వారిని వారి మాతృసంస్థలకు అప్పగించేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు సమాచారం. వారిలో ఒకరిని డీడీవోగా నియమిస్తారు. మిగిలిన ఉద్యోగులందరిని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగించనున్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు, పశుసంవర్థక సహాయకులు తదితర పోస్టులను రద్దుచేసి క్లస్టర్ విధానంలో మాతృశాఖ ఆధీనంలో ఉంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. 2019లోనే చంద్రబాబు క్లస్టర్ వ్యవస్థను తీసుకురావాలని ప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో సాధ్యపడలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రతి ఐదువేల మంది జనాభాకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు అన్ని రకాలసేవలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.



ఏటా పదిహేను శాతం వృద్ధే లక్ష్యం


డిస్ట్రిక్ విజన్ యాక్షన్ ప్లాన్ కసరత్తులో

నిమగ్నమైన అధికార యంత్రాంగం

వనరుల ఆధారంగా కీలక రంగాలు వారీ ప్రతిపాదనలు

ఉపాధితోపాటు, ప్రజల ఆదాయం పెంపుపై ప్రధాన దృష్టి

కేంద్రం విజన్ స్ఫూర్తితో గుజరాత్ తర్వాత రాష్ట్రంలోనే అమలు



ఒంగోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రాంతం, రంగం ఏదైనా దూరదృష్టితో పథకాలను అమలు చేయడంతో పాటు వినూత్న కార్యక్రమాలను నిరంతరం ప్రోత్సహించే సీఎం చంద్రబాబు పాలనపైనా దృష్టిపెట్టారు. రానున్న ఐదేళ్ల రాష్ట్రంలో నిర్దిష్ట అభివృద్ధి లక్ష్యంతో ఆయా రంగాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రస్థాయిలోనే కాక జిల్లా స్థాయిలోనూ డిస్ట్రిక్ విజన్ యాక్షన్ ప్లాన్(డీవీఏపీ) రూపొందించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం అధికారులు ఆయా కీలక రంగాల వారీ చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వికసిత భారత్ 2047 పేరుతో విజన్ డాక్యుమెంట్‌ను అక్టోబరు 2న విడుదల చేయనుంది. ప్రస్తుతం భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదోస్థానంలో ఉండగా 2029 నాటికి మూడో స్థానానికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి ప్రపంచంలోనే ప్రథమ స్థానానికి రావాలన్నది ఆ విజన్ లక్ష్యం. తదనుగుణమైన ప్రణాళికలను కేంద్ర స్థాయిలో రూపొందిస్తున్నారు. దానిని ప్రామాణికంగా తీసుకొని దేశంలోని రెండు రాష్ట్రాలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. అందులో గుజరాత్ ఇప్పటికే ప్రణాళికను రూపొందించగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టిసారించింది. అదేసమయంలో జిల్లాలో ఏటా 15శాతం వృద్ధి లక్ష్యంగా రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన చర్యలపై డీవీఏపీలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పేదరిక నిర్మూలన, ఉపాధి మార్గాలు, మౌలిక సదుపాయాల పెంపు తదితర లక్ష్యాలతో డాక్యుమెంట్ తయారు కానుంది. ఆ నేపథ్యంలో శాఖల వారీ అధికారులతో కలెక్టర్ అన్సారియా ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ప్రణాళికలను సెప్టెంబరు 15నాటికి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంది.

కీలక రంగాలపై దృష్టి

జిల్లాలో పేదరిక నిర్మూలన, ఉపాధి మార్గాల పెంపు కోసం కొన్ని రంగాలలో చర్యలు అవసరంగా అధికార యంత్రాంగం గుర్తించింది. ప్రధానంగా వ్యవసాయం, పారిశ్రామిక, సేవా మార్గాలుగా విభజించారు. పండే ప్రధాన పంటలు, వాటి ఆధారంగా పరిశ్రమల అభివృద్ధి, సాగునీటి వసతి కల్పన, విస్తారంగా ఉన్న భూములకు డ్రిప్ ఇరిగేషన్ వంటివి కల్పించాలి. ఉద్యాన పంటల విస్తరణ, ఆక్వారంగం, పాడి పరిశ్రమాభివృద్ధిపై దృష్టిసారించారు గ్రానైట్, ఖనిజ సంపద ఆధారంగా పరిశ్రమల విస్తరణ, తద్వారా ఉపాధి మార్గాల పెంపు అలాగే జిల్లా జనాభా 2011 నాటికి 22.83 లక్షలు కాగా అందులో దాదాపు సగంమంది స్కిల్డ్ కార్మికులు ఉన్నట్లు అంచనా. అలాంటి వారు పనుల కోసం వలసలు వెళ్తున్నారు. వారికి జిల్లాలోనే ఉపాధి కల్పించే స్కిల్ డెవలప్‌మెంట్ చర్యలు చేపట్టాల్సి ఉంది.టూరిజం, టెంపుల్ సర్క్యూట్ వృద్ధి, దాదాపు 50 కిలోమీటర్లకుపైగా ఉన్న తీర ప్రాంతంతో ఉపాధి అంశాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. విద్య, వైద్య రంగాల విస్తరణ, తాగు, సాగునీరు, రోడ్లు ఇతరత్రా రంగాల వారీ చర్యలపై ప్రణాళికలను సిద్ధం చేసే పనిలో అధికారులు ఉన్నారు.

అభివృద్ధి పనులతో ఒంగోలు రూపురేఖలు మారుస్తాం

• ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట



పైప్‌లైన్ శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 22: టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం పలికామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని ఒకటవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి జవహర్ నవోదయ విద్యాలయం వరకు రూ.70లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళలో అభివృద్ధికి దూరంగా ఉన్న నగరానికి రాబోయే ఐదేళ్ళలో మెగా సిటీగా మార్చబోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైన్‌లకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. దశల వారీగా నగరంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ నగర అభివృద్ధిలో భాగంగా ఎంపీ నిధులను కూడా కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో మేలైన విత్తనాలు

• డీఏవో శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో శ్రీనివాసరావు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22: రైతులకు మేలైన విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని డీఏవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఒంగోలులోని జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయలో శాస్త్రవేత్తలు, రైతులు, వివిధశాఖల అధికారులు, రైస్‌మిల్లర్లతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు, మిల్లర్లుతో చర్చించిన తర్వాత మేలైన రకాలను వాడాలన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసే బీపీటీ 5204, ఎన్ఎల్ఆర్ 33892, బీపీటీ 2782, బీపీటీ 2270, ఎంటీయూ 1262, ఎంటీయూ 1156, 1153, 1121 రకాలు, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్‌డీఎల్ఆర్-7 రకాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేయని వరి రకాలను రైతులు వాడవద్దని ఆయన సూచించారు. ఏపీసీడ్స్‌లో ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతామని, రైతులు ఆయా రకాలను సాగుచేసి నష్టపోకుండా మేలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌బాబు, శాస్త్రవేత్తలు రమేష్, సంధ్యారాణి, వరప్రసాద్, ఏపీసీడ్స్ డీఎం బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యేశ్వరి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22: జిల్లాలో జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మలేరియా, పైలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మలేరియా జోనల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి ఆదేశించారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆమె వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ఈ ఏడాది నమోదైన డెంగ్యూ, మలేరియా, గున్యా కేసులపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అన్ని జ్వరాల కేసులను ముందుగా ఆర్‌డీటీ కిట్స్‌తో పరీక్ష చేయాలన్నారు. ఇందులోఓ పాజిటివ్ వస్తే ఎలీషా టెస్ట్ నిర్వహించి నిర్ధారణ చేయాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారికి ఎనిమిది వారాల పాటు మందులు వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో కేసులు నమోదు కాకుండా వైద్యాధికారులు పనిచేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, మలేరియా నివారణాధికారి మాధవీలత, వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ఎం ట్రస్ట్ హాస్పిటల్ ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 22 : ఒంగోలు నగరం కర్నూలురోడ్‌లోని ఆటూరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఎంఎస్ఎం ట్రస్ట్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆయన సతీమణి నాగసత్యలత, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ మెడీ రిహాబ్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను ఒంగోలులో ప్రారంభించడం అభినందనీయమని చెప్పారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు, ఆపరేషన్‌ల నుంచి విముక్తి పొంది సాధారణ జీవితం గడపడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. డాక్టర్ ఏవీ.సుందరరావు, డాక్టర్ శరత్‌చంద్ర, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాయి గణేష్ మాట్లాడుతూ న్యూరో, డయాబెటిక్, కార్డియో పల్మనరీ, ఫైబ్రోమైయాల్జియా, ఆక్సిజన్, ఆర్థోపెడిక్, శస్త్రచికిత్సలు అంశాలకు సంబంధించి సేవలు లభిస్తాయని పేర్కొన్నారు.

29,30వ తేదీల్లో రాష్ట్రస్థాయి సమావేశాలు

• వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22: వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు ఈనెల 29,30 తేదీల్లో ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సుందరయ్యభవన్‌లో గురువారం జరిగిన సంఘం సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 200మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ విజయ్‌రాఘవన్, ప్రధానకార్యదర్శి బి.వెంకట్ విచ్చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న భూమి, వేతనాలు, ఉపాధి, సామాజికసమస్యలు, నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చ ఉంటుదన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్‌హనీఫ్, చీకటి శ్రీనివాసరావు, జి.శ్రీనివాసులు, జి.రమేష్, బి.రఘురాం, వి.బాలకోటయ్య, టి.తిరుపతిరావు, పి.కల్పన, నెరుసుల వెంకటేశ్వర్లు, కేజీ.మస్తాన్, వెల్లంపల్లి ఆంజనేయులు, కె.వెంకటేశ్వర్లు, ఉబ్బా వెంకటేశ్వర్లు, తంబి శ్రీనివాసులు, సయ్యద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యలపై ప్రభుత్వం దృష్టి

కొండపి ప్రాంతంలో తరచూ కరెంటు సరఫరాలో అంతరాయాలతో ఇబ్బందులు • 33 కేవీ సబ్‌స్టేషన్లతో నెట్టుకొస్తున్న విద్యుత్‌శాఖ

130 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారుల పరిశీలనలు

కొండపి, ఆగస్టు 22 : కొండపి ప్రాంతంలో తరచూ విద్యుత్ లోవోల్టేజీ సమస్యలు, అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో.. ఎప్పుడో నిర్మించిన సబ్‌స్టేషన్ల సామర్థ్యం సరిపోకపోవడం వల్ల అన్ని గ్రామాలు లోవోల్టేజి సమస్యతో అల్లాడుతున్నాయి. దాదాపు 35 ఏళ్ల క్రితం 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పదేళ్ల కిందట కె.ఉప్పలపాడు, పెట్లూరు గ్రామాలతోపాటు జరుగుమల్లి మండలంలోని కామేపల్లి, నర్సింగోలు గ్రామాల్లో కూడా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు. ప్రస్తుతం నర్సింగోలు, కామేపల్లి, కొండపి, పెట్లూరు సబ్‌స్టేషన్లకు కందుకూరు 130 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వర్షాకాలంలో తరచూ ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. పాతలైన్లు కావడంతో తరచూ సాంకేతిక సమస్యలూ తలెత్తుతున్నాయి.

వ్యవసాయ కనెక్షన్లు కూడా అధికమే..

కొండపి, జరుగుమల్లి, మర్రిపూడి మండలాల్లో వ్యవసాయ బోర్లు ఎక్కువ. ఈ మండలాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఎత్తిపోతల పథకాలతోపాటు రైతులకు వ్యక్తిగత బోర్లు కూడా అధికంగా ఉన్నాయి. వ్యవసాయ కనెక్షన్లు కూడా ఎక్కువగా ఉన్నాయి. దీంతో వ్యవసాయ సీజన్‌లో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం, లోవోల్టేజీ కారణాలతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

కొండపిలో 130 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు ..

టంగుటూరు, నిడమలూరు, సంతనూతలపాడు మండలంలోని చిలకపాడు 33కేవీ సబ్‌స్టేషన్లకు ప్రస్తుతం ఒంగోలు నుంచి విద్యుత్ సరఫరా ఇస్తున్నారు. కొండపిలో 130/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే జరుగమల్లి మండలంలోని నర్సింగోలు, కామేపల్లి, మర్రిపూడి మండలంలోని జువ్విగుంట, కొండపితోపాటు కొండపి మండలంలోని పెట్లూరు, కె.ఉప్పలపాడు 33/11కేవీ సబ్‌స్టేషన్లకు కొండపి నుంచి విద్యుత్ సరఫరా ఇవ్వొచ్చు. ఒంగోలు, కందుకూరు, పొదిలి ప్రాంతాలకు మధ్యలో ఎటుచూసినా దాదాపు 35 కి.మీ మధ్య ప్రాంతంగా కొండపి ఉంది. అందువల్ల ఆయా సబ్‌స్టేషన్లకు కొండపిలో 130 కేవీసబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ వసతులు ఏర్పడతాయని చెబుతున్నారు. ఆ మేరకు ఇప్పటికే విద్యుత్‌శాఖను పరిశీలన చేయాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అధికారులు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ వాడకం, లోడ్, స్థల అవకాశాలపై నివేదికలు తయారు చేస్తున్నట్లు సమాచారం.

పుల్లలచెరువు వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్

కొత్త సబ్‌స్టేషన్‌ల ప్రతిపాదనలు, మంజూరు తదితర విషయాలపై ఒంగోలు ట్రాన్స్‌కో ఈఈ కృష్ణారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ అడగ్గా పశ్చిమ ప్రకాశం విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు పుల్లలచెరువు సమీపంలో రంగన్నపాలెం వద్ద 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. స్థల సేకరణ పూర్తయిందని, పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. అదేవిధంగా బల్లికురవ మండలంలోని వేమవరం వద్ద 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు వద్ద 130 కేవీ సబ్‌స్టేషన్ మంజూరైందన్నారు. అదేవిధంగా కొండపిలో 130 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవకాశాలపై ప్రతిపాదనలు, శాఖాపరమైన సాంకేతిక అంచనాలు వేస్తున్నట్లు చెప్పారు.



కొండపిలోని 33 కేవీ సబ్‌స్టేషన్

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

• కలెక్టర్ తమీమ్ అన్సారియా

• వచ్చే నెల 11 నుంచి కొత్తపాలసీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 22: ప్రభుత్వం ఉచితంగా అందజేసే ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. గురువారం స్థానిక ప్రకాశంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 11వ తేదీ నుంచి ఉచిత ఇసుక నూతన విధానం అమలులోకి రానుందని తెలిపారు. అప్పటి వరకు జరుగుమల్లి మండలం చతుకుపాడు స్టాక్‌పాయింట్‌లో 4,000 టన్నులు ఇసుక అందుబాటులో ఉందని, వినియోగదారులు అక్కడ నుంచి రవాణా చేసుకునేందుకు సమీపంలో ఉన్న సచివాలయంలో బుక్ చేసుకోవాలని సూచించారు. ఆ సమయంలో లారీ, ట్రాక్టర్ నంబర్లను సచివాలయంలో ఇవాల్సి ఉంటుందని తెలిపారు. తద్వారా సంబంధిత వాహనాలకు స్లాట్ ఇస్తారని, ఆ సమయంలోనే ఇసుక నిల్వ కేంద్రం వద్దకు వాహనాలు వెళ్ళాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఇంకా అవసరాల రీత్యా నెల్లూరు, కడప, గుంటూరు జిల్లాల నుంచి ఇసుక తరలించుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ, పాలేరు, మూసి పరివాహక ప్రాంతాలలో ఇసుక తవ్వకాలను నిషేధించామని, అక్కడ ఎలాంటి తవ్వకాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, మహిళా పోలీసులు అక్రమాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా వినియోగదారుల వద్ద నుంచి అధికంగా రవాణా చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉచిత ఇసుక సరఫరాపై ఫిర్యాదులు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబరు 18005994599, 6281799518 లను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

రవాణా చార్జీలు

- ఉచిత ఇసుక తరలించేందుకు 10 కి.మీ లోపు 6 టైర్లు వాహనానికి రూ.1600, 10-12 టైర్లు వాహనాలకు రూ.2,900, ట్రాక్టర్‌కు రూ.1,200 రవాణా చార్జీలు చెల్లించాలి.
- 20 కి.మీలోపు 6 టైర్ల వాహనానికి రూ.2200, 10-12 టైర్ల వాహనాలకు రూ.3,850, ట్రాక్టర్‌కు రూ.1,900లుగా నిర్ణయించారు.
- 30 కి.మీ వరకు 6 టైర్లు వాహనానికి రూ.2,500, 10-12 టైర్లు వాహనాలకు రూ.4,950, ట్రాక్టర్‌కు రూ.2,400
- 30 కి.మీ నుంచి 50 కి.మీ వరకు 6 టైర్ల వాహనానికి రూ.3,300, 10 టైర్ల వాహనానికి రూ.5,350, 12 టైర్ల వాహనానికి రూ.4,250.
- 50 కి.మీ నుంచి 180 కి.మీలోపు ప్రతి కిలోమీటరుకు రూ.6.25లుగా నిర్ణయించారు.
- 6 టైర్లు వాహనాల్లో 10టన్నులు, 10 టైర్ల వాహనాల్లో 18 టన్నులు, 12 టైర్ల వాహనాల్లో 21టన్నులు, ట్రాక్టర్‌కు 5 టన్నులు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉంది.

పీడీయాక్ట్ కింద కేసులు పెడతాం : ఎస్పీ

ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడిచే విధంగా అక్రమంగా తరలిస్తే పీడీయాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. అలాంటి వారి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇసుక రవాణాపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుదని చెప్పారు. ఈ సమావేశంలో జేసీ ఆర్.గోపాలకృష్ణ, ఏఎస్పీ కె.నాగేశ్వరావు, గనులశాఖ డీడీ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంతాన్ని ఉద్యానకేంద్రంగా మార్చాలి

• కలెక్టర్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22: జిల్లాతో పాటు పశ్చిమప్రాంతాన్ని హార్టీకల్చర్(ఉద్యాన) కేంద్రంగా మార్చడానికి ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ దిశగా మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం ఉద్యానశాఖ, మైక్రో ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణం, వీటి విస్తీర్ణాన్ని పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. రైతులకు సబ్సిడీపై ఇస్తున్న పరికరాలు, పథకాలపై కలెక్టర్‌కు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయా శాఖల అధికారులు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేలా రైతులకు అవసరమైన సూచనలు, సాంకేతిక సలహాలు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయి అధికారులు ఇచ్చేలా చూడాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ఉద్యాన పంటల సాగులో జిల్లా ముందడుగు వేసేందుకు ఈనెలాఖరు నాటికి ప్రణాళికలు రూపొందించి అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లాఉద్యానశాఖ అధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీడీ పీవీ.రమణ, ఎంహెచ్‌వోలు, ఎంఐఏవోలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన పీఆర్ డైరెక్టర్

టంగుటూరు, ఆగస్టు 22 : ఏపీ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ మైలవరపు వీఆర్.కృష్ణతేజ గురువారం మండలంలోని సూరారెడ్డిపాలెం, జయవరంలో జరుగుతున్న ఉపాధి పనులు జరిగే ప్రాంతాన్ని సందర్శించారు. సూరారెడ్డిపాలెంలో ఆయన పనులు చేస్తున్న కూలీలు, ఉపాధి కార్యాలయ సిబ్బందితో మాట్లాడారు. ఉపాధి పనుల రోజు కూలి రూ.300 పొందాల్సి ఉండగా రూ.231 మాత్రమే ఎందుకు దక్కుతుందని కమిషనర్ కూలీలను ప్రశ్నించారు. సిబ్బంది సూచించే కొలతల ప్రకారం పని చేసి రోజు కూలి పూర్తి స్థాయిలో పొందాలని కమిషనర్ సూచించారు. కూలీలు మాట్లాడుతూ ఇప్పటికే 90 కూలి రోజులు ముగింపునకు వచ్చాయని, పనిదినాలను 120 రోజులకు పెంచాలని కోరారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి గోకులం షెడ్లకు అన్ని పనులు 23న జరిగే గ్రామసభలో పెట్టి తీర్మానాలు పొంది ప్రపోజల్స్ ప్రిపేర్ చేయాలని ఆయా శాఖల ఏఈ, డీఈలకు కమిషనర్ సూచించారు. అనంతరం జయవరం చేరుకొని అక్కడ కొనసాగుతున్న పండ్లతోటల పెంపకాలను పరిశీలించారు. ప్లాంట్ ఆఫ్ మదర్ ప్రోగ్రాం కింద రైతు పొలంలో మొక్కలు నాటించారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ అర్జునరావు, జడ్పీ సీఈవో హనుమంతరావు, డీపీవో ఉషారాణి, అడిషనల్ పీడీ వందర్‌మ్యాన్, ఎంపీడీవో రత్నజ్యోతి, ఏపీవో సుభాషిణి, ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ పీడీ వెంకటస్వామి, జిల్లా, మండల స్థాయి అధికారులు, డీఈ పీఆర్ రవిబాబు, డీఈ ఆర్‌డబ్ల్యూస్ వెంకటేశ్వర్లు, హెచ్‌వో హర్షతేజ, సూరారెడ్డిపాలెం సర్పంచ్ నర్రా శైలుషా, జయవరం సర్పంచ్ రమణమ్మ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న కృష్ణతేజ

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22 : జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక లాయర్‌పేటలోని డొక్కా సీతమ్మ క్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఆరిగ శ్రీనివాసరావు, టీడీపీ నాయకురాలు చంగలశెట్టి మంగమ్మ, పువ్వాడ శ్యామ్, అశోక్ పాల్గొన్నారు. చిరంజీవి అభిమాని డాక్టర్ చెంచురామిరెడ్డి, జస్వంత్‌రెడ్డి ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరులోని ఏకలవ్య కాలనీలో జనసేన పార్టీ జిల్లా సహాయకార్యదర్శి పెంట్యాల కోటి జన్మదిన కేకును కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెంట్యాల శ్రీనివాసరావు, నిడికొండ వెంకటేశ్వర్లు, కొత్రా అనీల్, పెంట్యాల కిరణ్, నాగరాజు, పాలపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



ఉప్పుగుండూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు

నేడు ఉపాధి హామీ గ్రామసభలు

సంతనూతలపాడు, ఆగస్టు 22 మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద 2024-25 సంవత్సరానికి గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు. గురువారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడారు. మండలానికి ఉపాధి హామీ పథకం కింద ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ రూ.4కోట్లు కేటాయించారని ఏపీడీ పి.వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో వాసంతి పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో..

నాగులుప్పలపాడు: మండల పరిధిలోని గ్రామాలలో ఈనెల 23న గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయమణి తెలిపారు. గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. నోడల్ అధికారులు, గ్రామస్థాయి, ఉపాధిహామీ అధికారులు సమక్షంలో గ్రామసభలు నిర్వహించాలని, ఇందులో ప్రజలు పాల్గొనాలని ఎంపీడీవో కోరారు.

టంగుటూరులో..

టంగుటూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి జరిగే గ్రామ సభలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరవుతారని మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, అన్ని విభాగాల నేతలు గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామ అభివృద్ధి తీర్మానాలను నిర్ణయించాలని కోరారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతోపాటు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కోశాధికారి డీవీఎన్.స్వామి, జిల్లా నాయకులు ఎంఎస్.సాయి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ ఘటనలో అనేకమంది కార్మికులు చనిపోగా 50మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయన్నారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు నాభిశిల ప్రతిష్ఠ

చీమకుర్తి, ఆగస్టు 22: నిప్పట్లపాడు గ్రామంలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి ప్రతిష్ఠా విగ్రహాలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. జలాదివాసం, క్షీరాదివాసం, ప్రత్యేక హోమాలు చేశారు. శుక్రవారం వేకువజాము నుంచి నాభిశిల, ద్రిక్ చంత్ర ప్రతిష్ఠ తదుపరి అమ్మవారి ప్రతిష్ఠా మహోత్సవంను వైభవంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

అవీ..ఇవీ..

నేడు డ్వామా పీడీపై జేసీ విచారణ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22: జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ అర్జునరావు అక్రమాలు, అవినీతిపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మరోసారి విచారణ చేయనున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు స్థానిక కలెక్టరేట్‌లో జరిగే విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే డ్వామాలో పనిచేసే వివిధ కేడర్ల అధికారులు, ఉద్యోగులతో విచారణ చేసిన జేసీ శుక్రవారం డ్వామాలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులతో విచారణ చేయనున్నారు. డ్వామా పీడీ అర్జునరావు మండలాలకు తనిఖీల పేరుతో హడావుడి చేయడమే కాకుండా అడిగినంత ఇచ్చుకోకపోతే ఉద్యోగులను హీనంగా చూస్తూ అవహేళన చేస్తున్నారని డ్వామా ఉద్యోగులు ఆందోళనలు నిర్వహించి విచారణాధికారి జేసీ వద్ద ఏకరువు పెట్టారు. మరోసారి జేసీ డ్వామా అధికారులతో విచారణ చేస్తుండటంతో చర్చనీయాంశంగా మారింది.

నేడు ప్రకాశంపంతులు జయంతి వేడుకలు : డీఈవో

ఒంగోలు(విద్య), ఆగస్టు 22: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని డీఈవో డి.సుభద్ర గురువారం ప్రకటనలో కోరారు. విద్యార్థులకు ప్రకాశం పంతులు దేశభక్తి, ధైర్యసాహసాలను వివరించాలని హెచ్ఎంలను ఆదేశించారు.

నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం : జాతీయ అంతరిక్ష దినోత్సవం శుక్రవారం పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని డీఈవో సుభద్ర కోరారు. విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాపులు, ఎగ్జిబిషన్, కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలన్నారు. వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలని డీఈవో ఆదేశించారు.

సీబీఎస్ఈ పరీక్షా కేంద్రాల సందర్శన

ఒంగోలు(విద్య), ఆగస్టు 22: ఒంగోలులోని పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ట్యాబ్ ఆధారిత ఎఫ్ఏ-1 పరీక్షా కేంద్రాలను సమగ్ర శిక్ష జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారి ఎం.రమేష్ గురువారం సందర్శించారు. స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్‌హైస్కూలులోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణలో ఏమైనా సాంకేతిక సమస్యలు వచ్చాయా అని హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహణపై హెచ్ఎంలకు, ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. డీఆర్ఆరఎం హైస్కూలులో 117, పీవీఆర్ బాలుర హైస్కూలులో 66 మంది విద్యార్థులకు పరీక్షకు హాజరయ్యారు.

క్విస్ కళాశాల హెచ్‌వోడీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డును అందుకుంటున్న హిమబిందు

ఒంగోలు(విద్య), ఆగస్టు 22: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతికి జేఎన్‌టీయూకే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేసింది. జేఎన్‌టీయూ కాకినాడ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 2023-24 విద్యా సంవత్సరానికి అధ్యాపకులకు ఉత్తమ ప్రశంసాపత్రాలను ప్రకటించింది. ఇందులో క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి సీహెచ్.హిమబిందు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. యూనివర్శిటీ ఆవిర్భావ వేడుకలకు హాజరైన రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ రామమోహన్‌రావు, కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్, జేఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణలచేతుల మీదుగా హిమబిందు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం హిమబిందును కళాశాల కరస్పాండెంట్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, వైస్‌చైర్మన్ ఎన్.గాయత్రి ప్రత్యేకంగా అభినందించారు.

పని సర్దుబాటు అవసరమైన మేరకే చేయాలి

ఒంగోలు(విద్య), ఆగస్టు 22: ఉపాధ్యాయుల పని సర్దుబాటు అవసరమైన మేరకే చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకట్రావు, బి.అశోక్‌కుమార్, గౌరవాధ్యక్షులు ఎ.అమ్మయ్య, ఐఫియా కౌన్సెలర్ పీవీ.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు, మాతృత్వ సెలవులో ఉన్న టీచర్ల స్థానాల్లో పనిసర్దుబాటు ద్వారా టీచర్లను నియమించాలని, ఎస్‌జీటీలను బలవంతంగా హైస్కూళ్ళకు పంపవద్దని, ఎంపీ స్కూళ్ళకు 8 తరగతుల ఆధారంగా టీచర్లను కేటాయించాలన్నారు. ఏ యాజమాన్యంలో పని చేసే టీచర్లను అదే యాజమాన్యంలో సర్దుబాటు చేయాలని, అవసరమైతే విద్యా వలంటీర్లను నియమించాలని వారు కోరారు.

కొండపిలో తేలికపాటి వర్షం

కొండపి, ఆగస్టు 22 : కొండపి ప్రాంతంలో గురువారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. గడచిన పక్షం రోజులుగా తీవ్రమైన ఎండలు కాశాయి. ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు తేలికపాటి వర్షంతో ఊరటచెందారు. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కేవైసీ నమోదు చేయించుకోవాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 22: ఉప్పుగుండూరు సహకార సంఘంలో (సొసైటీ) రూ.300 షేర్ ధనం ఉన్న సభ్యులు కేవైసీ నమోదు చేసుకోవాలని సొసైటీ ప్రత్యేకాధికారి చుండూరి సతీష్, నోడల్ అధికారి సుభాషిని గురువారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంప్యూటరీకరణంలో భాగంగా ప్రతి సభ్యుడు తమ ఆధార్ కార్డు, ఫొటో, ఫోన్ నెంబర్, నామినీ వంటి వివరాలను సొసైటీలోని సీఈవోకు వెంటనే అందజేసి కేవైసీ నమోదు చేసుకోవాలని వారు కోరారు.

ఎస్సై నాగమల్లేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగమల్లేశ్వరరావు

టంగుటూరు, ఆగస్టు 22 : టంగుటూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నాగమల్లేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నాగమల్లేశ్వరరావు నియామకం జరిగి సుమారు రెండు వారాలు దాటింది. ఉన్నతాధికారుల ఒత్తిడితో ఆయన ఎట్టకేలకు గురువారం టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. నాగమల్లేశ్వరరావు ముండ్లమూరు నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358

సంతనూతలపాడు, ఆగస్టు 22: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో గురువారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.358 పలికింది. పేర్నమిట్ట క్లస్టర్ నుంచి 1,388 బేళ్లు రాగా 1,223 బేళ్లు అమ్ముడయ్యాయి. 165 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.303.83 వచ్చినట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ ముందు వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టంగుటూరు, ఆగస్టు 22 : పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చినా తనకు న్యాయం జరగలేదంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన టంగుటూరు పోలీస్‌స్టేషన్ ఎదుట గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... మండలంలోని జమ్ములపాలెంకు చెందిన పక్కెల కుమార్‌బాబు సొంత సమస్యలున్నాయి. పోలీసుల వద్దకు వచ్చినా తనకు న్యాయం జరగేలేదంటూ పోలీస్‌స్టేషన్ ఎదురు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతన్ని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆయన రిమ్స్‌కు వెళ్లగానే జమ్ములపాలెంలోని అతని వ్యతిరేక వర్గం వచ్చి స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కుమార్‌బాబు రిమ్స్ నుంచి డిశ్చార్జ్ అయినట్లు తెలిసింది.

25న జీవశాస్త్ర టీచర్లకు శిక్షణ

ఒంగోలు(విద్య), ఆగస్టు 22: జిల్లాలోని జీవ శాస్త్ర ఉపాధ్యాయులకు ఈనెల 25న ఆంధ్రప్రదేశ్ జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందనహాలులో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. ఈ ఏడాది పదో తరగతి సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ బోర్డు సిలబస్‌కు సంబంధించి కొత్త పాఠ్యపుస్తకాలు, పరీక్షా విధానాలపై తగిన సూచనలతో రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లు, ఎస్‌సీఈఆర్టీ అధికారులు మార్గదర్శనం చేస్తారన్నారు. జిల్లాలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని డీఈవో కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ



ఎస్ఐ రమేష్‌బాబును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

మర్రిపూడి, ఆగస్టు 22 : గ్రామాలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. గురువారం మర్రిపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం టీడీపీ నాయకులు రేగుల వీరనారాయణ, తుళ్లూరి నరసింహారావు, చేరెడ్డి నార్పారెడ్డి, గొంటు హనుమారెడ్డి, బాలనరసయ్య, కొప్పర్తి భాస్కర్‌రెడ్డి, పీసెళ్ళ శ్రీనివాసరావు, గురజాల పోలయ్య, మాదిగ జర్నలిస్ట్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బాబురావు, జార్జి, రాజు, కోండ్రు జాన్, నేలపాటి నర్సయ్య, పద్దయ్య, సామ్యేలు ఎస్ఐకు అభినందనలు తెలిపారు.

మినీ బైపాస్‌కు అనుకూలం

» అంతర్గత రహదారులను కలిపితే సరి
» సర్వీస్ రోడ్ల అనుసంధానంతో మేలు

మార్టూరు, ఆగస్టు 22 : భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మార్టూరు గ్రామంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొత్తగా మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేకంగా స్థలాన్ని సేకరించాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఆక్రమణలు తొలగించాల్సిన పనీ లేదు. మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టవలసిన రహదారిలో మౌళికంగా మార్టూరు రహదారులు ఉన్నాయి. గ్రామంలో అంతర్గత రహదారులను కలుపుతూ, గ్రామ శివార్లో ఉన్న రహదారిని కలుపుతూ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూపకల్పన చేయడానికి అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామం నడిబొడ్డు నుంచి ఈ మినీ బైపాస్ రోడ్ నిర్మాణం కొనసాగే అవకాశం ఉండడంతో, అంతర్గత రహదారులకు కాకుండా, గ్రామ శివార్లలో ఉన్న రహదారులకు మాత్రమే నిధులు అవసరం ఉంది.


మిల్లుబాబు గ్రానైట్ పరిశ్రమ వద్ద సర్వీసు రోడ్డు నుంచి మార్టూరులోకి అంతర్గత రహదారి.. మార్టూరు నుంచి బయటకు వచ్చే రోడ్డు.. మినీ బైపాస్‌లో రాజుగారిపాలెం - ప్రభుత్వ జూనియక్ కాలేజీ కూడలి

బైపాస్ రూట్‌మ్యాప్

మార్టూరు సెంటర్లో జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైవోవర్‌కు తూర్పు వైపున ఉన్న సర్వీసు రోడ్డు నుంచి మార్టూరు గ్రామంలోకి ప్రారంభిస్తే మినీ బైపాస్ రోడ్డు మరలా జొన్నతాళి వెళ్లే ఈ సర్వీసు రోడ్డులోకి చేరుకుంటే రోడ్డు ముగుస్తుంది. అంటే డేగరమూడి రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్డులో మిల్లుబాబు గ్రానైట్ పరిశ్రమ దగ్గర నుంచి మార్టూరు గ్రామంలోకి రోడ్డు (మురికిపూడి డొంక రోడ్డు) ఉంది. ఈ రోడ్డు పక్కన కొంతదూరం తూర్పు వైపున గ్రానైట్ పరిశ్రమలు, పడమర వైపున రెండు ప్రముఖ విద్యా సంస్థలు ఉన్నాయి. అదే విధంగా ఈ రోడ్డు ముందుకు సాగుతూ రామ్‌నగర్, నేతాజీ నగర్, గ్రామ పంచాయతీ కార్యాలయం, బడ్డురాయి సెంటర్, పడమర బజారు, బలరాం కాలనీ, మంచినీటి వాటర్‌ప్లాంట్ నుంచి మంచినీటి చెరువు పక్క నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు, అక్కడ నుంచి గ్రానైట్ పరిశ్రమలు, నూలు మిల్లులు మధ్య మట్టిరోడ్డు గుండా అమరావతి నూలు మిల్లు పక్కన సర్వీసు రోడ్డుపైకి చేరుతుంది.

మినీబైపాస్ రోడ్డు దూరం సుమారు 4.5 కిమీ

మార్టూరు గ్రామంలో మినీ బైపాస్ రోడ్డును రూపకల్పన చేస్తే దాదాపుగా 4.5 కిమీ దూరం ఈ రోడ్డు కొనసాగుతుంది. వాటిలో గ్రామంలో ప్రజానీకం నివసించే అంతర్గత రహదారులు సుమారు 2కి.మీ. వరకు గతంలోనే సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగింది. ఇక మిగిలిన 2.5 కిమీ వరకు మాత్రమే సిమెంట్ రోడ్, లేదా తారురోడ్డు నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉంది. రామ్‌నగర్, నేతాజీనగర్ కూడలి సమీపంలో నుంచి సర్వీసురోడ్డు వరకు, ఘట్టేశ్వరస్వామి ఆలయం సమీపంలో కొంతవరకు మాత్రమే సీసీ రోడ్డును నిర్మించాలి. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డు, అక్కడ నుంచి గ్రానైట్ పరిశ్రమల మధ్య గుండా అమరావతి నూలు మిల్లు పక్కన ఉన్న జొన్నతాళి వెళ్లే సర్వీసు రోడ్డుపైకి చేరే బైపాస్ రోడ్డు వరకు పూర్తిగా ప్రస్తుతం మట్టిరోడ్డు ఉంది. మట్టి రోడ్డును మాత్రం తారురోడ్డుగా నిర్మిస్తే మార్టూరులో మినీ బైపాస్ రోడ్డు ఒక కొలిక్కి వచ్చేసినట్లే.

మురుగు నీటికి చెక్ పడుతుంది

మిల్లుబాబు గ్రానైట్ పరిశ్రమ నుంచి మినీబైపాస్ రోడ్ రూపకల్పన జరిగితే ఈ రోడ్‌లో దాదాపుగా అర కిలోమీటరు దూరం వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద మురుగునీటి గుంతలు ఉన్నాయి. అదేవిధంగా రోడ్డుకు పక్కనే వెయ్యి మంది విద్యార్థులు చదువుకునే రెండు ప్రముఖ విద్యా సంస్థలు ఉన్నాయి. సమీపంలోనే ఎస్‌సీ కాలనీ ఉంది. ఈ మురుగునీటి గుంతలు కారణంగా పూర్తిస్థాయి అపరిశుభ్రమైన వాతావరణం అక్కడ ఉంది. తరచూ వ్యాధులు, రోగాలతో పిల్లలు బాధపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే మురుగునీటి నిల్వ ఉండే అవకాశం లేదని కాలనీవాసులు భావిస్తున్నారు. దానికి తోడు రోడ్డు నిర్మాణం జరిగితే సమీపంలోని గ్రానైట్ పరిశ్రమల యజమానులు కూడా ఆర్థికంగా సహాయ సహకారాలు అందించే అవకాశాలు ఉన్నాయి.

ప్రయాణం సులభం

మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే మార్టూరు, బొబ్బేపల్లి, గన్నవరం, రాజుగారిపాలెం, జొన్నతాళి, ద్రోణాదుల తదితర గ్రామాల వాసులు ఈ రహదారి గుండా ప్రయాణం చేసే అవకాశం ఉంది. దాంతో మార్టూరులోని ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య నుంచి బయటపడే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ నిధులతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తే భవిష్యత్‌లో ప్రయోజనకరంగా ఉంటుంది.


మంత్రికి చెక్‌ను అందజేస్తున్న దాత

హనుమంతరావు దాతృత్వం ఆదర్శనీయం

● మంత్రి గొట్టిపాటి

బల్లికురువ, ఆగస్టు 22 : జగన్‌రెడ్డి అన్న క్యాంటీన్‌లను మూసేసి పేదల నోటి దగ్గర ముద్దను కొట్టేశారని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించి పేదల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన మల్లిపెద్ది హనుమంతరావు అన్నక్యాంటీన్ నిర్వహణకు తన వంతుగా రూ.10వేల నగదును మంత్రికి అందజేసారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపేందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లకు విరాళం అందజేసిన హనుమంతురావు దాతృత్వం పలువురికి ఆదర్శనీయం అన్నారు.

డయేరియాపై అప్రమత్తం

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 22 : డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కారంచేడు ప్రభుత్వ వైద్యులు జి.సురేష్ బాబు అన్నారు. డయేరియా వ్యాధి నివారణకు వైద్యశాలలో అన్ని వసతులు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డయారియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడంతోపాటు, పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

బస్సుషెల్టర్‌లో వృద్ధుడి మృతి

ఇంకొల్లు, ఆగస్టు 22 : ఇంకొల్లులో సినిమాహాల్ సెంటర్ సమీపంలోని బస్సు షెల్టర్‌లో ఓ వ్యక్తి మృతి చెందారు. గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచాం ఇవ్వగా ఎస్‌ఐ సురేష్ చేరుకొని మృతి చెందిన వ్యక్తి వివరాలు సేకరించారు. మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన మల్లెం పాపారావు(70) కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయి బస్సు షెల్టర్‌లోనే ఉంటున్నారు. తీవ్ర అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

అద్దంకి, ఆగస్టు 22 : స్కూటీ, మోటార్‌సైకిల్ ఢీ కొనగా ఇద్దరికి గాయాలు అయ్యాయి. వెనుక నుంచి వచ్చిన లారీ స్కూటీపై నుంచి పోవడంతో వాహనం నుజ్జునుజ్జయింది. పట్టణంలోని రాజీవ్‌కాలనీ వద్ద నామ్ రోడ్డులోకి స్కూటీ రాగా కాకానిపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న మోటార్‌సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న నరహరి, స్కూటీపై ఉన్న శైలజకు గాయాలయ్యాయి

ఒంగోలు నగర కమిషనర్‌గా వెంకటేశ్వరరావు



ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 22 : ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కే. వెంకటేశ్వరరావును నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నరసాపురం కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఒంగోలుకు బదిలీ చేయగా, ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎం.జశ్వంత్‌రావును డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు ఆయన తెనాలి నుంచి ఒంగోలుకు బదిలీ కాగా, ఆరు నెలలు తిరగకుండానే మళ్లీ బదిలీ అయ్యారు. ఇదిలాఉండగా, ఒంగోలు కమిషనర్‌గా కె.వెంకటేశ్వరరావు నియమితులవుతారని టీడీపీ కూటమి అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రచారం జరగ్గా, ఎట్టకేలకు ఆయనే ఒంగోలుకు వచ్చారు. సోమవారం తర్వాత వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

పామూరు, ఆగస్టు 22: విద్యార్థులు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో సుభద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో రాణించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత, ఫర్నిచర్ కొరత ఉందని ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరంగా భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.రామస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సృజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

చినగంజాం, ఆగస్టు 22 : మండలంలోని పల్లెపాలెం గ్రామ శివారులో పేక ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్.రమేష్ గురువా రం తెలిపారు. పేకాట శిబిరంపై దాడి చేసి 7గురిని అదుపులోనికి తీసుకొని, వారి నుంచి రూ.600 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


శంకరాపురంలో సబ్ స్టేషన్‌ను సందర్శించిన ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ దేవరపల్లి సుబ్బారావు

రైతులకు నాణ్యమైన విద్యుత్

● చీఫ్ జనరల్ మేనేజర్ దేవరపల్లి సుబ్బారావు
● శంకరాపురంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల పరిశీలన

ముండ్లమూరు, ఆగస్టు 22: రైతులకు మెరుగైన విద్యుత్‌ను తొమ్మిది గంటల పాటు ఇచ్చేందుకు ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్‌మేనేజర్ దేవరపల్లి సుబ్బారావు అన్నారు. గురువారం ముండ్లమూరు మండలంలోని శంకరాపురం సబ్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సోలార్ ఏర్పాటు చేసేందుకు పలువురు రైతుల భూములను పరిశీలించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ప్రకాశం జిల్లాలో మొదటి సారిగా ముండ్లమూరు మండలంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఇందుకు గాను స్థల సేకరణ ఏర్పాట్లుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 286 సబ్ స్టేషన్‌ల పరిధిలో సుమారు 1500 ఎకరాల సేకరణ జరుగుతుందన్నారు. ఒక్కో ఎకరానికి రూ.30 వేలు కౌలు రైతుకు చెల్లిస్తామని చెప్పారు. రెండు సంవత్సరాల తరువాత ఐదు శాతం పెంచుతామన్నారు. ప్రతి సబ్ స్టేషన్ పరిధిలో ఒకటిన్నర కిలో మీటరు పరిధిలో 20 ఎకరాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఈప్లాంట్ ద్వారా నాలుగు మెగావాట్ల విద్యుత్ తయారవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ కేవీజీ సత్యనారాయణ, దర్శి సబ్‌డివిజన్ ఈఈ ఎస్‌ఏ కరీం, డీఈ ఇ.శ్రీనివాసులు, ఏడీఈలు కె.పిచ్చయ్య, ఆర్.మోహనరావు, ఏఈ వీరబ్రహ్మం, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమంటే కారుతో ఢీ కొట్టాడు..

కురిచేడు, ఆగస్టు 22: అప్పు తీర్చమంటే కారుతో ఢీకొట్టిన ఘటన గురువారం కురిచేడులో చోటుచేసుకుంది. మండలంలోని వెంగాయపాలెంకు చెందిన ఊట్ల చిన్నమునెయ్యకు కురిచేడుకు చెందిన ప్రసాద్ చిట్టీపాటలకు సంబంధించి రు.8 లక్షలు ఇవ్వాలి. చాలా కాలంగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఒత్తిడి చేస్తున్నాడు. ఈక్రమంలో ఉదయం చిన్నమునెయ్య దర్శి రోడ్డులో ఎన్నెస్పీ కాలువ వరకు టీవీఎస్ వాహనంపై వెళ్ళివస్తున్నాడు. కారులో అతడిని ప్రసాద్ వెంబడిస్తూ మార్గమధ్యలో మోపెడ్‌ను ఢీ కొట్టాడు. ఈఘటనలో మునెయ్య రోడ్డు పక్కనే ఉన్న కంకరపై పడటంతో కాలికి దెబ్బ తగిలింది. వెంటనే అతడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈవిషయమై మునెయ్య కురిచేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు దొనకొండలో ప్రజావేదిక

దొనకొండ, ఆగస్టు 22: స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద శనివారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఎం దేవయ్య తెలిపారు. డ్వామా పీడీ అర్జునరావు, జిల్లా విజిలెన్స్ అధికారిణి ఝాన్సీరాణి, ఎంపీడీవో వసంతరావు నాయక్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వెంటాడుతున్న వర్షాభావం

ఖాళీగా ఉన్న పొలాలు

చీరాల, ఆగస్టు 22 : ఈ ఏడాది నైరుతి రుతు పవనాల గమనం చురుగ్గా లేదు. వర్షాలు సక్రమంగా లేవు. వరుణుడు ముఖం చాటేయడంతో పంటల సాగుకు ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. చీరాల నియోజవకవర్గంలో ఇసుక నేలలు ఎక్కువ. ప్రధాన నీటివనరు కొమ్మమూరుకాలువ. వర్షాధారంతో పాటు బోర్లు, స్పింక్లర్ల ద్వారా కూడా పంటలు పండిస్తుంటారు. కొద్ది రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. కొమ్మమూరుకాలువకు నీరులేదు. ఈ నేపథ్యంలో బోర్లలోని నీరు కూడా అడుగంటుతుంది. దీం తో ప్రధాన పంటలైన మొక్కజొన్న, మిను ము సాగుచేసేందుకు సిద్ధం చేసిన దుక్కలు ఖాళీ గా ఉనానయి. బోర్లు, స్పింక్లర్లతో సాగుచేసేందుకు ఎంతో కొంత అవాకశం ఉన్న ఆకుకూరలు, కూరగాయలుతో పాటు కొందరు వేరుశనగ సాగు చేశారు. నీటి వసతి ఎంత ఉన్నా, వర్షంతో పైరు తడిస్తే ఆ పంట ఎదుగుదల బాగుంటుంది. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. మాగాణి సాగుకు మరికొంత సమయం ఉంది. ప్రస్తుతం ఆరుతడి పంటలకు, ఆకుకూరలకు వర్షం అవసరం. వరుణుడి కరుణ కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు.


ఖాళీగా ఉన్న పొలాలు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 22 : చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తరచూ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, వాటి డ్రైవర్లను పట్టుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉంది. ఇసుక ట్రాక్టర్లు రోడ్డెక్కుతున్నాయంటే అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనేది నిజం. ఈ నేపథ్యంలో క్వారీలలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున మండల పరిధిలోని అక్కాయిపాలెం వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉచిత ఇసుక విధానం అమలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పదే, పదే చెప్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో రాత్రి వేళల్లో కొనసాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ ఎలాంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాలి.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి, ఆగస్టు 22: మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మురుగుమ్మి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. లోవోల్టేజీ సమస్యతో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు వివరించారు. ఈందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ మండల ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడానికి నూతన సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్టు చెప్పారు. సబ్‌స్టేషన్లు తక్కువగా ఉండడంతో పాటు విద్యుత్ వినియోగం పెరగడంతో ఈ సమస్య ఎదురవుతుందన్నారు. తాను ఎమెల్యేగా ఉన్న సమయంలోనే పీసీపల్లి మండలంలోని గుంటుపల్లి, మురుగుమ్మి, తలకొండపాడు గ్రామాలకు మూడు నూతన సబ్‌స్టేషన్లను మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించగా గుంటుపల్లికి మంజూరయిందన్నారు. ఆతరువాత వచ్చిన పాలకులు మురుగుమ్మి, తలకొండపాడు లో సబ్‌స్టేషన్‌ల ఏర్పాటును విస్మరించారన్నారు. ఈ రెండు సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయించేందుకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో చర్చించినట్టు చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి మంజూరుచేయించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణానికి మురుగుమ్మి గ్రామసమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమలో ఓబుల్‌రెడ్డి, హనుమారెడ్డి, క్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర తదితరులు

సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉగ్ర ప్రత్యేక పూజలు

పామూరు : మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో చండీ రుద్రహోమాలు, కుంభాభిషేకం, శాంతి కల్యాణం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి టీడీపీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి స్వామివార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, బొయిళ్ల నారాయణరెడ్డి, యారవ శ్రీనివాసులు, కొండా రవీంద్రనాథ్ రెడ్డి, దుగ్గిరెడ్డి లక్ష్మీ నారాయణరెడ్డి, యారవ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, ఆగస్టు 22: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారులుగా పనులు చేస్తూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక విధానాలను పక్కన బెట్టి సీఎం చంద్రబాబు ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

దర్శి నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ లక్ష్మి అన్నారు. రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం, తాగు, సాగునీటి వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. తాళ్లూరు మండల ప్రజల సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో మొగిలిగుండాల రిజర్వాయర్ మంజూరయిందన్నారు. నేటికీ అది పూర్తి కాలేదన్నారు. నిర్మాణ పురోగతిపై అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయిస్తామని చెప్పారు. తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్అండ్‌బీ రహదారి దుస్థితిని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈమార్గంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ కూడా పూర్తియిందని తెలిపారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో సంప్రదించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎస్వీ రామయ్య, శాగం కొండారెడ్డి, షేక్ కాలేషావలి, తహసీల్దార్ పి.సింగారావు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఏపీఎం దేవరాజ్, పశువైద్యాధికారి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి


ఎస్సైను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పొదిలి, ఆగస్టు 22 : గ్రామాలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ వేమన అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తానన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి ఘర్షణలు జరగకుండా చూస్తామన్నారు. కొన్ని కీలక గ్రామాల్లో తరుచూ పేకాట ఆడుతున్నట్లు సమాచారం ఉందన్నారు. జూద శిబిరాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన్ను టీడీపీ నాయకుడు గునుపూడి భాస్కర్, జిల్లా ముస్లీం మైనారిటీ నాయకులు షేక్ రసూల్, మాజీ మండలాధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శివాలయం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీనివాసులు, నాయకులు యాసిన్, గోగినేని వెంకట్రావు, సోమయ్య, రాజు, మాజీ ఉపసర్పంచ్ జిలాని, రామాపురం కొండలు, తానికొండ వెంకట్రావు, మీగడ ఈశ్వరరెడ్డి తదితరులు కలిసి శాలువాలు కప్పి బొకేలు అందజేసి అభినందించారు.

డివైడర్‌పైకి దూసుకుపోయిన లారీ


డివైడర్‌పైకి దూసుకుపోయిన లారీ

బేస్తవారపేట, ఆగస్టు22 : అనంతపురం-అమరావతి జాతీయ రహదారిలో డివైడర్ పైకి లారీ ఎక్కింది. దీంతో లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. వివరాల్లోకి వెళితే, ప్రొద్దుటూరు నుండి భువనేశ్వర్‌కు మిర్చిలోడ్‌తో లారీ వెళుతోంది. బేస్తవారపేట పట్టణంలో జాతీయ రహదారి అంచులో ఏర్పాటు చేసిన బారీకేడ్లు మీదుగా డివైడర్ ఎక్కింది. ఎదురుగా వచ్చే ఆటోను తప్పించే క్రమంలో ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ పోలీసులకు తెలిపారు.

చిమ్మచీకటిలో ఏటీఎం

గిద్దలూరు, ఆగస్టు 22 : పట్టణంలోని చిన్న మసీదు కూడలిలోని స్టేట్‌బ్యాంక్ ఏటీఎం సెంటర్‌లో తరచూ లైట్లు వెలుగడం లేదు. దీంతో రాత్రులు డబ్బులు డ్రా చేసుకునే ఖాతాదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. మూడు రోజులుగా ఈ ఏటీఎంలో లైట్లు వెలుగక పోవడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్టేట్‌బ్యాంక్ అధికారులు స్పందించి ఏటీఎంలో పోయిన లైట్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

పట్టణ ఎస్‌ఐగా సైదుబాబు



మార్కాపురం, ఆగస్టు 22: మార్కాపురం పట్టణ ఎస్‌ఐగా ఎం.సైదుబాబు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన పామూరు నుంచి బదిలీపై మార్కాపురం వచ్చారు. పట్టణంలో అరాచక శక్తులను అణిచివేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతానని అన్నారు. దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య తీర్చేందుకు కృషి చేస్తామన్నారు.

రూరల్ ఎస్‌ఐగా అంకమ్మరావు బాధ్యతలు



అంకమ్మరావును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

మార్కాపురంరూరల్, ఆగస్టు 22: మార్కాపురం రూరల్ ఎస్సైగా పి.అంకమ్మరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంకమ్మరావు గతంలో దోర్నాలు ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన వెంకటేశ్వరనాయక్ ఒంగోలు జిల్లా కార్యాలయానికి వీఆర్‌కు వెళ్లారు. మండలంలో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐను టీడీపీ మండల అధ్యక్షులు జవాజి రామాంజులరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, కొత్తపల్లి సర్పంచ్ మట్టం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు హనుమారెడ్డి, అబ్రహం, వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది శాలువా కప్పి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలో డిప్యూటీ డీఈవో తనిఖీ


పాఠశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈవో

గిద్దలూరు, ఆగస్టు 22 : పట్టణంలోని స్ప్రింగ్‌బోర్డు పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా 8, 9, 10 తరగతులు నిర్వహిస్తున్నట్లు లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లడంతో, డీఈవో ఆదేశాల మేరకు డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్ పాఠశాలను తనిఖీ చేశారు. 7వ తరగతి వరకు మాత్రమే క్లాసులు జరుగుతున్నట్లు గుర్తించారు. పాఠశాలలో 8, 9, 10 తరగతులు నిర్వహించడం లేదన్నారు. ఆయన వెంట ఎంఈవో కావడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుల దూషణ కేసు నమోదు

మార్కాపురం, ఆగస్టు 22: వాహనంతో ఢీకొట్టి ప్రమాదానికి గురిచేయడమే కాకుండా ఇదేంపద్ధతని అడిగిన వ్యక్తిని కులం పేరుతో దూషించి, దాడి చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం మార్కాపురం పట్టణ ఎస్సై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు ఎస్టేట్‌కు చెందిన దమ్ము నరసింహకుమార్ ఈ నెల 19న ఇంట్లోకి సరుకులు తెచ్చేందుకు రహదారి దాటుతున్నాడు. ఈ క్రమంలో మండలంలోని కందివారిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి కుటుంబంతో కలిసి బైక్‌పై దరిమడుగు వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు నరసింహకుమార్‌ను మోటార్ సైకిల్‌తో వెంకటేశ్వరరెడ్డి ఢీకొట్టాడు. దీంతో కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న కుమార్ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరెడ్డిని నిలదీశారు. దీంతో వెంకటేశ్వరరెడ్డితోపాటు అతని బంధువులు ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు కులం పేరుతో దూషించి తమపై దాడి చేశారని కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పట్టణ ఎస్సై ఎస్‌కే.అబ్దుల్ రెహమాన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

నేడు గిద్దలూరుకు ఎంపీ మాగుంట రాక

గిద్దలూరు టౌన్, ఆగస్టు 22 : ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి శుక్రవారం గిద్దలూరు రానున్నారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పట్టణంలోని రాచర్లగేటులో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఆర్‌వోబీ నిర్మాణానికి స్థల పరిశీలన చేయనున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా వెంకటదాస్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 22 : గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా డి.వెంకటదాస్ నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకటదాస్ మాచర్ల మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తూ గిద్దలూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును ఇటీవల కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 22 : జాతీయ లోక్‌అదాలత్ సెప్టెంబరు 14న జరగనున్న దృష్ట్యా కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్ కేసులు, భరణం, గృహహింస, చెక్‌బౌన్స్, రాజీపడదగిన క్రిమినల్, బ్యాంక్ ప్రీలిటికేషన్, టెలిఫోన్ ప్రీలిటికేషన్, కోర్టుల వరకు వెళ్లని ప్రీలిటికేషన్ కేసులను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

టీడీపీ కార్యకర్తల సేవకు గుర్తింపు

- మన టీడీపీ యాప్‌లో చురుగ్గా ఉన్న కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు
- పార్టీలోనూ అధిక ప్రాధాన్యత ఇస్తామని భరోసా


ప్రశంసాపత్రాలతో కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 22 : మన టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పది మంది క్రియాశీలక సభ్యుల సేవలను ఆ పార్టీ గుర్తించింది. టీడీపీ అధిష్ఠానం ప్రశంసా పత్రాలు మంజూరు చేయగా, టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు వారికి అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం పార్టీ సమావేశం ఏర్పాటు చేసి మన టీడీపీ విజేతలకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేసి వారిని అభినందించారు. మన టీడీపీ యాప్ ద్వారా ఎవరైతే పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేస్తారో వారికి పార్టీ లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. నియోజకవర్గంలో షేక్ మహబూబ్‌సాహెబ్, వన్నెం వెంకటనారాయణ, నక్కా శ్రీను, ఈదర మల్లయ్య, మురళిచౌదరి, షేక్ హుస్సేన్, ఆడుసుమల్లి నరేష్, ఎన్ చెన్నయ్య, ఎం.మల్లికార్జున, మాదినీడి పరదేశి, షేక్ మస్తాన్‌వలి, ఎస్ గిరిధర్‌కుమార్‌లకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, వేగినాటి శ్రీను టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న కార్యకర్తలు

ఎస్సీ కాలనీలో జెండా ఆవిష్కరణ

ఎర్రగొండపాలెం : మండలంలోని నరసాయపాలెం గ్రామ ఎస్సీ కాలనీలో గురువారం టీడీపీ జెండాను టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆవిష్కరించారు. ఎస్సీ కాలనీలో మహిళలు అత్యధికంగా తరలివచ్చారు. 'మా కాలనీకి మా సోదరుడు వచ్చాడు' అని మహిళలు ఉత్సాహంగా టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ పాలెం కాలనీ ప్రజలు టీడీపీ జెండాను ఏర్పాటు చేసి తనతో ఆవిష్కరింపజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ, మంజూరు చేయిస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు చిమటా వెంకటరాములు, సర్పంచి సుబ్బమ్మ, టీడీపీ కార్యకర్త మల్లెల వెంకటనారాయణ, ఎం దానయ్య ఎస్సీ కాలనీ మహిళలు పాల్గొన్నారు.

తుమ్మలచెరువులో పడకేసిన పారిశుధ్యం


తుమ్మలచెరువులో దుర్గంధం వెదజల్లుతున్న కాలువ, తాడివారిపల్లెలో రహదారిపై నిలిచిన నీరు(ఫైల్)

తర్లుపాడు, ఆగస్టు 22 : మండలంలోని తుమ్మలచెరువులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. సైడుకాలువల్లో మురుగు తీయక పోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో దోమలు ఉధృతి పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. బస్టాండ్ కూడలిలో మురుగు నీరు నిల్వ ఉంది. దీంతో ప్రయాణికులు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో దోమలు ఉధృతంగా ఉండడంతో ప్రజలు ఇటీవల జ్వరాల బారిన పడుతున్నారు. కనీసం మురుగు కాలువలపై బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. తాడివారిపల్లెలో కూడా చిన్నపాటి వర్షానికే అడుగు లోతు నీరు రోడ్లపై నీరు నిలిచింది. దీంతో ఆ రోడ్లపై ప్రజలు ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ నిధులు పారిశుద్యానికి, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టుకొని స్వాహా చేయడం మినహా సమస్యపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాడివారిపల్లెలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పొదిలి ఆర్టీసీ డిపోలో నిఘానేత్రాలు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సీసీ కెమెరాలోని దృశ్యాలు

పొదిలి, ఆగస్టు 22 : పొదిలి ఆర్టీసీ డిపోలో సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో దొంగల చేతివాటం పెరిగింది. తరచూ సెల్‌ఫోన్, పర్సుల దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 'సీసీ కెమరాలు మరమ్మతుల చేయరూ' అంటూ ఈ నెల 18న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. రూ.20వేల వ్యయంలో 12కు పైగా సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు. డీఎం సుందరరావు పర్యవేక్షణలో బస్టాండ్ ప్రాంగణంలో వీటిని ఏర్పాటు చేశారు. డీఎం కార్యాలయం, ఎంట్రన్స్‌గేటు, గ్యారేజీలతోపాటు వెనుకవైపు ప్రహరీగోడల వద్దకూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాల ఏర్పాటుతో ఈవ్‌టీజర్లకు అపరచిత వ్యక్తుల కదలికలను చేతివాటం ప్రదర్శిస్తున్న దొంగలను పట్టుకు నేందకు వీలవుతుంది. సీసీకెమేరాల ఏర్పాటు చేసి అధికారులను ప్రజలు, ప్రయాణికులు అభినందిస్తున్నారు.

బురద రోడ్డుపై వరినాట్లు వేసి స్థానికుల నిరసన


వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న మహిళలు

గిద్దలూరు : పట్టణంలోని మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న వీధి ప్రజలు రోడ్డుపై వర్షం నీటిలో వరినాట్లు నాటి స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్డుపైనే నిలబడుతోంది. దీంతో రాకపోకలకు వీలుకాని పరిస్థితి నెల కొంది. అయినప్పటికీ, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం కచ్చా కాలువను కూడా ఏర్పాటు చేయకపోవడంతో వర్షం నీరంతా రోడ్డుపైనే నిలిచి పోతోందని, ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా డ్రైనేజీ కాలువలు నిర్మించి ఆ తరువాత సిమెంటు రోడ్లు నిర్మించి వర్షం నీరు వీధుల్లో ఉండకుండా దూరంగా పంపాలని ఆప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.


తురిమెళ్ల చెరువుకు చేరుతున్న నీరు

కంభం: నల్లమల అడవుల్లో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లి రామన్న కతువ పూర్తిగా నిండింది. నల్లవాగు ద్వారా సురభేశ్వరకోన మీదగా తురిమెళ్లలోని తప్పెటవాని చెరువుకు వరద నీరు చేరుతోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే రెండు రోజులు పారితే చెరువు నిండి కంభం చెరువుకు కూడా నీరు చేరే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలో వర్షాలు లేక చెరువులన్నీ అడుగంటి ఉండగా నల్లమలలో పడిన వర్షాలకు కొద్దిమేర నీరు రావడం సంతోషమని ప్రజలు చెబుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి మూలవిరాట్

పెద్ద దోర్నాల, ఆగస్టు 22: మండలంలోని కటకానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి, గంగమ్మతల్లి, పోతురాజు స్వామి, నాగేంద్రస్వామి, చెంచు దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక హోమాలు, గణపతి పూజ, యంత్రపూజ, జలాభిషేకం గావించారు. ఈక్రతువును తిలకించేందుకు గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలను భక్తి శ్రద్ధలతో తిలకించి అమ్మవారిని సేవించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి : రావులపల్లి


మాట్లాడుతున్న రవీంద్రనాథ్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22: విశాఖపట్నంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీలలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వం ఆధీనంలోనే కొనసాగించాలన్నారు. మోదీప్రభుత్వ హయాంలో కార్మికులు కోల్పోతున్న హక్కుల గురించి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి దేశంలోని 29 రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య, ఏఐటీయూసీ కార్యదర్శి కాశీం పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు


పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో

కంభం, ఆగస్టు 22 : మండలంలోని ఎల్.కోట గ్రామంలో గురువారం ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఏవో శ్వేత రైతులకు వివరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి, మొక్కజొన్న, కంది, మిరప, తదితర పంటల్లో పంట నమోదు ప్రక్రియను పరిశీలించినట్లు తెలిపారు. ఎల్.కోట గ్రామంలో ఇప్పటివరకు 60 ఎకరాలు వరి, 50 ఎకరాలు మిరప, 30 ఎకరాలు మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు పంట నమోదు గురించి తెలియజేశారు. ఈ-పంట నమోదు సెప్టెంబరు 15లోపు ముగుస్తుందని, కావున రైతులందరూ తాము వేసిన పంటల వివరాలను వ్యవసాయ సహాయకులకు అందజేసి తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని కోరారు. దీనివలన ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందన్నారు. కావున రైతులందరూ త్వరితగతిన ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు.

నూతన ఎస్సైగా శివబసవరాజు బాధ్యతలు



త్రిపురాంతకం, ఆగస్టు 22: మండలానికి బదిలీపై వచ్చిన నూతన ఎస్సై సీహెచ్.శివబసవరాజు గురువారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న సాంబశివయ్య ఒంగోలు బదిలీకాగా మద్రిపూడిలో చేస్తున్న శివబసవరాజు ఇక్కడకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, గ్రామాల్లో శాంతిభద్రతల అమలుతోపాటు, అక్రమ మద్యం, సారాను అరికడతానని తెలిపారు.

అవీ..ఇవీ..

25న ఎడ్ల బలప్రదర్శన పోటీలు

గిద్దలూరు, ఆగస్టు 22 : మండలంలోని ముండ్లపాడు గ్రామంలో శ్రీసైదుమియా స్వామి 40 రోజుల జారతులు సందర్భంగా ఈనెల 25న సీనియర్ ఎడ్లవిభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటి బహుమతిగా రూ.60వేలు, రెండవ బహుమతిగా రూ.40వేలు, 3వ బహుమతిగా రూ.30వేలు, 4వ బహుమతిగా రూ.20వేలు, 5వ బహుమతిగా రూ.10వేలు, 6వ బహుమతిగా రూ.6వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 9052722748, 6300741723 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

25 నుంచి కృష్ణాష్టమి వేడుకలు

గిద్దలూరు, ఆగస్టు 22 : పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ ఒ.వెంకటయ్య యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 25న గోపూజ, ధ్వజారోహణ, సామూహిక విష్ణుసహస్రనామ స్తోత్ర పఠనం, 26న ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, స్వామివారి కళ్యాణం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఉట్టి మహోత్సవం, గ్రామోత్సవం, 27న సుదర్శన హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొనాలని పేర్కొన్నారు.

ఎంపీడీవోగా నరసయ్య బాధ్యతలు

కొమరోలు, ఆగస్టు22: కొమరోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా దేవండ్ల నరసయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో నరసయ్య గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు, గుంటూరు జిల్లా నుంచి ఇక్కడకు నరసింహారావును బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం గతంలో ఎక్కడైతే పనిచేశారో అక్కడే ఎంపీడీవోగా పనిచేయాలని ఆదేశంచడంతో ఇక్కడ పనిచేస్తున్న నరసింహారావు గుంటూరుకు, గుంటూరులో పనిచేస్తున్న ఎంపీడీవో నరసయ్య కొమరోలు ఎంపీడీవోగా విధుల్లో చేరారు.

నేటి నుంచి ఉపాధి పనుల గుర్తింపు సభలు

కొమరోలు, ఆగస్టు22: మండలంలోని 14 పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టనున్న పనులను ఆయా గ్రామ ప్రజలతో గుర్తించేందుకు ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరసయ్య తెలిపారు. 2004-25 ఆర్థిక సంత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టనున్న పనులకు సంబంధించి ఆమోదం కోసం గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని పంచాయతీల్లో గ్రామసభలు విజయవంతం చేయాలని ఆయా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

నేడు గ్రామసభకు ఎమ్మెల్యే

బేస్తవారపేట, ఆగస్టు 22: ఉపాధి పథకంలో ప్రజలకు పనికొచ్చే పనులు చేపట్టడానికి నేటి నుంచి మండలంలో గ్రామసభలు జరగనున్నాయి. బేస్తవారపేట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరిగే గ్రామ సభకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుమల అశోక్‌రెడ్డి హాజరుకానున్నారు.

గ్రామసభలలో టీడీపీ శ్రేణులు పాల్గొనాలి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 22 : టీడీపీ రాష్ట్ర నాయకత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో నేడు గ్రామపంచాయతీలలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామసభలు నిర్వహిస్తున్న దృష్ట్యా టీడీపీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టే నూతన పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహిస్తున్న దృష్ట్యా మండలపార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జులు, ఇతర హోదాలలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా పరిధిలో జరిగే గ్రామసభలలో పాల్గొనాలని ఆయన కోరారు.

భవిత కేంద్రానికి కుర్చీలు బహూకరణ


భవిత కేంద్రానికి కుర్చీలు బహూకరిస్తున్న ఎంఈవో శార్వాణి

కంభం, ఆగస్టు 22 : స్థానిక బోర్డుస్కూలులోని భవితకేంద్రానికి పాఠశాల విద్యార్థి తల్లి షేక్ ఫర్జానా కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంఈవో శార్వాణి మాట్లాడుతూ భవిత కేంద్రానికి అవసరమైన కుర్చీలను బహూకరించడం అభినందనీయమన్నారు. దివ్యాంగుల పట్ల ఆప్యాయత, అనురాగాలను కలిగి ఉండాలన్నారు. దివ్యాంగ విద్యార్థి సయ్యద్ చోటామస్తాన్ పుట్టినరోజు సందర్భంగా కేక్‌సుకట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. పాఠ్యపుస్తకాలు జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మురళీమోహన్, రవీంద్రనాయక్, అకౌంటెంట్ రామచంద్రుడు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు వడిబియ్యం సమర్పణ


అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22: స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహిళా కమిటీ ఆధ్వర్యంలో వడిబియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఉభయదేవేర్లతో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మహిళా భక్తులు వడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండానరసింహారావు, కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణారావు, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న తిరుమలయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 22: వివిధ వ్యాదులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ప్రతినిధి తిరుమలయ్య అన్నారు. జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వివిధ వ్యాధులు హెచ్‌ఐవీ తదితరాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజర్ విజయకుమారి మాట్లాడుతూ.. బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం


భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయుడు కొండారెడ్డి

పొదిలి, ఆగస్టు 22 : మండలంలోని చింతగుంపల్లి మండలపరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దోర్నాల కొండారెడ్డి గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన తల్లి దోర్నాల మంగమ్మ 10వ వర్ధంతి సందర్భంగా తాను చదువులు నేర్పుతున్న విద్యార్థులకు భోజన ఏర్పాటు చేశానన్నారు. కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు


బాధ్యతలు స్వీకరించిన భీమానాయక్

పామూరు, ఆగస్టు 22: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. గురువారం స్థానిక సీఐ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు సాధారణ బదిలీల్లో భాగంగా పామూరు సీఐగా భీమానాయక్‌ను నియమిస్తూ ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు జారి చేయగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎస్ఐ ఎంసైదుబాబు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన ఎంరామానాయక్ గుంటూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ పామూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

రేపు దొనకొండలో ప్రజావేదిక

దొనకొండ, ఆగస్టు 22: స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద శనివారం ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఏపీఎం దేవయ్య తెలిపారు. డ్వామా పీడీ అర్జునరావు, జిల్లా విజిలెన్స్ అధికారిణి ఝాన్సీరాణి, ఎంపీడీవో వసంతరావు నాయక్, తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఇటీవల ఆడిట్ అధికారులు గ్రామాల్లో చేపట్టిన తనిఖీలకు సంబంధించిన నివేదికలు ప్రజావేదికలో వివరిస్తారని ఆయన పేర్కొన్నారు.

మన టీడీపీ యాప్‌లో ప్రతిభచూపిన వైకే చౌదరి


వైకే చౌదరిని అభినందిస్తున్న గొట్టిపాటి లక్ష్మి, పాపారావు

దొనకొండ, ఆగస్టు 22: మన టీడీపీ యాప్‌లో దర్శి నియోజకవర్గంలో దొనకొండ మండలానికి చెందిన వైకే చౌదరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. వెంకటాపురం గ్రామానికి చెందిన ఆయన గత మూడేళ్లగా ఐటీడీపీ మండల కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. టీడీపీ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు షేర్ చేస్తూ ప్రతిభచూపి దర్శి నియోజకవర్గంలో మూడవస్థానంలో నిలచారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు వైకే చౌదరిని అభినందించి సీఎం చంద్రబాబు పంపిన ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు చేరవేయటంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. టీడీపీ అభ్యున్నతికి పట్టుదలతో పనిచేయాలని ఆమె సూచించారు.

కురిచేడులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

కురిచేడు, ఆగస్టు 22: కురిచేడులో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురంగి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కురిచేడులో మోడల్ స్కూల్ ఏర్పాటుచేయాలని, తిరుపతి, అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


నూతనంగా నిర్మించిన రామాలయం

పామూరు, ఆగస్టు 22: మండలంలోని తిరగళదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేకాలు గురువారం ఘనంగా ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మహాసంకల్పం, మృత్యంగ్రహణం, గణపతిపూజ, అంకురారోహణ, యాగశాల, కలశస్థాపన, తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు అమ్మవారికి సద్ది నైవేద్యం


పోలేరమ్మ తల్లి మూలవిరాట్

పామూరు, ఆగస్టు 22 పామూరు పట్టణంలోని తూర్పు వీధిలో ఉన్న పోలేరమ్మతల్లి పొంగళ్ల కార్యక్రమాల్లో భాగంగా గురువారం సద్దిని నైవేద్యంగా సమర్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులచే బండ్లు పొంగళ్లు, శాంతి పూజలు జరుగుతా యని నిర్వాహకులు తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

కురిచేడు, ఆగస్టు 22: రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు సూచించారు. కురిచేడులో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంది సాగులో విత్తన శుద్ధి అవసరమన్నారు. రైతులు సాంకేతికతను వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో రైతులు కమతం నాగిరెడ్డి, మునికర యోగిరెడ్డి, క్రిష్ణ, మేరువ సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేష్, రామాంజనేయులు, నాయక్ పాల్గొన్నారు.

అప్పు తీర్చమంటే కారుతో ఢీ కొట్టాడు..

కురిచేడు, ఆగస్టు 22: అప్పు తీర్చమంటే కారుతో ఢీకొట్టిన సంఘటన గురువారం కురిచేడులో చోటుచేసుకుంది. మండలంలోని వెంగాయపాలెంకు చెందిన ఊట్ల చిన్నమునెయ్యకు కురిచేడుకు చెందిన ప్రసాద్ చీటీ పాటలకు సంబంధించి రు.8 లక్షలు ఇవ్వాలి. చాలాకాలంగా డబ్బులు ఇవ్వకపోవడంతో ఒత్తిడి చేస్తున్నాడు. ఈక్రమంలో ఉదయం చిన్నమునెయ్య దర్శి రోడ్డులో ఎన్నెస్పీ కాలువ వరకు మోపెడ్‌పై వెళ్ళివస్తున్నాడు. కారులో అతడిని ప్రసాద్ వెంబడిస్తూ మార్గమధ్యలో మోపెడ్‌ను ఢీ కొట్టాడు. ఈఘటనలో మునెయ్య రోడ్డు పక్కనే ఉన్న కంకరపై పడటంతో కాలికి దెబ్బ తగిలింది. వెంటనే అతడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈవిషయమై మునెయ్య కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముండ్లమూరు ఎస్ఐగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



ముండ్లమూరు, ఆగస్టు 22: ముండ్లమూరు ఎస్ఐగా వై.నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులోని డీసీఆర్‌బీలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలు, పేకాట, కోడి పందాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీకి పాల్పడే ముఠాపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణను కలిశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

తాళ్లూరు, ఆగస్టు 22: బెట్ట నుంచి పైర్లను కాపాడుకోవడానికి రైతాంగం యాజమాన్య పద్ధతులు పాటించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి బి.ప్రసాద్‌రెడ్డి సూచించారు. మల్కాపురం, రజానగరం గ్రామాల్లో గురువారం వారు పర్యటించారు. వికసిత్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అపరాల్లో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కందిలో యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శివ, డాక్టర్ మానస, వీఏఏ కె.అశోక్, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభను విజయవంతం చేయాలి

సీఎస్‌పురం(పామూరు) ఆగస్టు 22: మండల కేంద్రమైన సీఎస్‌పురంలో శుక్రవారం జరిగే ఉపాధి హామీ పనుల ప్రణాళిక గ్రామ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర పేర్కొన్నారు. ఈసభకు ముఖ్య అతిథులుగా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాం.నుయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా సీఐ ఎం.భీమానాయక్ ఉగ్రను మర్యాదపూర్వకంగా కలవగా, ఎమ్మెల్యే ఉగ్ర పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి


సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర తదితరులు

పీసీపల్లి, ఆగస్టు 22: మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మురుగుమ్మి గ్రామంలో ఆయన పర్యటించారు. లోవోల్టేజీ సమస్యతో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు వివరించారు. ఈందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ మండల ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడానికి నూతన సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్లు తక్కువగా ఉండడంతో పాటు విద్యుత్ వినియోగం పెరగడంతో ఈ సమస్య ఎదురవుతుందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే పీసీపల్లి మండలంలోని గుంటుపల్లి, మురుగుమ్మి, తలకొండపాడు గ్రామాలకు మూడు నూతన సబ్‌స్టేషన్లను మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించగా గుంటుపల్లికి మంజూరయిందన్నారు. ఆతరువాత వచ్చిన పాలకులు మురుగుమ్మి, తలకొండపాడులో సబ్‌స్టేషన్‌ల ఏర్పాటును విస్మరించారన్నారు. ఈ రెండు సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయించేందుకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో చర్చించినట్టు చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి మంజూరుచేయించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణానికి మురుగుమ్మి గ్రామసమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఓబుల్‌రెడ్డి, హనుమారెడ్డి, క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర

సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉగ్ర ప్రత్యేక పూజలు

పామూరు, ఆగస్టు 22: మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చండీ రుద్రహోమాలు, కుంభాభిషేకం, శాంతి కల్యాణం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి టీడీపీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి స్వామి వార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, బొయిళ్ల నారాయణరెడ్డి, యారవ శ్రీనివాసులు, కొండా రవీంద్రనాథ్ రెడ్డి, దుగ్గిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, యారవ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, ఆగస్టు 22: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారులుగా పనులు చేస్తూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక విధానాలను పక్కనబెట్టి సీఎం చంద్రబాబు ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

దర్శి నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ లక్ష్మి అన్నారు. రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం, తాగు, సాగునీటి వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. తాళ్లూరు మండల ప్రజల సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో మొగిలిగుండాల రిజర్వాయర్ మంజూరయిందన్నారు. నేటికీ అది పూర్తి కాలేదన్నారు. నిర్మాణ పురోగతిపై అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయిస్తామని చెప్పారు. తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్అండ్‌బీ రహదారి దుస్థితిని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈమార్గంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ కూడా పూర్తియిందని తెలిపారు.

డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో సంప్రదించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎస్వీ రామయ్య, శాగం కొండారెడ్డి, షేక్ కాలేషావలి, తహసీల్దార్ పి.శింగారావు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఏపీఎం దేవరాజ్, పశువైద్యాధికారి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

తాళ్లూరు, ఆగస్టు 22: టీడీపీ బలోపేతానికి శ్రేణులు ఐకమత్యంగా ముందుకు సాగాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం తాళ్లూరులోని ఎంపీపీ చాంబర్‌లో పార్టీ శ్రేణులతో ఆమె మాట్లాడారు. రాబోయే కాలంలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు కైవసం చేసుకునేందుకు పార్టీశ్రేణులు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. మొదటి సారిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు ఎంపీడీవో కార్యాలయానికి రావటంతో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు శాగం కొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వేణుబాబు, కాలేషావలి, కాసీం సైదాలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఐ.శ్రీనివాసరెడ్డి, షేక్ కాశీం సైదా, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

» సీజీఎం దేవరపల్లి సుబ్బారావు

» శంకరాపురంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల పరిశీలన


శంకరాపురంలో సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు

ముండ్లమూరు, ఆగస్టు 22: రైతులకు మెరుగైన విద్యుత్‌ను తొమ్మిది గంటల పాటు ఇచ్చేందుకు ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్‌మేనేజర్ దేవరపల్లి సుబ్బారావు అన్నారు. గురువారం ముండ్లమూరు మండలంలోని శంకరాపురం సబ్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సోలార్ ఏర్పాటు చేసేందుకు పలువురు రైతుల భూములను పరిశీలించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ప్రకాశం జిల్లాలో మొదటి సారిగా ముండ్లమూరు మండలంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. ఇందుకుగాను స్థల సేకరణ ఏర్పాట్లుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 286 సబ్ స్టేషన్‌ల పరిధిలో సుమారు 1500 ఎకరాల సేకరణ జరుగుతుందన్నారు. ఒక్కో ఎకరానికి రూ.30 వేలు కౌలు రైతుకు చెల్లిస్తామని చెప్పారు. రెండు సంవత్సరాల తరువాత ఐదు శాతం పెంచుతామన్నారు. ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో ఒకటిన్నర కిలో మీటరు పరిధిలో 20 ఎకరాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఈప్లాంట్ ద్వారా నాలుగు మెగావాట్ల విద్యుత్ తయారవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, దర్శి సబ్‌డివిజన్ ఈఈ ఎస్ఏ కరీం, డీఈ ఇ.శ్రీనివాసులు, ఏడీఈలు కె.పిచ్చయ్య, ఆర్.మోహనరావు, ఏఈ వీరబ్రహ్మం, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పామూరు, ఆగస్టు 22: విద్యార్థులు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో సుభద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో రాణించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత, ఫర్నిచర్ కొరత ఉందని ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరంగా భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రామస్వామి, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ కటకం సజన, పాల్గొన్నారు.

అసంబద్ధ సర్దుబాటు బదిలీలను రద్దు చేయాలి

కనిగిరి ఆగస్టు 22: అసంబద్ధ సర్దుబాటు బదిలీలను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఓప్రకటన విడుదలచేశారు. కనిగిరి మండలంలో జరిగిన సర్దుబాటు బదిలీల్లో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పక్షపాత ధోరణితో జరిగినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నేడు మహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర

ముండ్లమూరు, ఆగస్టు 22: మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత మహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర శుక్రవారం వైభవంగా జరగనుంది. ప్రతిఏడాది శ్రావణ మాసం మూడవ శుక్రవారంలో అమ్మవారి జాతరను భక్తులు జరుపుకుంటారు. జాతర జరిగే రోజుకు మూడు రోజులు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగటం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమ్మవారికి వడపప్పు, పానకం, పసుపు కుంకం, చీర చారెతో జాతర ప్రారంభమవుతుంది. శుక్రవారం అమ్మవారిని వడియరాజుల వంశస్తులు ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో నెలకొల్పుతారు. అప్పటి నుంచి భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అందుబాటులోకి అన్నిరకాల వైద్యసేవలు

దర్శి, ఆగస్టు 22: దర్శి పట్టణంలో నూతనంగా ఏర్పాటుచేసిన మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌ను టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, నగర పంచాయతీ చైర్మెన్ పిచ్చయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా రక్షిత పథకాలు

» ప్రజలకు తప్పని నీటి ఇక్కట్లు

» పట్టించుకోని అధికారులు


బొంపెద్దుపాడులో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

పామూరు, ఆగస్టు 22: గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ఏర్పాటుచేసిన నీటి పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో వినియోగంలోకి రాలేదు. పామూరు మండలంలో పలు గ్రామాల్లో నిర్మించిన నీటి పథకాల ఓవర్‌హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురాలేదు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. బొట్లగూడూరు పంచాయతి పరిధిలోని బొంపెద్దుపాడు, రఘునాదపురం, అప్పమాంబపురం గ్రామ ప్రజల దాహార్తి తీర్చేందుకు అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడు, జడ్పీ చైర్‌పర్సన్ కాటం అరుణమ్మలు రూ.50 లక్షల నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దాంతో నీటి కష్టాలు తీరుతాయని ఆశపడ్డ ప్రజల ఆశలు అడియాశలుగా మిగిలాయి. ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తయినా, మూడు గ్రామాలకు పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేయడానికి నిధులు చాలడంలేదని అధికారులు పనులు నిలిపివేశారు. అంతర్గత పైప్‌లైన్ నిర్మాణం కోసం అదనపు నిధులు కావాలని అధికారులు ప్రతిప్రాదనలు తయారుచేశారు. 2011లో పామూరు మండలంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటింటికి నీటి వసతి కల్పించి నీటి కష్టాలను తొలగించాలని గ్రామస్తులు విన్నవించారు. నీటి సరఫరా కోసం అంతర్గత పైపులైన్ కోసం రూ.15 లక్షలు నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది. పైప్‌లైన్ లేకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మిగిలింది.

అలాగే, మండలంలోని నర్రమారెళ్ల పంచాయతీలోని చెంచిరెడ్డిపల్లి గ్రామంలో వందకుపైగా కుటుంబాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.18.5 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి పైప్‌లైన్ వేశారు. ట్యాంకుకు నీటి సరఫరా చేసేందుకు గ్రామానికి సమీపంలో బోరును వేయగా నీరు పడలేదు. దాంతో గ్రామంలోని డీప్‌బోరు నుంచి నీటిని తర లించేందుకు ప్రయత్నించగా నాణ్యత లోపంతో ట్యాంకు కారుతుండటంతో వదిలేశారు. దాంతో ఓవర్‌హెడ్ ట్యాంకు దిష్టిబొమ్మల్లా వెక్కిరిస్తున్నది. నుచ్చుపొద గ్రామంలో కూడా ట్యాంకు, బోరు, పైప్‌లైన్ వేశారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్‌హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకొచ్చి నీటి కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


కుంట పోరంబోకు భూమికి హద్దులు ఏర్పాటుచేసిన రెవెన్యూ సిబ్బంది

కుంటపోరంబోకు భూమికి హద్దులు ఏర్పాటు

దర్శి ఆగస్టు 22: ఆక్రమణకు ప్రయత్నిస్తున్న కుంటపోరంబోకు భూమికి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటుచేసి జెండాలు పాతారు. పొజిషియన్ సర్టిఫికెట్‌తో కుంటపోరంబోకు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విషయం తెలిసిందే. పొజిషియన్ సర్టిఫికెట్‌తో కబ్జా శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ కె.రాజు రెవెన్యూ సిబ్బందితో వెళ్లి కుంట పోరంబోకు భూమికి హద్దులు ఏర్పాటుచేసి జెండాలు పాతారు. దర్శి-తూర్పుగంగవరం రోడ్డులో దర్శి రెవెన్యూలోని 450/7 సర్వేనెంబర్‌లో 33 సెంట్ల కుంట భూమికి వైసీపీ నాయకుడు గత ప్రభుత్వ హయాంలో పొజిషియన్ సర్టిఫికెట్ తీసుకున్న విషయం వెలుగులోకి రావటంతో ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూములు, స్థలాలకు రక్షణ కంచెలు ఏర్పాటుచేస్తామన్నారు. మండలంలోని వాగు పోరంబోకు, కుంట పోరంబోకు, కొండ పోరంబోకు, అనాదీనం తదితర అన్నిరకాల ప్రభుత్వ భూములను గుర్తించి జాబితాను సిద్ధం చేసినట్లు చెప్పారు. రెవెన్యూ సిబ్బంది అన్నీ ప్రభుత్వ స్థలాలను పరిశీలించి హద్దులు ఏర్పాటుచేసి రక్షణ కంచెలు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఆక్రమణలను పూర్తిగా తొలగించేందుకు త్వరలో కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు.

కేజీబీవీ పాఠశాలకు వాటర్‌కూలర్ బహూకరణ

పామూరు, ఆగస్టు 22: సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో కేక్ కట్ చేశారు. అనంతరం కేజీబీవీ పాఠశాలకు వాటర్ కూలర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు వెంగళశెట్టి బాబురావు, షేక్ సందాని బాషా, రామిశెట్టి సునీల్, పి.గురవయ్య, గోస్టు సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

కనిగిరి ఆగస్టు 22: సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను గురువారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గార్లపేట రోడ్డులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా కేకు కట్ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు బాషా, రమేష్, జనసేన పట్టణ అధ్యక్షుడు అంజినాయుడు, మెగా అభిమానులు ఖాజా, శశి, నున్నా శ్రీను, అక్బరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో చిరంజీవి జన్మదిన వేడుకలు

దర్శి ఆగస్టు 22: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ స్టీవెన్, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కురిచేడు: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కురిచేడులో పత్తి శ్రీరంగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకుడు షేక్ సునీల్ హాజరయ్యారు. కేకు కట్ చేశారు. కార్యక్రమంలో కురంగి మస్తానయ్య, పరిమిసెట్టి చలమయ్య, చెన్నసెట్టి గురునాథం, కాల్వ లక్ష్మి, పిక్కిలి ఏడుకొండలు, పత్తి సురేష్, రవీంద్ర, అచ్చనాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.





స్వర్ణ గ్రామాలే.. సంకల్పం

గ్రామ స్వరాజ్యం.. గాంధీ కల. స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబు ధ్యేయం.. ఈ రెండింటినీ మిళితం చేస్తూ స్వర్ణ గ్రామాల సంకల్పంతో గ్రామసభలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడికక్కడ గ్రామసభలు జరగనున్నాయి. గుంటూరు జిల్లాలో 233, బాపట్ల జిల్లాలో 459, పల్నాడు జిల్లాలో 534 పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో ఏమేమి అభివృద్ధి పనులు అవసరం, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు.. అనే అంశాలపై ఈ గ్రామసభల్లో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల నిధులు విడుదల చేయగా.. గత ప్రభుత్వంలో ఊసేలేని గ్రామసభలకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసి రైతులకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకుని ఇందుకు సంబంధించి రైతుల ఆలోచనలతో ముందడుగు వేసేందుకు గ్రామ సభలనే వేదికగా ఎంచుకుంది.


గ్రామసభల నిర్వహణపై వీక్షణ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

- నేడు 1226 పంచాయతీల్లో గ్రామసభలు
- గ్రామసభల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు
- పల్లెల అభివృద్ధిపై ప్రతిపాదనల రూపకల్పన
- వ్యవసాయానికి దన్నుగా ఉపాధి హామీపై చర్చ
- సభలకు నోడల్ ఆఫీసర్‌గా మండల స్థాయి అధికారి

బాపట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్‌కి.. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పుడు స్వర్ణ గ్రామాలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 1226 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఒక్క రోజే గ్రామసభల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆయా పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించడానికి అవసరమైనట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో గ్రామసభకు మండల స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యాలయాల్లో చేపడుతున్న గ్రామసభల ఉద్దేశాన్ని వివరిస్తూ గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారం చేశారు. పార్టీలకతీతంగా సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ఈ సభల్లో భాగస్వామ్యం కానున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక గ్రామాలను వేధిస్తున్న ఎన్నో సమస్యలు గ్రామ సభల్లో చర్చకు రానున్నాయి. పంచాయతీ సర్పంచ్, సెక్రెటరి మొదలు ఎంపీడీవో, స్పెషలాఫీసర్లు, జిల్లా స్థాయి అధికారులు ఈ గ్రామసభలకు హాజరై ప్రజలతో మమేకమై చర్చిస్తారు. ఆ తర్వాత తీర్మానాలు చేసి ప్రతిపాదనలను జిల్లా నీటియాజమాన్య సంస్థ ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తారు. కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి అవసరమైన లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటారు.

మొక్కుబడి తంతుగా కాకుండా..

గతంలో మొక్కుబడి తంతుగా నిర్వహించిన ఈ సభలను సంస్కరించి అత్యంత ప్రాధాన్యం గల అంశంగా మార్గదర్శకాలు మార్చి కూటమి ప్రభుత్వం తిరిగి తీసుకొచ్చింది. గ్రామసభలను మొక్కుబడితంతుగా కాకుండా పంచాయతీల పరిధిలోని సమస్యల పరిష్కార వేదికగా ఉండాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. సీసీరోడ్లు మొదలుకుని గత ప్రభుత్వంలో నిధుల వినియోగంలో జరిగిన అవకతవకల వరకు అన్ని అంశాలపైనా గ్రామసభల దృష్టిలో పెట్టొచ్చు. సభ దృష్టికి వచ్చిన సమస్య పరిష్కారంపై కూడా నిర్దిష్ట కాలపరిమితి విధించి జవాబుదారీతనం కల్పించే విధంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో చేపట్టే ప్రతిపని పురోగతి కూడా గ్రామసభల్లో చర్చకు రానుంది. కౌలు రైతులకు పెద్ద సంఖ్యలో జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డులు, మినీ గోకులాలు, సూక్ష్మసేద్యం విషయంలో పురోగతి, ఉద్యాన పంటలకు ఇటీవలే విడుదల చేసిన రాయితీలు, రాయితీ యంత్రాల విషయంలో నూతన మార్గదర్శకాలు తదితర అంశాలన్నీ గ్రామసభల్లో చర్చకు రానున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ నిధులు కూడా దారి మళ్లిన నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని నిర్ణయం తీసుకొన్నది. దీంతో శుక్రవారం జరిగే గ్రామసభల్లో అందరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని డ్వామా పీడీ ఉమాదేవి విజ్ఞప్తి చేశారు.


గుర్రపుడెక్కతో నిండిన గుంటూరు ఛానల్

హద్దులు అంటూ లేకుండా పనులు

వ్యవసాయ అనుబంధ పనులను కూడా ఉపాధి హామీ కింద చేపట్టవచ్చు. కొత్త ఫీడర్ కాల్వలు, పంటకాల్వల తవ్వకం, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో సేద్యపు నీటి గుంటల నిర్మాణం, వ్యక్తిగత భూముల్లో భూమి అభివృద్ధి పనులు, సరిహద్దు కందకాలు, వ్యవసాయ బావుల నిర్మాణం, పండ్ల తోటల రింగు ట్రెంచ్‌ల నిర్మాణం, భూసార సంరక్షణ కందకాలు తవ్వడం, గడ్డి పెంపకం, పశువుల షెడ్లు, కోళ్ల ఫారాల నిర్మాణం, పట్టు పురుగుల షెడ్లు టైపు-1, 2, చెరువుల పునరుద్ధరణ, చెరువుల సరిహద్దు చుట్టూత కందకాలు తవ్వి మొక్కల పెంపకం, ప్రభుత్వ సంస్థల్లో సరిహద్దు కందకాల తవ్వకం, వ్యక్తిగత భూముల్లో పండ్ల తోటలు, పూలతోటలు, మల్బరీ తోటల పెంపకం, నర్సరీల ఏర్పాటు, గొర్రెల షెడ్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, మడ అడవుల పెంపకం, కాలువల్లో పూడిక తొలగింపు వంటి అనేక వ్యవసాయ పనులకు అనుమతి ఉన్నది. ఊట చెరువులు, పశువుల చెరువులు, వరద కట్టల నిర్మాణం, చెక్ డ్యాంల నిర్మాణం/మరమ్మతులు, బోర్‌వెల్ రీఛార్జ్, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, రైల్వేలేన్ సరిహద్దు వెంట కందకాల తవ్వకం, చెరువులు/కుంటల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ గుంటల నిర్మాణం చేపట్టవచ్చు. అలానే మౌలిక సదుపాయాల కింద గ్రామ పంచాయతీల భవనాలు, వ్యవసాయ ఉత్పత్తి నిల్వ కేంద్రాలు, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలు, స్వయం సహాయ కేంద్రాలు, పాఠశాల ప్రహరీ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం చేపట్టవచ్చు. సిమెంట్ రోడ్లు, డబ్ల్యూబీఎం, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆటస్థలాలు, సామూహిక ఇంకుడు గుంతలు, శ్మశాన వాటికలు, ఆహార నిల్వ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా నిర్మించుకోవచ్చు. కాగా వ్యక్తిగత లబ్ధిచేకూర్చే పనులు కూడా ఉపాధిహామీ కింద చేసుకోవచ్చు. పొలంగట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో సేద్యపు నీటి గుంటల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు, గృహ నిర్మాణానికి 90 రోజుల పనిదినాల కల్పన వంటివి చేసుకునే వీలుంది. గ్రామసభల్లో ప్రజలు, రైతులు ఆయా పనులపై అభిప్రాయలను అందజేసి తద్వారా ఆయా పనులు చేసుకునే అవకాశం ఉంది.

ఉపాధితో.. అన్నదాతలకు అండ

“గ్రామాలలో వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసందానం చేస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించకపోగా పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో పాటు ఉపాధి హామీ పథకం నిధులు కూడా పక్కదారి పట్టించే చర్యలకు పాల్పడింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసి రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలనే ఇందుకు వేదికగా ఎంచుకుంది. ఉపాధి హామీ పనుల విషయంలో ఇంతవరకు జరిగిన చెల్లింపులు, మెటీరియల్ అంశాలపై సభల్లో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవడానికి ప్రణాళిక రూపొందించారు. ఉపాధి హామీ వేతనదారులతో పాటు గ్రామాల్లో ఉన్న అన్నదాతలు పెద్ద ఎత్తున గ్రామ సభల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఉపాధి హామీ పనుల ద్వారా పొలాల్లో చేపట్టాల్సిన పనుల గురించి సభ ముందుకు తీసుకెళతారు. వీటిపై సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనుమతులు ఇస్తారు. ఇంతకు ముందు ఉపాధి నిధులతో చేపట్టే చెరువులు, కాల్వల పనులు, మొక్కల పెంపకం వంటి వాటిని యథావిధిగా కొనసాగిస్తూనే రైతులకు అండగా ఉండడానికి ఉపాధిహామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఎంత ఎక్కువగా పనిదినాలు కల్పించుకుంటే అంత ఎక్కువగా మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధులు మంజూరు అవుతాయి.”

సాగునీటి కాల్వలకు ప్రాధాన్యం దక్కేనా?

గుంటూరు, పల్నాడు జిల్లాలతో పాటు బాపట్ల జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా కాల్వల్లో పారే నీటి ద్వారానే జరుగుతుంది. అయితే ఈ సాగునీటి కాల్వలు ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. గుంటూరు చానల్ కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో కాల్వల ద్వారా సాగునీరు పొలాలకు సక్రమంగా అందక రైతులు అల్లాడుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ నుంచి మూడు జిల్లాల్లో ప్రధాన కాల్వలన్నీ కూడా అధ్వానంగా ఉన్నాయి. తూటికాడ, పూడిక, పిచ్చిచెట్లు, నాచులతో కాల్వలో నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. కాల్వల బాగుకు నిధుల కొరత వెంటాడుతోంది. ఈ క్రమంలో ఉపాధితో గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టేందుకు సంకల్పించిన కూటమి ప్రభుత్వం సాగునీటి కాల్వల్లో పూడిక తీతకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులు సూచిస్తున్నారు. ఈ పనులు నిర్వహిస్తే సాగు నీటి సమస్యలను పరిష్కరించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. దారుణంగా ఉన్న సాగు నీటి కాల్వల అంశాన్ని రైతులు గ్రామసభల్లో ప్రస్తావించి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందించాలి.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు
దర్యాప్తు వేగవంతం


టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినప్పటి దృశ్యాలు (ఫైల్)




- 106 మందిలో ఇప్పటికే 21 మంది అరెస్టు.. 85 మందికి తాజాగా నోటీసులు
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్‌లతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌కూ..

మంగళగిరి, గుంటూరు, ఆగస్టు 22: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసిన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడిలో పాల్గొన్న నిందితుల్లో కొంత మందిని ఇప్పటికే అరెస్టు చేయగా, మిగతా వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. 2021 అక్టోబరు 19న జరిగిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు క్రైం నెంబర్ 650/2021గా కేసు నమోదు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ కేసుపై దృష్టి సారించారు. ఐపీసీ 307 సెక్షన్‌తో పాటు మరికొన్ని సెక్షన్లను జోడించారు. ఐపీసీ 147,148, 452, 427, 323, 324, 506, 326, 307, 450, 380, రెడ్‌విత్ 109, 120బి, 149 తదితర సెక్షన్లతో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఇప్పటివరకు మొత్తం 106 మందికి టీడీపీ కార్యాలయంపై దాడిలో ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. 21 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మిగతా 85 మందికి మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 19 నుంచి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు, విజయవాడకు చెందిన వైసీపీ నేత దేవినేని అవినాష్, అరవ సత్యం వంటి ముఖ్య నేతలతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ కూడా ఉన్నాడు. అందుబాటులో లేని వారి ఇళ్లకు నోటీసులు అతికిస్తున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కొందరు వైసీపీ నేతలు ఎన్నికల ముందు, తర్వాత టీడీపీలో చేరారు. అలాంటి వారిని ఉపేక్షించవద్దని టీడీపీ కార్యకర్తలు అనేక మార్లు అధినేత చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో స్పందిస్తూ చట్టాన్ని ధిక్కరించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం శిక్షించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు నుంచి తప్పించుకోవడానికి టీడీపీలో చేరిన వైసీపీ నేతలపై కూడా చర్యలు ఉంటాయనేది స్పష్టమవుతోంది.

వైసీపీ కార్యాలయ ప్రతినిధులకు మళ్లీ నోటీసు..

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి ఆ రోజు వైసీపీ కార్యాలయంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ కార్యాలయ సిబ్బందికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయా నోటీసులను వైసీపీ కార్యాలయ గోడకు అంటించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి వైసీపీ కార్యాలయం నుంచే పథకం రూపొందించడంతో పాటు కార్యాలయంపై దాడికి వచ్చే ముందు సూత్రధారులతో పాత్రధారులు వైసీపీ కార్యాలయంలో సమావేశమైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దాడి జరిగిన రోజు వైసీపీ కార్యాలయం వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తే కుట్ర కోణం ఛేదించవచ్చని, ఈ కేసులో కీలక ఆధారాలు లభించే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీనిలో భాగంగానే ఘటన జరిగిన రోజుకు సంబంధించి 24 గంటల సీసీ ఫుటేజ్ ఇవ్వాలంటూ వైసీపీ కార్యాలయ సిబ్బందికి ఈ నెల 13న సీఆర్‌పీసీ 160 ప్రకారం నోటీసు జారీ చేశారు. ఈ నెల 16న మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట సీసీ ఫుటేజ్‌తో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే 16న వైసీపీ కార్యాలయ ప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడంతో మరో సారి నోటీసు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.


మంగళగిరిలోని వైసీపీ కార్యాలయ గేటుకు పోలీసులు అంటించిన నోటీస్

ఉచిత ఇసుక.. సులభతరం

- స్థానిక సచివాలయాల్లోనే బుక్ చేసుకునే అవకాశం
- స్టాక్‌యార్డుల్లో అందుబాటులో 7,368 మెట్రిక్ టన్నులు
- కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల, ఆగస్టు 22: ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వినియోగదారులు తమ సమీపంలోని సచివాలయాలలో ఇసుకను బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీలు మాట్లాడుతూ రేవుల వద్ద వాహనాల క్యూ వినియోగదారుల పడిగాపులు, అదనపు వసూళ్లను అరికట్టేలా ప్రభుత్వం ఇసుకపై ప్రత్యేకచర్యలు తీసుకుందన్నారు. సచివాలయాలలో ఇసుకను బుక్ చేసుకుంటే నగదు మొత్తాన్ని డిజిటల్ మోడ్‌లో మాత్రమే చెల్లించాలన్నారు. ఇన్వాయిస్‌లో పేర్కొన్న డెలివరి స్లాట్ సమయానికి స్టాక్‌యార్డు వద్ద ఇసుక లోడింగ్ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో మార్టూరు, అద్దంకి, కొరిశపాడు స్టాక్‌యార్డుల వద్ద సుమారు 7,368 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. రవాణాదారులతో సమావేశం నిర్వహించి చార్జీలను నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు ఇసుక రేవులను అక్టోబరు 15 నుంచి ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక లభ్యత ఆధారంగా జిల్లాలోని ఆరు నియోజకవర్గ కేంద్రాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా అక్రమంగా ఇసుక,బుసుక తవ్వకాలు జరిపిన, అక్రమరవాణాకు తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై ఆర్టీవో, రెవెన్యూ, మైన్స్ అధికారులు కలిసి జరిమానాలు విధించాలని ఆదేశాలిచ్చామన్నారు. గుంటూరు జిల్లాలోని కొల్లిపర, మున్నంగి, గుండిమెడ, తాళ్లాయపాలెం, లింగాయపాలెం రేవుల వద్ద ఇసుక అత్యధికంగా లభ్యమౌతుందన్నారు. ఇసుక కావాల్సిన వారు ఆ ప్రాంతాలకు వెళ్లి ఇసుక తెచ్చుకోవచ్చన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వాహనదారులు ఇసుకను రవాణా చేయాలని ఎస్పీ తెలిపారు. అక్రమ తవ్వకాలపై సమాచారం ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జేసీ బి.సుబ్బారావు, ఏఎస్పీ విఠలేశ్వరరావు, మైన్స్ ఏడీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడీ

ఇసుక రవాణా ధరలు ఇలా..

దూరం	వాహనం	ధర(రూ.)
15 కిలోమీటర్లు	ఆరు టైర్లు	2,000
	పది టైర్లు	3,000
	12 టైర్లు	4,000
	ట్రాక్టరు	1,500
30 కిలోమీటర్ల వరకు	ఆరు టైర్లు	3,500
	పది టైర్లు	5,000
	12 టైర్లు	6,000
	ట్రాక్టరు	2,400
45 కిలోమీటర్ల వరకు	ఆరు టైర్లు	4,500
	పది టైర్లు	7,500
	12 టైర్లు	8,000
	ట్రాక్టరు	3,000
60 కిలోమీటర్ల వరకు	ఆరు టైర్లు	5,500
	పది టైర్లు	8,500
	12 టైర్లు	10వేలు
	ట్రాక్టరు	3,500

---

14 మంది సీఐలకు పోస్టింగ్స్

- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ త్రిపాఠి

గుంటూరు, ఆగస్టు 22: గుంటూరు రేంజ్ పరిధిలో కొద్దిరోజులుగా జరుగుతున్న సీఐల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది దీనిలో భాగంగా గురువారం రేంజ్ పరిధిలో 14 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ
గన్నవరపు శ్రీనివాసరావు	ఒంగోలు పీటీసీ	ప్రత్తిపాడు
షేక్ నాగూర్‌మీరా షరీఫ్	ఇంటెలిజెన్స్	మేడికొండూరు
ఈ నారాయణ	ఇంటెలిజెన్స్	గుంటూరు దిశ 1
బీ బ్రహ్మయ్య	రేంజి వీఆర్	సత్తెనపల్లి టౌన్
ఎం హైమారావు	రేంజి వీఆర్	నరసరావుపేట 2 టౌన్
బలగాని ప్రభాకరరావు	తుళ్లూరు ట్రాఫిక్	వినుకొండ రూరల్
ఆర్ సురేష్‌బాబు	నెల్లూరు ఎస్సీఎస్టీసెల్	రేపల్లె రూరల్
పీవీ ఆంజనేయులు	రేంజ్ వీఆర్	వేమూరు రూరల్
టీ నాగభూషణం	రేంజి వీఆర్	చీరాల 2 టౌన్
షేక్ ఖాజావలి	ఒంగోలు మహిళా పీఎస్	కనిగిరి
సీహెచ్ ప్రభాకర్‌రావు	రేంజి వీఆర్	యర్రగొండపాలెం
ఆర్ఎస్ కిశోర్‌కుమార్	మెరైన్	నెల్లూరు 5వ పట్టణం
ఓ పాపారావు	రేంజి వీఆర్	కావలి రూరల్
జే శ్రీనివాస్	రేంజ్ వీఆర్	గూడూరు 2 టౌన్

పిన్నెల్లి రూ.50 కోట్లు ఆస్తుల కబ్జా

- భయపెట్టి కాజేశారంటున్న మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ కుటుంబీకులు
- న్యాయం చేయాలని ముఖ్యమంత్రి, డీజీపీ, ఎస్పీలకు దుర్గాశ్రీనివాస్ లేఖ

గుంటూరు, ఆగస్టు 22: వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మరో వివాదం రాజుకుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయనతో పాటు, ఇతర వైసీపీ నాయకులు పలువురు అక్రమంగా తన ఆస్తులు కబ్జా చేశారని మాచర్ల మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ కృష్ణప్రసాద్ కుమారుడు దుర్గాశ్రీనివాస్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకి లేఖ రాశారు. గతంలో పిన్నెల్లి, ఆయన అనుచరులు తన వ్యాపారాలను టార్గెట్ చేశారన్నారు. పెట్రోల్ బంకును ధ్వంసం చేసి, బంకు మూతపడేటట్లు చేశారని తెలిపారు. దీంతో తనకు ఆర్థికంగా భారీ నష్టం ఏర్పడిందని ఆ లేఖలో ఆరోపించారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనను భయపెట్టి రూ.50 కోట్లు విలువ చేసే ఆస్తులను రూ.10 కోట్లకు అమ్మేలాగా బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకం తీసుకుని పెట్రోల్ బంకును ఆక్రమించుకున్నారన్నారు. పిన్నెల్లి ఆక్రమంచిన ఆస్తులను తిరిగి తనకు ఇప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. లేఖను ముఖ్యమంత్రితో పాటు డీజీపీకి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డికి, పల్నాడు జిల్లా ఎస్పీకి పంపినట్లు శ్రీనివాస్ తెలిపారు.



పోల్ తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజల కోసం అన్ని విధాలా జాగ్రత్తలు

చీరాలటౌన్, ఆగస్టు 22 : చీరాల పురపాలక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి తెలిపారు. పురపాలక పరిధిలోని 22వ వార్డులో డ్రైనేజీకి మధ్యలో చాలాకాలంగా విద్యుత్ పోల్ ఉండిపోయింది. ఆ ప్రాంతంలో మురుగు పారుదల పనులు చేపట్టాలన్నా అందులో విద్యుత్ సరఫరా అవుతుంటోంది. దీంతో అక్కడ మురుగు పేరుకుపోయి కంపుకొడుతుంది. సమస్య కమిషనర్ దృష్టికి వచ్చింది. ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కరెంట్ పోల్‌ను తొలగించి డ్రైన్‌ను క్రమబద్ధీకరించారు. కమిషనర్‌కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తోటకూర శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వర్

అక్రమ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి

● ఏఎస్పీ విఠలేశ్వర్

చీరాలటౌన్, ఆగస్టు 22 : చీరాల మండల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఏఎస్పీ విఠలేశ్వర్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెం, దేవినూతల, పుల్లాయిపాలెం ప్రాంతాలలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను పరిశీలించారు. ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీని విధిగా అమలు చేయాలన్నారు. ఏఎస్పీ వెంట రూరల్ సీఐ సత్యనారాయణ, ఎక్సైజ్ సీఐ కర్ణ, మైనింగ్ విభాగం అధికారి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం

ఈపూరుపాలెం(చీరాలటౌన్) : వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

● టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

తాళ్లూరు, ఆగస్టు 22: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ చాంబర్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారులుగా పనులు చేస్తూ కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక విధానాలను పక్కన బెట్టి సీఎం చంద్రబాబు ప్రజాసంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. దర్శి నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డాక్టర్ లక్ష్మి అన్నారు. రోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం, తాగు, సాగునీటి వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్అండ్‌బీ రహదారి దుస్థితిని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌తో సంప్రదించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఎస్వీ రామయ్య, శాగం కొండారెడ్డి, షేక్ కాలేషావలి, తహసీల్దార్ పి.శింగారావు, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, ఏపీఎం దేవరాజ్, పశువైద్యాధికారి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మరికొంతమంది సీఐల బదిలీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 21: గుంటూరు రేంజి పరిధిలో 13 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఒంగోలు పీటీసీలో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావును గుంటూరు జిల్లా పత్తిపాడు సర్కిల్‌కు బదిలీ చేశారు. ఒంగోలు మహిళ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌కె.ఖాజావలిని కనిగిరి సర్కిల్‌కు బదిలీ చేశారు. రేంజి వీఆర్‌లో ఉన్న సీహెచ్. ప్రభాకర్‌రావును ఎర్రగొండపాలెం సర్కిల్‌కు, ఒంగోలు డీసీఆర్‌బీలో పనిచేస్తున్న భీమానాయక్‌ను పామూరు సర్కిల్‌కు బదిలీ చేశారు.

ముగ్గురు బాధ్యతల స్వీకరణ

ఒంగోలు టూటౌన్ సీఐగా మేడా శ్రీనివాసరావు, పామూరు సీఐగా భీమానాయక్, పొదిలి సీఐగా టి.వెంకటేశ్వర్లు ఆయా సర్కిల్ కార్యాలయాల్లో బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎస్పీ ఏఆర్ .దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు.

ఒంగోలు నగర కమిషనర్‌గా వెంకటేశ్వరరావు



ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 22 : ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కే. వెంకటేశ్వరరావును నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నరసాపురం కమిషనర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును ఒంగోలుకు బదిలీ చేయగా, ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎం.జశ్వంత్‌రావును డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సాధారణ ఎన్నికలకు మూడు నెలల ముందు ఆయన తెనాలి నుంచి ఒంగోలుకు బదిలీ కాగా, ఆరు నెలలు తిరగకుండానే మళ్లీ బదిలీ అయ్యారు. ఇదిలాఉండగా, ఒంగోలు కమిషనర్‌గా కె.వెంకటేశ్వరరావు నియమితులవుతారని టీడీపీ కూటమి అధికారంలో వచ్చినప్పటి నుంచి ప్రచారం జరగ్గా, ఎట్టకేలకు ఆయనే ఒంగోలుకు వచ్చారు. సోమవారం తర్వాత వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

పామూరు, ఆగస్టు 22: విద్యార్థులు కష్టపడి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో సుభద్ర అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో రాణించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థులకు అనుగణంగా ఉపాధ్యాయుల కొరత, ఫర్నిచర్ కొరత ఉందని ఆమె దృష్టికి తెచ్చారు. అనంతరం స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు రుచికరంగా భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రామస్వామి, కేజీబీవీ ప్రిన్సిపాల్ కటకం సృజన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధితో ప్రగతిబాట!

గ్రామీణ ప్రాంత మౌలిక సదుపాయాలపై కూటమి దృష్టి

భారీగా రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఖర్చులు

ఉపాధి హామీ నిధులు అనుసంధానం

నియోజకవర్గానికి రూ.15కోట్లు

ప్రతిపాదనలు స్వీకరిస్తున్న అధికారులు

వేగం పెంచిన కూటమి ప్రభుత్వం

తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అందులో ప్రధానంగా పడకేసిన గ్రామీణాభివృద్ధిని గాడిన పెట్టాలని కసరత్తు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించింది. అందులోభాగంగా అంతర్గత సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలతోపాటు వివిధ గ్రామాలను కలిపే రోడ్లును తారు రోడ్లుగా మార్పు చేసే ప్రక్రియ చేపట్టింది. ఉపాధి హామీ పథకం నిధులు అనుసంధానంతో వీటిని చేపట్టనున్నారు. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి రూ.15కోట్ల విలువైన ప్రతిపాదనలను ఇవ్వాలని యంత్రాంగం సూచించగా ఆయా నియోజకవర్గాల కీలక నేతలు వాటిపై దృష్టిసారించారు.



ఉపాధి కింద గ్రామాల్లో వేస్తున్న సిమెంట్ రోడ్లు (ఫైల్)

ఒంగోలు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు ఎటువంటి అభివృద్ధి లేక కునారిల్లుతున్న గ్రామీణప్రాంతాలకు తీపికబురు. గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన పల్లెలకు ఊరటనిచ్చేలా తాజా సర్కారు ప్రణాళికలు రూపొందిస్తుంది. అందులో భాగంగా ఉపాధిహామీ మెటీరియల్ నిధులతో రోడ్లు, డ్రైనేజీ, అంతర్గత రహదారులు నిర్మించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ప్రతి నియోజకవర్గానికి నిధులు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో ఉపాధి హామీ పథకం పనులు పెద్దఎత్తున చేపట్టారు.

ఆ పనులతో కూలీలకు వేతనం రూపంలో వచ్చే నిధులతోపాటు భారీగా మెటీరియల్ కోటా కింద నిధులు వస్తాయి. మొత్తం ఉపాధి వ్యయంలో 60శాతం కూలీల వేతనం, మిగతా 40శాతం మెటీరియల్ కోటాగా ఉండటంతో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున ఈ నిధులను సద్వినియోగం చేసింది. ఉమ్మడి జిల్లాలో ఆ ఐదేళ్ల కాలంలో రూ.4వేల కోట్ల మేర అటు వేతనాలుగా, ఇటు మెటీరియల్ కోటా కింద నిధులు వచ్చాయి. వందలాది గ్రామాల్లో పెద్దఎత్తున సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, పాఠశాలల ప్రహరీలు, శ్మశానాల అభివృద్ధి, ఇతర భవన నిర్మాణాలు జరిగాయి. అలాగే పండ్లతోటల పెంపకం, నీటి సంరక్షణ ఇతర పలు పనులు చేశారు.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకాన్ని ఆ స్థాయిలో సద్వినియోగం చేసిన పరిస్థితి లేదు. మెటీరియల్ కోటా కింద నిధులు కల్పనలోను వెనుకబడి పోగా ఉన్న నిధులలో కూడా అధికశాతం జగనన్న కాలనీల పేరిట తినేశారు. కొన్ని సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల పేరుతో భవన నిర్మాణాలు చేపట్టినా ఎక్కువశాతం పూర్తి కాలేదు. చాలావరకు నిరుపయోగంగానో లేక అసంపూర్తిగానో మిగిలిపోయాయి. ఇక అంతర్గత రహదారులు, మురుగుకాలువలు, శ్మశానాల అభివృద్ధి పనులు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. కాగా తిరిగి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వచ్చాక నెలరోజుల్లోనే గ్రామీణ ప్రాంతాల పనులపై దృష్టి సారించింది.

రూ.120కోట్లు వచ్చే అవకాశం

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు రూ.224 కోట్లు మేర ఉపాధి వ్యయం జరిగింది. అందులో రూ.220 కోట్లు కూలీలకు వేతన రూపంలో లభించగా మెటీరియల్ వ్యయం కేవలం రూ.4కోట్లు మాత్రమే జరిగింది. అంతేకాక వార్షిక పని దినాలు లక్ష్యం కోటి 56లక్షలలో కోటి 6 లక్షల మాత్రమే జరిగాయి. అంటే ఇంకా 50 లక్షలు పని దినాలకు అవకాశం ఉండగా సుమారు రూ.100కోట్లకుపైగా వేతన రూపంలో సమకూరనుంది. అలా మొత్తం కూలీల వేతనం రూ.320 కోట్లకుపైగా కానుండగా ఆ ప్రకారం జిల్లాకు మెటీరియల్ కోటా కింద సుమారు రూ.120కోట్లు వరకు లభించనున్నాయి.

నియోజకవర్గానికి రూ.15కోట్లు

ఈ నేపథ్యంలో జిల్లాలో ఉపాధి హామీ నిధులు అనుసంధానంతో నియోజకవర్గానికి రూ.15 కోట్లు వంతున పనుల కేటాయింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు చర్యలకు కలెక్టర్లను ఆదేశించింది. తదనుగుణంగా ప్రస్తుతం డ్వామా, పంచాయతీ అధికారులు సంబంధిత పనుల ప్రతిపాదనలు సేకరణలో నిమగ్నమయ్యారు. జిల్లాలోని 8 నియోజకవర్గాలకు చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు స్థానిక నాయకులతో చర్చించి సదరు పనులను ఎంపిక చేస్తున్నారు.

వచ్చే నెలలో పనులు ప్రారంభం

పలు నియోజకవర్గాల్లో అత్యధిక పనులను ఒక్కొక్కటి రూ.10లక్షలు ఉండేలా ప్రతిపాదనలు ఇస్తునట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కువభాగం గ్రామాలలో అంతర్గత సిమెంటు రోడ్లు ఉంటున్నాయి. కొన్నిచోట్ల గ్రామాలకు, గ్రామాలకు మధ్య రోడ్లను కూడా ప్రతిపాదిస్తున్నారు. ప్రతిపాదనలను ఈ వారంలో తీసుకుని పీఆర్ ఇంజనీర్లు అంచనాలు సిద్ధం చేస్తే వాటిని డ్వామా ద్వారా కలెక్టర్ మంజూరు చేస్తారు. ప్రక్రియను నెలాఖరులోగా పూర్తిచేసి వచ్చే నెలలో పనులు ప్రారంభించే యోచన చేస్తున్నారు. ఇదిలాఉండగా ఒక్కో నియోజకవర్గానికి రూ.15 కోట్లు కేటాయింపు హేతుబద్ధత కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మూడొంతులు పట్టణ ప్రాంతంగా ఉండే ఒంగోలు, మార్కాపురంలకు రూ.15 కోట్లు సరే అనుకన్నా మొత్తం గ్రామీణ ప్రాంతంగా ఉండే కొండపి, వైపాలెం, ఎస్ఎన్‌పాడు వంటి నియోజకవర్గాలకు రూ.15కోట్లు ఎలా సరిపోతాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నేడు ఉపాధి గ్రామ సభలు

● ఒకేరోజు అన్నిపంచాయతీల్లో నిర్వహణ ● చేసిన పనులు సమీక్ష, కొత్తవి గుర్తింపు

● 87 రకాలపనులకు అనుమతి ● పనులు పరిశీలించిన ఆర్డీ డైరెక్టర్ కృష్ణతేజ

ఒంగోలు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు పెద్దఎత్తున జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో శుక్రవారం గ్రామసభలు జరగనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో ఒకేరోజున వీటిని నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉపాధి పథకం ద్వారా ఒకవైపు భారీగా కూలీలకు వేతనాలు లభించేలా పనుల కల్పన, మరోవైపు మెటీరియల్ కోటా ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపకరించే పనులు చేసుకునే అవకాశం ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని అంతగా ఉపయోగించిన పరిస్థితి లేకపోగా భారీగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఈ నేపథ్యంలో తిరిగి టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో మళ్లీ ఉపాధి పథకంపై దృష్టిపెట్టింది. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు చూస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా ప్రత్యేక దృష్టిసారించారు. ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామస్థాయిలో పథకం అమలు కోసం ప్రత్యేక మార్గదర్శకాలను జారీచేసింది ఇప్పటివరకు జరిగిన పనుల సమీక్షలతోపాటు కొత్త పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఒకేరోజున అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.

కొత్త పనుల గుర్తింపు

జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కోటి 56లక్షల పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటి వరకు కోటి ఆరు లక్షలు కల్పించారు. దీంతో రూ.228కోట్లు కూలీలకు వేతన రూపంలో లభించగా దాదాపు రూ.120 కోట్ల మెటీరియల్ పనులకు అవకాశం ఉన్నా ఆ వైపు గత ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. కాగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటన్నింటిని సమీక్షించి అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనుల గుర్తింపు ద్వారా అదనంగా పనిదినాల కల్పనకు నిర్ణయించింది. ఈ పనులను శుక్రవారం జరిగే గ్రామసభల్లో గుర్తించనున్నారు. వివిధశాఖల భాగస్వామ్యంతో చేసే 87రకాల పనులను ఇందుకోసం ఎంపిక చేశారు. వీటన్నింటిని జిల్లాస్థాయిలో నెలాఖరులోపు పరిశీలన చేసి మంజూరుతోపాటు వచ్చేనెల నుంచి చేపట్టేలా ప్రభుత్వం సూచనలు చేసింది. దీంతో శుక్రవారం జిల్లాలో గ్రామసభల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లుచేశారు. మండలం యూనిట్‌గా ఎంపీడీఓల పర్యవేక్షణలో గ్రామసభలు జరగనున్నాయి.



టంగుటూరు మండలంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కృష్ణతేజ

పనులను పరిశీలించిన డైరెక్టర్

ఇదిలాఉండగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.కృష్ణతేజ గురువారం జిల్లాలో ఉపాధి పనులు పరిశీలించారు. టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం, జయవరంలలో ఆయన ఫీడర్ ఛానల్ మరమ్మతులు, హార్టికల్చర్ పనులు పరిశీలించడంతోపాటు ఉపాధి కూలీలతో మాట్లాడారు. వారు చేస్తున్న పనులు, అందుతున్న సౌకర్యాలు, లభిస్తున్న వేతనాలు ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ సీఈవో మాధురి, డ్వామా పీడీ అర్జునరావు, డీపీవో ఉషారాణి ఆయన వెంట ఉన్నారు.

ఎయిర్‌పోర్టుతోనే అభివృద్ధి సాధ్యం

● ఎంపీ మాగుంట

● ఎమ్మెల్యే దామచర్లతో కలిసి జేసీతో సమావేశం



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్దన్, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 22 : ఒంగోలులో ఎయిర్‌పోర్టుతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో సమావేశమయ్యారు. ముందుగా కొత్తపట్నం మండలం అల్లూరు పరిసర ప్రాంతాల్లో గతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పరిశీలించిన భూమిపై చర్చించారు. అందుకు సంబంధించిన మ్యాప్‌లతోపాటు గతంలో తీసుకున్న నిర్ణయాలపై మాట్లాడారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాగుంట మాట్లాడుతూ 2004లో తాను ఎంపీగా ఉన్న సమయంలో ఒంగోలుకు ఎయిర్‌పోర్టు ఎంతో అవసరం ఉందని, అందుకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అప్పటికి ముఖ్యమంత్రి 2006లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఆమోదం తెలిపారని వివరించారు. 730 ఎకరాల భూమి అవసరం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం వాణిజ్యపరంగా ఒంగోలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం ఎంతో అవసరంగా ఉందన్నారు. ప్రతిపాదిత భూమి ఒంగోలుకు ఆరు కిలోమీటర్ల దూరంలోనే ఉందన్నారు. వాన్‌పిక్ భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అప్పుడు అంగీకారం తెలిపిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. పాత జిల్లాల్లో ఎక్కడైతే మంజూరై పెండింగ్‌లో ఉన్నాయో వాటి నిర్మాణానికి పౌరవిమానయాన మంత్రి అంగీకారం తెలిపారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడులు ఇటీవల రాష్ట్రంలో ఏడు ఎయిర్‌పోర్టులు నిర్మించనున్నట్లు ప్రకటించగా అందులో ఒంగోలు కూడా ఉందన్నారు. అందుకు సంబంధించి ముందుగా భూసేకరణపై జేసీతో చర్చించామన్నారు. గతంలో వాన్‌పిక్ కోసం ఆరువేలకుపైగా ఎకరాల భూసేకరణ చేశారన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 730 ఎకరాలకు గాను 600 ఎకరాలు వాన్‌పిక్‌లోనే ఉందన్నారు. అప్పట్లో ఆ సంస్థ ఒప్పుకున్నందున ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ఎలాంటి అవరోధాలు లేవన్నారు. మిగిలిన భూమిని మాత్రమే సేకరించాల్సి ఉందన్నారు.

ఈ భూసేకరణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. త్వరలో ఈ విషయంపై సీఎంను కలిసి వివరిస్తామని తెలిపారు కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో సుబ్బారెడ్డి, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి



సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర తదితరులు

వీసీపల్లి, ఆగస్టు 22: మండలంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మురుగుమ్మి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. లోవోల్టేజీ సమస్యతో ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు వివరించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ మండల ప్రజలు ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడానికి నూతన సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నట్టు చెప్పారు. సబ్‌స్టేషన్లు తక్కువగా ఉండడంతో పాటు విద్యుత్ వినియోగం పెరగడంతో ఈ సమస్య ఎదురవుతుందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే వీసీపల్లి మండలంలోని గుంటుపల్లి, మురుగుమ్మి, తలకొండపాడు గ్రామాలకు మూడు నూతన సబ్‌స్టేషన్లను మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించగా గుంటుపల్లికి మంజూరయిందన్నారు. ఆతరువాత వచ్చిన పాలకులు మురుగుమ్మి, తలకొండపాడు లో సబ్‌స్టేషన్‌ల ఏర్పాటును విస్మరించారన్నారు. ఈ రెండు సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయించేందుకు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో చర్చించినట్టు చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి మంజూరుచేయించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సబ్‌స్టేషన్ నిర్మాణానికి మురుగుమ్మి గ్రామసమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమలో ఓబుల్‌రెడ్డి, హనుమారెడ్డి, క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉగ్ర ప్రత్యేక పూజలు

పామూరు : మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి దేవస్థానంలో చండీ రుద్రహోమాలు, కుంభాభిషేకం, శాంతి కల్యాణం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి టీడీపీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించి స్వామి వార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, బొయిళ్ల నారాయణరెడ్డి, యారవ శ్రీనివాసులు, కొండా రవీంద్రనాథ్ రెడ్డి, దుగ్గిరెడ్డి లక్ష్మీ నారాయణరెడ్డి, యారవ ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినీ బైపాస్‌కు అనుకూలం

» అంతర్గత రహదారులను కలిపితే సరి
» సర్వీస్ రోడ్ల అనుసంధానంతో మేలు


మిల్లుబాబు గ్రానైట్ పరిశ్రమ వద్ద సర్వీసు రోడ్డు నుంచి మార్టూరులోకి అంతర్గత రహదారి.. మార్టూరు నుంచి బయటకు వచ్చే రోడ్డు.. మినీ బైపాస్‌లో రాజుగారిపాలెం, ప్రభుత్వ జూనియక్ కాలేజీ కూడలి

మార్టూరు, ఆగస్టు 22 : భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మార్టూరు గ్రామంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొత్తగా మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేకంగా స్థలాన్ని సేకరించాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఆక్రమణలు తొలగించాల్సిన పనీ లేదు. మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టవలసిన రహదారిలో మౌళికంగా మార్టూరు రహదారులు ఉన్నాయి. గ్రామంలో అంతర్గత రహదారులను కలుపుతూ, గ్రామ శివార్లో ఉన్న రహదారిని కలుపుతూ మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూపకల్పన చేయడానికి అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామం నడిబొడ్డు నుంచి ఈ మినీ బైపాస్ రోడ్ నిర్మాణం కొనసాగే అవకాశం ఉండడంతో, అంతర్గత రహదారులకు కాకుండా, గ్రామ శివార్లలో ఉన్న రహదారులకు మాత్రమే నిధులు అవసరం ఉంది.

బైపాస్ రూట్‌మ్యాప్

మార్టూరు సెంటర్లో జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైవోవర్‌కు తూర్పు వైపున ఉన్న సర్వీసు రోడ్డు నుంచి మార్టూరు గ్రామంలోకి ప్రారంభిస్తే మినీ బైపాస్ రోడ్డు మరలా జొన్నతాళి వెళ్లే ఈ సర్వీసు రోడ్డులోకి చేరుకుంటే రోడ్డు ముగుస్తుంది. అంటే డేగరమూడి రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్డులో మిల్లుబాబు గ్రానైట్ పరిశ్రమ దగ్గర నుంచి మార్టూరు గ్రామంలోకి రోడ్డు (మురికిపూడి డొంక రోడ్డు) ఉంది. ఈ రోడ్డు పక్కన కొంతదూరం తూర్పు వైపున గ్రానైట్ పరిశ్రమలు, పడమర వైపున రెండు ప్రముఖ విద్యా సంస్థలు ఉన్నాయి. అదే విధంగా ఈ రోడ్డు ముందుకు సాగుతూ రామ్‌నగర్, నేతాజీ నగర్, గ్రామ పంచాయతీ కార్యాలయం, బడ్డురాయి సెంటర్, పడమర బజారు, బలరాం కాలనీ, మంచినీటి వాటర్‌ప్లాంట్ నుంచి మంచినీటి చెరువు పక్క నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు, అక్కడ నుంచి గ్రానైట్ పరిశ్రమలు, నూలు మిల్లులు మధ్య మట్టిరోడ్డు గుండా అమరావతి నూలు మిల్లు పక్కన సర్వీసు రోడ్డుపైకి చేరుతుంది.

మినీబైపాస్ రోడ్డు దూరం సుమారు 4.5 కిమీ

మార్టూరు గ్రామంలో మినీ బైపాస్ రోడ్డును రూపకల్పన చేస్తే దాదాపుగా 4.5 కిమీ దూరం ఈ రోడ్డు కొనసాగుతుంది. వాటిలో గ్రామంలో ప్రజానీకం నివసించే అంతర్గత రహదారులు సుమారు 2కి.మీ. వరకు గతంలోనే సిమెంట్ రోడ్డు నిర్మాణం జరిగింది. ఇక మిగిలిన 2.5 కిమీ వరకు మాత్రమే సిమెంట్ రోడ్, లేదా తారురోడ్డు నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉంది. రామ్‌నగర్, నేతాజీనగర్ కూడలి సమీపంలో నుంచి సర్వీసురోడ్డు వరకు, ఘట్టేశ్వరస్వామి ఆలయం సమీపంలో కొంతవరకు మాత్రమే సీసీ రోడ్డును నిర్మించాలి. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డు, అక్కడ నుంచి గ్రానైట్ పరిశ్రమల మధ్య గుండా అమరావతి నూలు మిల్లు పక్కన ఉన్న జొన్నతాళి వెళ్లే సర్వీసురోడ్డుపైకి చేరే బైపాస్ రోడ్డు వరకు పూర్తిగా ప్రస్తుతం మట్టిరోడ్డు ఉంది. మట్టిరోడ్డును మాత్రం తారురోడ్డుగా నిర్మిస్తే మార్టూరులో మినీ బైపాస్ రోడ్డు ఒక కొలిక్కి వచ్చేసినట్లే.

మురుగు నీటికి చెక్ పడుతుంది

మిల్లుబాబు గ్రానైట్ పరిశ్రమ నుంచి మినీబైపాస్ రోడ్ రూపకల్పన జరిగితే ఈ రోడ్‌లో దాదాపుగా అర కిలోమీటరు దూరం వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద మురుగునీటి గుంతలు ఉన్నాయి. అదేవిధంగా రోడ్డుకు పక్కనే వెయ్యి మంది విద్యార్థులు చదువుకునే రెండు ప్రముఖ విద్యా సంస్థలు ఉన్నాయి. సమీపంలోనే ఎస్సీ కాలనీ ఉంది. ఈ మురుగునీటి గుంతలు కారణంగా పూర్తిస్థాయి అపరిశుభ్రమైన వాతావరణం అక్కడ ఉంది. తరచూ వ్యాధులు, రోగాలతో పిల్లలు బాధపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే మురుగునీటి నిల్వ ఉండే అవకాశం లేదని కాలనీవాసులు భావిస్తున్నారు. దానికి తోడు రోడ్డు నిర్మాణం జరిగితే సమీపంలోని గ్రానైట్ పరిశ్రమల యజమానులు కూడా ఆర్థికంగా సహాయ సహకారాలు అందించే అవకాశాలు ఉన్నాయి.

ప్రయాణం సులభం

మినీ బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగితే మార్టూరు, బొబ్బేపల్లి, గన్నవరం, రాజుగారిపాలెం, జొన్నతాళి, ద్రోణాదుల తదితర గ్రామాల వాసులు ఈ రహదారి గుండా ప్రయాణం చేసే అవకాశం ఉంది. దాంతో మార్టూరులోని ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య నుంచి బయటపడే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ నిధులతో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తే భవిష్యత్‌లో ప్రయోజనకరంగా ఉంటుంది.


మంత్రికి చెక్‌ను అందజేస్తున్న దాత

హనుమంతరావు దాతృత్వం ఆదర్శనీయం

మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, ఆగస్టు 22 : జగన్‌రెడ్డి అన్న క్యాంటీన్‌లను మూసేసి పేదల నోటి దగ్గర ముద్దను కొట్టేశారని, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించి పేదల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన మల్లిపెద్ది హనుమంతరావు అన్న క్యాంటీన్ నిర్వహణకు తన వంతుగా రూ.10వేల నగదును మంత్రికి అందజేసారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిరుపేదల కడుపు నింపేదుందుకు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లకు విరాళం అందజేసిన హనుమంతురావు దాతృత్వం పలువురికి ఆదర్శనీయం అన్నారు.

డయేరియాపై అప్రమత్తం

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 22 : డయేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కారంచేడు ప్రభుత్వ వైద్యులు జి.సురేష్ బాబు అన్నారు. ప్రస్తుతం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న డయేరియా వ్యాధి నివారణకు వైద్యశాలలో అన్ని వసతులు ఉన్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డయారియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడంతోపాటు, పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అధికంగా నీళ్ల విరోచనాలు అవుతుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

పర్చూరు, ఆగస్టు 22 : పద్మ విభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన దిన వేడుకలను జనసేన పార్టీ శ్రేణులు, చిరు అభిమానుల గురువారం ఘనంగా నిర్వహించారు. బొమ్మల సెంటర్ కూడలిలో కేక్‌కను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు విన్నకోట అజయ్, కారంపూడి సందీప్ తేజ, తోట మణి, కందా సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి నరసింహం, తులసి చంటి, బాల, బోగాది మోహన్ పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

చినగంజాం : చిరంజీవి పుట్టిన రోజు వేడులను గురువారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు మాచవరపు అంకయ్య, మండల ప్రధాన కార్యదర్శులు అడుసుమల్లి హరిబాబు, వెంకటేష్, సాయికృష్ణ, బాపయ్యనగర్ గ్రామ అధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా గురువారం అద్దంకి నియోజకవర్గ చిరంజీవి యువత ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు డాక్టర్ వెంకట కిరణ్ చేతుల మీదుగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్, షేక్ కరిముల్లా, ప్రసాద్, దిలీప్, నాగూర్, శివ పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

చినగంజాం, ఆగస్టు 22 : మండలంలోని పల్లెపాలెం గ్రామ శివారులో పేక ఆడుతున్న ఏడుగురిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్‌ఐ ఎస్.రమేష్ గురువారం తెలిపారు. పేకాట శిబిరంపై దాడి చేసి 7గురిని అదుపులోనికి తీసుకొని, వారి నుంచి రూ.600 నగదుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమెదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కన్పించడం లేదని ఫిర్యాదు

ఇంకొల్లు, ఆగస్టు 22 : మండలంలోని పావులూరు గ్రామానికి చెందిన తాటిపర్తి పేరిరెడ్డి మతిస్థిమితం లేని వ్యక్తి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఆచూకీ లేదని కుమార్తె శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

బస్సు షెల్టర్‌లో వృద్ధుడి మృతి

ఇంకొల్లు, ఆగస్టు 22 : ఇంకొల్లులో సినిమాహాల్ సెంటర్ సమీపంలోని బస్సు షెల్టర్‌లో ఓ వ్యక్తి మృతి చెందారు. గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచాం ఇవ్వగా ఎస్‌ఐ సురేష్ చేరుకొని మృతి చెందిన వ్యక్తి వివరాలు సేకరించారు. మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన మల్లెం పాపారావు(70) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి బస్సు షెల్టర్‌లోనే ఉంటున్నారు. తీవ్ర అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. అతని బంధువులకు సమాచారమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న స్కూటీ

అద్దంకి, ఆగస్టు 22 : స్కూటీ, మోటార్‌సైకిల్ ఢీ కొనగా ఇద్దరికి గాయాలు అయ్యాయి. వెనుక నుంచి వచ్చిన లారీ స్కూటీపై నుంచి పోవడంతో వాహనం నుజ్జునుజ్జయింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని రాజీవ్‌కాలనీ వద్ద నామ్ రోడ్డు లోకి స్కూటీ రాగా అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం నుంచి ఒంగోలు వైపు వెళ్త న్న మోటార్‌సైకిల్ గురువారం ఉదయం ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ఉన్న నరహరి, స్కూటీపై ఉన్న శైలజకు గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ఐదుగురికి గాయాలు

అద్దంకి, ఆగస్టు 22 : పొగాకు చెక్కుల ట్రాక్టర్, లగేజి ఆటో ఎదురెదురు ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందగా, 5 గురుకి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన రైతులు ట్రాక్టర్‌పై పొగాకు చెక్కులు వేసుకొని వెల్లంపల్లి వెళ్తుండగా గుంటూరు జిల్లా తెనాలి మండలం అంగలకుదురు నుంచి క్యాటరింగ్ సామానులతో బద్వేల్‌కు వెళ్తున్న ఆటో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత 2గంటల సమయంలో అద్దంకి మండలం తిమ్మాయపాలెం ఇటుక బట్టీల వద్ద ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లగేజి ఆటో డ్రైవర్ నక్కా మల్లికార్జునరావు (37) అక్కడికక్కడే మృతి చెందారు. ఆ వాహనంలో ఉన్న ఉన్న మరో వ్యక్తి తాటి శ్రీహరితో పాటు ట్రాక్టర్ డ్రైవర్ పొన్నం నాగాంజనేయులు, రైతులు నల్లబోతుల రామకృష్ణ, బుడగలూరి రామారావు, బొట్ల హనుమంతరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


మల్లికార్జునరావు మృతదేహం

బోల్తా పడ్డ పొగాకు చెక్కుల ట్రాక్టర్, లగేజీ ఆటో


సిబ్బందికి సూచనలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

ఈ-పంట నమోదుపై అవగాహన

పంగులూరు, ఆగస్టు 22 : రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు వెంటనే పంట వివరాలు సేకరించాలని మార్టూరు ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోని రైతు సేవా కేంద్ర కార్యాలయంలో సిబ్బందికి గురువారం పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం సాగులో ఉన్న మినుము పంట అక్కడక్కడా వడలిపోవడాన్ని గుర్తించినట్లు చెప్పారు. ఈ బెట్ట పరిస్థితి నుంచి పంటలను కాపాడుకునేందుకు లీటర్ నీటికి రెండు గ్రాములు చొప్పున యూరియా కలిపి రెండు రోజుల వ్యవధిలో పిచికారీ చేసి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు సాగు చేసిన అన్ని పంటలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రానికి రప్పించాలి

జిల్లా కోఆర్డినేటర్ జోత్స్న


ఫిజియోథెరపి సైకిల్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా అధికారులు

పంగులూరు, ఆగస్టు 22 : మండలంలోని దివ్యాంగ పిల్లలను పంగులూరు భవిత కేంద్రానికి రప్పించాలని ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.జ్యోత్స్న కోరారు. పంగులూరు భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపి కార్యక్రమాన్ని ఆమె గురువారం పరిశీలించారు. నూరు శాతం డిజిబులిటీ ఉన్న పిల్లల వివరాలను అర్జీ రూపంలో అందచేయాలని, భవిత కేంద్రంలో చేపట్టే కార్యక్రమాల ద్వారా దివ్యాంగ పిల్లల్లో జరిగే అభివృద్ధిని గమనించాలని ఆర్పీలకు సూచించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు ఇందిరాప్రియదర్శిని డాక్టర్ అజయ్‌కృష్ణ ద్వారా సమకూర్చిన ఏరోఫిట్ ఫిజియోథెరపి సైకిల్‌తో పాటు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాగరాజు సమకూర్చిన రూ.10వేల విలువ చేసే బీరువాను ఎంఈవో వీరాంజనేయులు ద్వారా భవితా కేంద్రానికి అందచేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల స్పెషల్ ఎడ్యుకేటర్ భాస్కరమూర్తి, ఐఈడీ ఆర్పీలు యోహాన్, అరుణ, దివ్యాంగ పిల్లల తల్లి దండ్రులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండుతున్న పైర్లు

» ఆశాజనకంగా లేని ఖరీఫ్ సాగు » తగ్గిన మిరప

పంగులూరు, ఆగస్టు 22 : ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఖరీఫ్ పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది. తొలకరిలో కురిసిన సాధారణ వర్షంతో మండలంలోని పలు గ్రామాలలో అధిక విస్తీర్ణంలో మినుము సాగు చేపట్టారు. 150 ఎకరాలలో మొక్కజొన్న, 70ఎకరాలలో మేతజొన్న, 50ఎకరాలలో వరి, 55ఎకరాలలో పత్తి, 20ఎకరాలలో కంది, 40ఎకరాలలో పెసర, 35ఎకరాలలో బెండ, కొద్ది పాటి విస్తీర్ణంలో దోస గుమ్మడి వేశారు. జూన్, జూలైలో సాధారణ వర్షపాతం ఉన్నప్పటికీ ఈ మాసంలో కనీస వర్షం పడకపోవడంతో పాటు గత కొద్ది రోజులుగా మారిన వాతావరణ పరిస్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు తీవ్రమైన ఎండ మరోవైపు వీస్తున్న వేడి గాలులతో సాగులో ఉన్న పైర్లు వడబడి పోతున్నాయి. మండలంలో 1800 ఎకరాలలో ఖరీఫ్ పంటగా మినుము సాగు చేపట్టారు. కొండమూరులో 800 ఎకరాలు సాగులో ఉండగా రేణంగివరం, ముప్పవరం, భైటమంజులూరు, కోటపాడు, కొండమంజులూరు, పంగులూరు, బూదవాడ గ్రామాలలో వంద నుంచి రెండు వందల ఎకరాలలో మినుము ఉన్నట్లు సమాచారం. వాతావరణ మార్పులతో ఖరీఫ్ తగ్గిపోగా, వేడి వాతావరణంతో సాగులో ఉన్న పైర్లు వాడుముఖం పడుతు న్నాయి. చందలూరు, పంగులూరు పరిసర గ్రామాలలో పశుగ్రాసం కోసం వేసిన జొన్న ఎండు దశకు చేరింది. పత్తి పెరుగుదల లేదు. నాలుగు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో పలు చోట్ల సాగులో ఉన్న మినుము ఎండిపోతుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.

తగ్గిన మిరప సాగు

ప్రతికూల వాతావరణం, మార్కెట్లో తగ్గుతున్న మిరప ధరల ప్రభావంతో ఖరీఫ్‌లో మిరప సాగు గణనీయంగా తగ్గే పరిస్థితి కన్పిస్తుంది. గత ఏడాది ఖరీఫ్‌లో రెండు వేల ఎకరాలలో మిరప వేయగా, ఈ ఏడాది కేవలం 40ఎకరాలలో మాత్రమే మిరప నాట్లు వేయగా, 150 ఎకరాలలో ఎద సాగు చేపట్టారు. వర్షాభావంతో మిరప మొలక ఎత్తడం లేదు. ఖరీఫ్‌కు నెలరోజుల సమయం ఉండగా ప్రతికూల వాతావరణం, సాగు ఖర్చులతోపాటు గత ఏడాది తగ్గిన దిగుబడులు, మార్కెట్లో తగ్గుతున్న ధరలతో సాగు వైపు మొగ్గు చూపడం లేదు. గత ఏడాది బర్లీ పొగాకు సాగు మంచి ఫలితాలు ఇవ్వడంతో దానిపై దృష్టి సారించారు.


ఎండ, వేడి గాలులకు వాడిపోతున్న మినుము పైరు

వెంటాడుతున్న వర్షాభావం

ఖాళీగా ఉన్న పొలాలు


ఖాళీగా ఉన్న పొలాలు

చీరాల, ఆగస్టు 22 : ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు గమనం చురుగ్గా లేదు. వర్షాలు సక్రమంగా లేవు. వరుణుడు ముఖం చాటేయడంతో పంటల సాగుకు ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. చీరాల నియోజవకవర్గంలో ఇసుక నేలలు ఎక్కువ. ప్రధాన నీటివనరు కొమ్మమూరుకాలువ. వర్షాధారంతో పాటు బోర్లు, స్పింక్లర్ల ద్వారా కూడా పంటలు పండిస్తుంటారు. కొద్ది రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. కొమ్మమూరుకాలువకు నీరులేదు. ఈ నేపథ్యంలో బోర్లలోని నీరు కూడా అడుగంటుతుంది. దీంతో ప్రధాన పంటలైన మొక్కజొన్న, మిను ము సాగుచేసేందుకు సిద్ధం చేసిన దుక్కలు ఖాళీగా ఉనానయి. బోర్లు, స్పింక్లర్లతో సాగుచేసేందుకు ఎంతో కొంత అవాకశం ఉన్న ఆకుకూరలు, కూరగాయలుతో పాటు కొందరు వేరుశనగ సాగు చేశారు. నీటి వసతి ఎంత ఉన్నా, వర్షంతో పైరు తడిస్తే ఆ పంట ఎదుగుదల బాగుంటుంది. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయి. మాగాణి సాగుకు మరికొంత సమయం ఉంది. ప్రస్తుతం ఆరుతడి పంటలకు, ఆకుకూరలకు వర్షం అవసరం. వరుణుడి కరుణ కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే కొండయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

కొత్తపేట(చీరాల), ఆగస్టు 22 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పౌర పరిజ్ఞాన సమాచారానికి సంబంధించి జరగనున్న గ్రామసభలను విజయవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. పార్టీ కార్యాలయంలో గురువారం గ్రామ పార్టీ అధ్యక్షులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్‌కు సంబంధించి ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. ప్రధానంగా వ్యవసాయ అనుబంధంగా నిర్వహించే పనులలో ప్రధానంగా నీటి సంరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, వ్యక్తిగత ప్రయోజనం చేకూర్చే పనులు తదితరాలకు సంబంధించి గ్రామ సభల నిర్వహణ జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి హాజరైన వారిలో సందేహాలు వెలిబుచ్చినవారికి ఎంపీడీవో నేతాజీ వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, గ్రామ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


ప్రమాదకంగా ఉన్న రోడ్డు మార్జిన్

ఇంకొల్లు, ఆగస్టు 22 : ఇంకొల్లు నుంచి హనుమోజీపాలెం వెళ్లే రహదారిలో కుంట వద్ద రోడ్డు మార్జిన్ ప్రమాదకరంగా ఉంది. రోడ్డు పక్కన పెద్ద గుంత పడి ఎ ప్పుడు ఏప్రమాదం జరుగుతుందోని వాహనచోదకులు భయపడుతున్నారు. నిత్యం ఈ రహదారిలో హనుమోజీపాలెం, జరుబులవారిపాలెం,కేశవరప్పాడు గ్రామస్థులతో పాటు చీరాల వెళ్లేందుకు ఈ రహదారిలో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ అదమరిస్తే ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారంటే కొత్తవారు చాలా జాగ్రత్తగా ఈ రోడ్డున వెళ్లాలి. లేకపోతే ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ చిన్నపాటి మరమ్మతులు చేపడితే ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉంటుందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

మినుము పైరు పరిశీలన

మార్టూరు, ఆగస్టు 22 : మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో గురువారం మిను ము పైరును సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్ పరిశీలించారు ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు కారణంగా మినుము పైరు బెట్టకొచ్చిందన్నారు. ఈ బెట్ట పరిస్థితులను తట్టుకోవాలంటే నీటి వసతి ఉన్న చోట ఒక తేలికపాటి తడిని ఇచ్చుకోవాలన్నారు. అదేవిధంగా నీటి వసతి లేనిచోట యూరియాను వినియోగించాల్సిన విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు వీరవల్లి కృష్ణమూర్తి, వీఏఏ చైతన్య పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రోడ్డుపైకి వస్తేనే దాడులా.. క్వారీల సంగతేంటి..?


వేటపాలెం(చీరాల), ఆగస్టు 22 : చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. వేటపాలెం ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తరచూ ట్రాక్టర్లు, వాటి డ్రైవర్లను పట్టుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉంది. ఇసుక ట్రాక్టర్లు రోడ్డెక్కుతున్నాయంటే అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనేది నిజం. ఈ నేపథ్యంలో క్వారీలలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సంబంధిత శాఖల అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున మండల పరిధిలోని అక్కాయిపాలెం వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటిని వేటపాలెం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉచిత ఇసుక విధానం అమలు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా పదే, పదే చెప్తున్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు. తాజాగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరిగితే అందుకు ఆయా కలెక్టర్లదే బాధ్యత అని కూడా చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో రాత్రి వేళల్లో కొనసాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై మై నింగ్, రెవెన్యూ, పోలీస్ ఎలాంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాలి. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి తమకేమీ సంబంధం లేనట్లు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది మౌనంగా ఉంటున్నారు.

తాగునీటిని పొలాలకు వాడితే చర్యలు

ఇంకొల్లు, ఆగస్టు 22 : ఇంకొల్లు పరిధిలోని తాగు నీటికి ఉపయోగించే చెరువులు, కుంటల నుంచి నీటిని పొలాలకు మళ్లిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కోటినాగయ్య హెచ్చరించారు. రెండు మూడు రోజులుగా కాటంకుంటలో నీటిని పొలాలకు పెడుతున్న విషయాన్ని తెలుసుకున్న కార్యదర్శి హెచ్చరికలు జారీ చేయడంతోపాటు చర్యలు తీ సుకున్నట్లు చెప్పారు.

నేడు గ్రామ పంచాయతీలలో గ్రామసభలు

చినగంజాం, ఆగస్టు 22 : అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద 2024-25 ఆర్థిక సంవత్సరానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన ప్రతిపాదిత పనులు అమోదం కోసం గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే.స్వరూపరాణి గురువారం తెలిపారు. గ్రామసభలో ప్రతిపాదిత పనుల అమోదం, గ్రామానికి అవసరమైన అత్యవసరమైన పనులపై చర్చించి ఆమోదం కోసం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలలో నిర్వహించే గ్రామసభలకు మండల స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సంతరావూరు, గొనసపూడి గ్రామాల్లో జరిగే గ్రామ సభలకు నోడల్ అధికారిగా పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, చింతగుంపల్లికు ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరరావు, కడవకుదురుకు ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి, మోటుపల్లికి ఏపీవో జి.లక్ష్మీదేవి, చినగంజాంకు ఎంపీడీవో కే.స్వరూపరాణి, పల్లెపాలెంకు గృహ నిర్మాణ శాఖ ఏఈ జి.రాజశేఖర్, కొత్తపాలెంకు వ్యవసాయాధికారి కే.భాస్కరరావు, రాజుబంగారుపాలెం, మున్నంవారిపాలెం గ్రామాలకు తహసీల్దార్ జి.ప్రభాకరరావు, నీలాయపాలెం, పెదగంజాంలకు ఏపీఎం కే.అంజిబాబును నియమించినట్లు తెలిపారు. గ్రామసభలో చర్చించిన అంశాలను వివరంగా తీర్మానం చేసి సంబంధిత తీర్మాన కాపీని ఈ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే గ్రామసభల నిర్వహణ గురించి ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని ఎంపీడీవో గ్రామ కార్యదర్శులకు సూచించారు.



అన్నీ ఖాళీ కుర్చీలే!

నెల్లూరురూరల్ : మాద రాజుగూడూరు సచివాలయం లో నిర్ణీత వేళకు సర్వే అసి స్టెంట్‌తప్ప ఎవరూ రాలేదు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీ రింగ్, డిజిటల్ వెల్ఫేర్, వ్యవ సాయశాఖ సహాయకులతో పాటు గ్రామ పోలీసు, ఏఎన్ ఎం, ఎనర్జీ సహాయకులు, వె టర్నరీ సహాయకుల కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. కాకుపల్లి సచివాయంలో 10.45 గంట లకు గ్రామ కార్యదర్శి, వీఆర్వో, ఇంజనీరింగ్, డిజిటల్, వెల్ఫేర్ సహాయకులు మాత్రమే విధు ల్లో ఉన్నారు. కలివెలపాళెం పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ ఎం, ఎనర్జీ కార్యదర్శి, వ్యవ సాయ సహాయకులు అందు బాటులో లేరు. కానీ ఏఎన్ ఎం, వ్యవసాయ సహాయకు లు మాత్రం హాజరు వేసినట్లు తెలుస్తోంది.



ఇక్కడ ముగ్గురే..

ఉదయగిరి మండలం తిరుమలాపురం సచివాలయంలో విధులకు హాజరైన సిబ్బంది





నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరులోని పప్పులవీధి పార్కు వద్ద ఉన్న సచివాలయంలో 10.30 గంటలకు అడ్మిన్‌తోపాటు నలుగురు సిబ్బంది హాజరయ్యారు. వచ్చిన వీరు కూడా కబుర్లు చెప్పుకుంటూ కనిపించారు.



నెల్లూరు : ఫతేఖాన్‌పేటలో..



సీతారామపురం : మారంరెడ్డి పల్లి సచివాలయంలో ఇద్దరే!

వచ్చామా.. వెళ్లామా..!

గాడి తప్పిన సచివాలయ వ్యవస్థ

ఆంధ్రజ్యోతి పరిశీలన

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 22 : పాలనా రంగంలో కొత్త సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరు తీసికట్టుగా మారుతోంది. పర్యవేక్షణాధికారుల ఉదాసీన వైఖరితో సిబ్బంది గాడి తప్పుతున్నారు. సమయపాలన మచ్చుకైనా కనిపించడం లేదు. జిల్లా కేంద్రమైన నెల్లూరులోనే ఇటీవల మధ్యాహ్నానికి సచివాలయానికి తాళం వేసి ఉండటాన్ని కమిషనర్ సూర్యతేజ గుర్తించి, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, సర్వేయర్, అగ్రికల్చర్, ఎనర్జీ అసిస్టెంట్, మహిళా పోలీస్, వెటర్నరీ అసిస్టెంట్ ఇలా మొత్తం 11 మంది సిబ్బంది ఉంటారు. గ్రామ కార్యదర్శి సచివాలయానికి అడ్మిన్‌గా వ్యవహరిస్తారు. మున్సిపాలిటీల పరిధిలో అడ్మిన్లు వేరుగా ఉంటారు.

● పాలనా సౌలభ్యం లక్ష్యం

వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రాలకు, మున్సిపల్ కార్యాలయాలకు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగే పని లేకుండా గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లోనే అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి 4వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున జిల్లా వ్యాప్తంగా 769 సచివాలయాలు ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 236, గ్రామీణ ప్రాంతాల్లో 533 సచివాలయాలు నడుస్తున్నాయి. ప్రతి సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన 11 శాఖల ప్రతినిధులను నియమించారు. ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు అన్ని శాఖల సిబ్బంది కార్యాలయానికి హాజరై అంటెండెన్స్ వేసుకోవాలి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజల నుంచి వినతులు స్వీకరించాలి. ఫీల్డ్‌కు వెళ్లాల్సిన అవసరం వస్తే ఎక్కడికి, ఏ పని నిమిత్తం వెళుతున్నారో మూమెంట్ రిజిస్టర్‌లో రాసి వెళ్లాలి. సచివాల సిబ్బంది అడ్మిన్ పర్యవేక్షణలో ఉంటారు. మండల పరిధిలోని సచివాలయాలు ఎంపీడీఓలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌లు పర్యవేక్షణాధికారులుగా ఉంటారు. సిబ్బంది హాజరు, పనితీరు తదితరాలను వీరే పర్యవేక్షించాలి.

● జరుగుతున్నదేమిటి!?

ఎంపీడీఓలు సచివాలయాలను గాలికి వదిలేశారు. సచివాలయాల అడ్మిన్లు సిబ్బందిపై పట్టు కోల్పోయారు. ఫలితంగా సచివాలయాలు సిబ్బందికి అతిథిగృహాలుగా మారిపోయాయి. ఉదయం 10.30 గంటలకు తెరుచుకోవాల్సిన సచివాలయాలు కొన్నిచోట్ల 11 గంటలకు కూడా తెరుచుకోవడం లేదు. ఒకవేళ సమయానికి తలుపులు తెరిచినా సిబ్బంది ఉండటం లేదు. వచ్చినా సంఖ్య మాత్రం ఒకరిద్దరికి మించడం లేదు. సచివాలయాల పనితీరుపై గురువారం ఆంధ్రజ్యోతి బృందం జరిపిన పరిశీలనలో సిబ్బంది హాజరు దారుణంగా ఉంది. ఆంధ్రజ్యోతి పరిశీలించిన సచివాలయాల్లో ఒకటి, అర మినహా మిగిలిన అన్ని చోట్ల 11 మంది సిబ్బందిగాను ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో సచివాలయాలను ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది.



అనంతసాగరం సచివాలయం-2లో ఖాళీగా కుర్చీలు



వలేటివారిపాళెం : చుండి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే!



ఇది సచివాలయమేనా : కలిగిరి మండలం కృష్ణారెడ్డిపాళెంలో ఇదీ వరస



ఉలవపాడు-2 సచివాలయంలో కార్యదర్శి మినహా అంతా గైర్హాజరు



హమ్మయ్య ఇక్కడ ఫర్వాలేదు : సంగం-2 సచివాలయంలో సిబ్బంది

ఇసుక రవాణా ధర నిర్ధారణ

- యార్డ్‌లో టన్ను రూ.370.. వాహన సామర్థ్యం బట్టి చార్జీలు
- ఫిర్యాదులు ఉంటే ఫోన్ చేయండి
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (హరనాథపురం) : ప్రజల సౌలభ్యం కోసం ఇసుక రవాణా చార్జీలను నిర్ధారించినట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని మర్రిపాడులోని శాండ్ డిపోలో 36 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, రోజుకు వెయ్యి టన్నుల ఇసుక సరఫరా అవుతున్నట్లు చెప్పారు. అయితే, స్టాక్ పాయింట్ దూరంగా ఉండటం వల్ల ధర ఎక్కువగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. దీనిపై డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ద్వారా ఇసుక (సీలింగ్ రేటు) రవాణా చార్జీలను నిర్ధారించినట్లు తెలిపారు. ఇసుకకు సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెం.0861 2943569 కు ఫోన్ చేయాలని కోరారు. స్టాక్ యార్డు వద్ద టన్ను ఇసుక ధర రూ.370గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మర్రిపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద బుకింగ్ పాయింట్ ఏర్పాటు చేసి, ఓ ఉద్యోగిని కూడా నియమించినట్లు చెప్పారు. ఇసుక రవాణా చేసే వాహనాలను గనుల శాఖ ద్వారా గుర్తించినట్లు తెలిపారు. ఇసుక కావాల్సిన వారు వాహనాల జాబితాను పరిశీలించి, దాని ప్రకారం లేదా సొంత వాహనాల ద్వారా ఇసుక తీసుకొని వెళ్లవచ్చని అన్నారు. ఇసుక సరఫరా, అధిక ధర వసూలు చేసినా, రవాణాలో అక్రమాలకు పాల్పడినా సెబ్, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకొంటారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ఇసుక రవాణా ధర ఇలా..

● 10 టన్నుల కెపాసిటీ కలిగిన ఆరు టైర్ల లారీకి..

0-5 కిమీలకు రూ.1500, 6-15 కిమీలకు రూ.1500, 6-30 కిమీలకు రూ.2000, 31-45 కి.మీలకు రూ.3500, 46-60 కి.మీలకు రూ.4500, 60 కిమీల కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రతి టన్నుకు ఒక కి.మీకు రూ.9లుగా నిర్ధారించారు.

● 18 టన్నుల కెపాసిటీ కలిగిన పది టైర్ల లారీకి..

0-5 కి.మీలకు రూ. 2000, 6-15 కి.మీలకు రూ.3000, 16-30 కి.మీలకు రూ.5000, 31-45 కి.మీలకు రూ.7500, 46-60 కి.మీలకు రూ. 8500, 60కి.మీపైన ప్రతి టన్నుకు కి.మీకు రూ.7.5 చొప్పున వసూలు చేశారు.

● 21 టన్నుల సామర్థ్యం కలిగిన 12 టైర్ల లారీకి..

0-5కిమీకు రూ.2500, 6-15 కి.మీకు రూ. 4000, 16-30 కిమీకు రూ.6000, 31-45 కిమీకు రూ 8000, 46-60 కిమీకు రూ.10000, అదనపు కిమీకు టన్నుకు రూ. 7.50గా నిర్ధారించారు.

● 4 టన్నుల సామర్థ్యం గల ట్రాక్టర్‌కు..

0-5 కి.మీకు రూ.800, 6-15 కి.మీలకు రూ.1500, 16-30 కి.మీకు రూ.2400, 31-45 కి.మీకు రూ.3000, 46-60 కి.మీకు రూ.3500, అదనపు కి.మీ టన్నుకు రూ.12గా నిర్ధారించారు.

పేలుడుపై గోప్యత ఎందుకో!?

- వివరాలు వెల్లడించని పామాయిల్ ఫ్యాక్టరీ ప్రతినిధులు
- పైగా భారీగా భద్రతా సిబ్బంది మోహరింపు
- జరిగిన ప్రమాదంపై అనుమానాలెన్నో!?
- కానరాని జిల్లా సెక్యూరిటీ శాఖ అధికారులు

ముత్తుకూరు, ఆగస్టు 22 : ముత్తుకూరు మండలం పంటపాలెం పామాయిల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. జరిగిన ఘటనపై వివరాలు వెల్లడించేందుకు పరిశ్రమ యాజమాన్యం వెనుకంజ వేస్తోంది. పైగా గురువారం ఫ్యాక్టరీ భద్రతా సిబ్బందిని భారీగా మోహరించి ఫ్యాక్టరీలోకి ఎవరినీ అనుమతించలేదు. కనీసం ప్రమాదం ఎందుకు? ఎలా జరిగిందనే వివరాలు వెల్లడించేందుకు కూడా పరిశ్రమ ప్రతినిధులు ముందుకు రాలేదు. ప్రమాదవ శాత్తు ఈ పేలుడు జరిగిందా!? మరే ఇతర కారణాలు ఉన్నాయా అనేది సమగ్ర దర్యాప్తు చేస్తేనే వెలుగులోకి వస్తుంది. పామాయిల్ పరిశ్రమలో ఏర్పాటు చేసే నైట్రోజన్ ట్యాంకులు, బాయి లర్లు నాసిరకంగా ఉన్నా, ఒత్తిడి ఎక్కువైనా పేలిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ కోణంలో పరిశీలించాల్సిన జిల్లా సెక్యూరిటీ శాఖ అధికారులు ఎవరూ ఫ్యాక్టరీ పరిసరాల్లో కనిపించకపోవడం గమనార్హం. కనీసం జరిగిన ప్రమా దంపై ప్రాథమిక నివేదికను ఇచ్చేందుకు కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు సిద్ధంగా లేకపోవడం శోచనీయం. మరో వైపు బుధవారం రాత్రి జరిగిన పేలుడుతో చెలరేగిన మంటల్లో కార్మికులు ఎవరైనా మృతి చెందారా లేదా అనే విషయంలో కూడా గురు వారం రాత్రి వరకు స్పష్టత లేదు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ లోపల ఉన్న కార్మికులు ఎంతమంది, బయటపడ్డ వారి ఎందరూ అనే లెక్కలు కూడా ఇప్పటివరకు తేలలేదు. మామూళ్ల మత్తులో తేలుతున్న జిల్లా సేఫ్టీ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పేలుడు జరిగిన పామాయిల్ పరిశ్రమ ఇదే!

ఆరని జ్వాల



వీఆర్సీ మైదానంలో డాక్టర్లు, జూడాలు, నర్సుల కొవ్వొత్తుల ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) : కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ జిల్లాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల వద్ద జూనియర్ డాక్టర్లు గురువారం కూడా రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీర్స్ జోయల్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న డాక్టర్ల రక్షణకు తీసుకునే చర్యలపై చట్టం చేసే వరకు పోరాటం ఆగదన్నారు. అలాగే, నగరంలో వీఆర్సీ మైదానంలో జుడాల తో పాటు పలు సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తు లతో ప్రదర్శన చేసి మృతి చెందిన జూనియర్ వైద్యురాలికి నివాళులర్పించారు. యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక, ఐద్వా మహిళా సంఘం నాయకులు, నర్సింగ్ కళాశాల, నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వరూఢుడైన వెంకయ్యస్వామి



వెంకటాచలం, ఆగస్టు 22 : ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం వెంకయ్య స్వామి అశ్వరూఢుడై గొలగ మూడి గ్రామంలో విహరించారు. నిత్య పూజల అనంతరం జరిగిన ఉత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. రాత్రి పెద్ద శేషవాహనంపై స్వామివారు విహరించారు. భక్తులు, గ్రామస్థులు వెంకయ్య స్వామికి కర్పూర నీరాజనాలు అందించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారం ఉదయం సింహ, రాత్రి గరుడ వాహనసేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు.

'కేఎన్‌ఆర్' ఘటన.. ముగిసిన విచారణ

- ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక
- పాఠశాల హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

నెల్లూరు(విద్య), ఆగస్టు 22 : నెల్లూరులోని కేఎన్‌ఆర్ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం షన్‌షేడ్ కూలి విద్యార్థి గురుమహేంద్ర (14) మృతి చెందిన ఘటనపై చేపట్టిన విచారణ ముగిసింది. ప్రాథమిక నివేదికను విద్యాశాఖ అధికారులు కలెక్టర్, విద్యాశాఖ ఆర్జేడీకి అందజేశారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణకు నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి, డైట్ కళాశాల లెక్చరర్ వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి రామ్‌కుమార్‌తో త్రీమెన్ కమిటీ ఏర్పాటు చేశారు. వీరు పాఠశాలలో పూర్తిస్థాయిలో విచారించారు. గత నెల 26వ తేదీన ఘటన ఎలా జరిగింది? ఆ సమయంలో ఎవరెవరు ఉన్నారు. తదితర అంశాలపై విచారించారు. విద్యార్థి మృతికి గల కారణాలపైనా ఆరా తీశారు. అలాగే హెచ్‌ఎం తన సొంత నిర్ణయం తీసుకుని 6 నుంచి 9వ తరగతి వరకు 429 మంది విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలో తరగతులు ఏర్పాటు చేయడం, కొన్ని సబ్జెక్ట్‌లు మాత్రమే బోధన అందిస్తూ కాలం వెళ్లదీస్తున్నట్లు విచారణలో తేలింది. అందరికీ విద్య అనే నినాదం ఇక్కడ అమలు కావడం లేదన్నది గుర్తించారు. హెచ్‌ఎం క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరించి సరైన వసతులు లేని ప్రాంతంలో తరగతులు నిర్వహించడాన్ని కూడా గుర్తించారు. విద్యార్థులు కూడా తమకు సరైన బోధన జరగడం లేదని కమిటీ దృష్టికి తెచ్చారు. దీనిపై మరింత లోతైన విచారణ జరగాల్సి ఉందంటూ ఉన్నతాధికారులకు నివేదికలు అందచేశారు. ఈ నివేదిక ఆధారంగా కేఎన్‌ఆర్ నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.విజయ ప్రకాష్‌ను సస్పెండ్ చేస్తూ విద్యాశాఖ ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విచారణ మరింత సమగ్రంగా జరుగుతుందని, విచారణ పూర్తయ్యే వరకు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లాను విడిచి హెచ్‌ఎం వెళ్లకూడదని ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- అనధికార లేఅవుట్ల వివరాలు వెల్లడిస్తున్న ప్రభుత్వం
- నుడా పరిధిలో 32, నెల్లూరులో 40, కావలిలో 18
- ఆ లేఅవుట్లలో కొనుగోలు చేయవద్దని హెచ్చరిక
- పెనాల్టీలు వసూళ్లకు నోటీసుల జారీ



కావలి : మద్దూరుపాడులో వేసి ఉన్న అక్రమ లేఅవుట్

నెల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అక్రమ లే అవుట్లపై అధికార యంత్రాంగం కొరడా ఝుళిపిస్తోంది. నాలా కన్వర్షన్ చేయకుండా, నుడా అనుమతులు తీసుకోకుండా, కనీస ప్రమాణాలు పాటించకుండా లేఅవుట్లు వేసి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండికొట్టడమే కాకుండా ప్రజలను కూడా మోసం చేశారు. వీటిపై వైసీపీ ప్రభుత్వం కనీస దృష్టి పెట్టిన పాపాన పోలేదు. అయితే ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టింది. వాటి గుట్టు విప్పేందుకు ప్రత్యేక కమిటీని వేసి, విచారణ పూర్తయ్యాక ఇప్పుడు తదుపరి చర్యలకు పూనుకుంది. అక్రమలేఅవుట్ల వివరాలను ప్రకటనల ద్వారా బహిర్గతం చేస్తోంది. ఈ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను తెలియజేస్తోంది. ఎవరూ ఇక్కడ కొనుగోళ్లు చేయవద్దంటూ హెచ్చరిక చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాదిలో వెలసిన అక్రమలేఅవుట్ల వివరాలను ఇప్పటికే నుడా ప్రకటించింది.

● వెలుగులోకి వైసీపీ నేతల బాగోతం

అక్రమ లేఅవుట్ల వివరాలను అధికారులు యజమానుల పేర్లతో సహా ప్రచురిస్తుండటంతో వైసీపీ నేతల అక్రమాల పుట్ట పగులుతోంది. నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) జిల్లావ్యాప్తంగా 32 లేఅవుట్ల వివరాలు ప్రకటించగా, నెల్లూరు కార్పొరేషన్ 40, కావలి మున్సిపాలిటీ 18 లేఅవుట్ల వివరాలను ప్రచురించాయి. అందులో అనేక మంది వైసీపీ నేతల పేర్లు కనిపిస్తున్నాయి. కొందరు వైసీపీ ముఖ్య నేతల బినామీల పేర్లు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. ఈ జాబితా ఆధారంగా అధికార యంత్రాంగం తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. ఈ లేఅవుట్లకు జరిమానా విధించేందుకు నోటీసులు జారీ చేస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులతోపాటు వంద శాతం జరిమానా విధిస్తూ ఇప్పటికే కొందరు యజమానులకు నుడా అధికారులు నోటీసులు కూడా అందించారు. రెవెన్యూ అధికారులు ఇదే మాదిరిగా నాలా కన్వర్షన్‌కు సంబంధించి జరిమానాలు వసూలు చేయాల్సి ఉంది. ఇది జరిగితే ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది.

● పొదలకూరులో రూ.10 కోట్ల ఆదాయం

పొదలకూరులో వేసిన అక్రమ లేఅవుట్ ఇప్పుడు సక్రమం అవుతోంది. ఫోర్జరీ సంతకాలతో డీటీసీపీ అప్రూవల్ ఉన్నట్లు ప్రజలను నమ్మించి కొందరు లేఅవుట్ వేశారు. సుమారు 18 ఎకరాల్లో వేసిన ఈ లేఅవుట్ విలువ రూ.వందల కోట్లలోనే ఉంది. ఈ లేఅవుట్ వేస్తున్నప్పుడే ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి ఈ వ్యవహారం రావడంతో ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారించిన అధికారులు ఆ లేఅవుట్‌కు అనుమతులు లేవని నిర్ధారించి ఫోర్జరీ సంతకాలతో అనుమతులు సృష్టించినందుకు పోలీసు కేసు కూడా నమోదు చేశారు. అయితే ఇప్పుడు సదరు లేఅవుట్ యజమానులు తప్పును ఒప్పుకొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పడం విశేషం. అదే సమయంలో నుడా అనుమతులతో లేఅవుట్ వేసేందుకు సిద్ధమయ్యారు. తద్వారా ఈ లేఅవుట్‌లో రోడ్లు పెద్దవి అవ్వడంతో పాటు ప్రజా అవసరాల కోసం పది శాతం స్థలం అంటే 1.80 ఎకరాలను పంచాయతీకి అప్పగించారు. అలానే నుడా, రెవెన్యూ శాఖల అనుమతుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్ల ఆదాయం లభించింది. మొత్తంగా పొదలకూరులో అక్రమ లేఅవుట్ సక్రమంగా మారిన ఫలితంగా ప్రభుత్వం, ప్రజలకు సుమారు రూ.10 కోట్ల లాభం వచ్చిందని అధికారులు చెబుతుండటం విశేషం.

నెల్లూరులో 40 లేఅవుట్లు

- సిటీ నియోజకవర్గంలో 7, రూరల్‌లో 33
- వివరాలు వెల్లడించిన కార్పొరేషన్ కమిషనర్

నెల్లూరు (సిటీ) : నెల్లూరు నగర కేంద్రంగా అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు లేఅవుట్‌గా తీర్చిదిద్దేసి అమ్మేస్తున్నారు. కొందరు రియల్టర్లు మాఫియా అవతారమెత్తి కనీస నియమ, నిబంధనలు కూడా పాటించకుండా ప్లాట్ల వ్యాపారానికి తెరలేపుతున్నారు. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో ఆరా తీసిన కమిషనర్ సూర్యతేజ నగర పరిధిలో 40 అక్రమ లేఅవుట్లను గుర్తించారు. ఇందులో సిటీ నియోజకవర్గంలో 7 ఉండగా మిగిలనవన్నీ రూరల్ నియోజకవర్గంలోనే ఉన్నట్లు తేల్చారు. వీటిల్లో ఎవరూ ప్లాట్లు కొనడం, అమ్మడం చేయవద్దని హెచ్చరించిన ఆయన అందుకు భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ మేరకు అక్రమ లే అవుట్ల జాబితాను గురువారం అధికారికంగా విడుదల చేశారు.

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనొద్దు

నుడా అనుమతులు లేని అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దు. భవిష్యత్‌లో ఇళ్లు నిర్మించుకునేందుకు, మౌలిక వసతులకు ఇబ్బందులు ఏర్పడుతాయి. అనధికార లేఅవుట్ల వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నాం. ఈ లేఅవుట్లకు జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే కొన్నింటికి ఆయా స్థానిక సంస్థల ద్వారా నోటీసులు కూడా జారీ చేశాం. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

- టీ బాపిరెడ్డి, నుడా వీసీ

గోదాములో ఎంపీడీవో కార్యాలయం

- ఏడాది కిందట శిథిలావస్థకు చేరిన భవనం
- అప్పటి నుంచి అక్కడే ఉద్యోగుల విధుల నిర్వహణ
- పట్టించుకోని గత ప్రభుత్వం


వ్యవసాయ శాఖ గోదాము

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: పంచాయతీల అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రధానపాత్ర పోషించేది మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కార్యాలయానికి ఉన్న సొంత భవనం శిథిలావస్థకు చేరి కూలేదశలో ఉంది. దీంతో గతేడాది అధికా రులు సమీపంలోని వ్యవసాయశాఖకు చెందిన గోదాంలో కార్యాలయంను మార్చారు. ఇందులో ఒకే గది ఉండటంతో సిబ్బంది అంతా ఓ చోట కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. మరోవైపు బాత్‌రూం సైతం లేక పోవడంతో కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడు తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో భవన దుస్థితిని వివరిస్తూ నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు ఉన్నతాధికా రులకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు ఏ లాంటి అనుమతులు రాలేదు.

1965లో నిర్మించిన మండల సమితి కార్యాలయ భవనంలోనే..

ఆ భవనంలోనే ఎంపీడీవో కార్యాలయం నిర్వహించేవారు. గత ఏడాది పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరి, చెట్ల వేర్లు స్లాబు గదుల్లోకి చొచ్చుకొచ్చాయి. ఈ సమస్యతో స్లాబు మొత్తం దెబ్బతిని పెచ్చులూడుతుంది. చిన్నపాటి వర్షానికి కార్యాలయంలో అన్నిగదులు ఉరుస్తుండడంతో అటు సిబ్బంది, ఇటు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి.


శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో కార్యాలయ భవనం

2017లో కార్యాలయ సమావేశ మందరం కుప్పకూలింది. నాటినుంచి దాని నిర్మాణం గురించి పట్టించుకోక పోవడంతో అవస్థలు పడుతున్నారు. స్లాబు పెచ్చులూడి ఉద్యోగులు, సిబ్బంది పైనపడి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఉద్యోగులు, మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఎంపీడీవో కార్యాలయ భవనం పూర్తి శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్యాలయాన్ని వ్యవసాయశాఖ గోదాంలో నిర్వహిస్తున్నాం. అక్కడ సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-డీ ఈశ్వరమ్మ, ఎంపీడీవో, ఉదయగిరి

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ఏఎస్ పేట, ఆగస్టు 22: మండల ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జిగా పని చేసిన ఆయన ఎంపీడీఓగా పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సి బ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది సన్మానించారు.

వరికుంటపాడు: మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి ఎన్నికల అనంతరం జరిగిన బదిలీల్లో ప్రకాశం జిల్లా యద్ధనపూడికి వెళ్లారు.

సీఐకి ఘన సన్మానం


సీఐని సన్మానించి చిత్రపటాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబును స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం దుత్తలూరు మండల టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించి చిత్రపటాన్ని బహూకరించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా పోలీసు సేవా పతకం పొందం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి చల్లా ప్రసాద్, మాజీ జడ్పీటీసీ సభ్యులు చీదర్ల మల్లికార్జున, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యనమల రత్తయ్య పాల్గొన్నారు.

రేపు దేపూరులో వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

ఆత్మకూరు, ఆగస్టు 22 : దేపూరు భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు. ఉదయం 4గంటలకు నుంచే ప్రత్యేక పూజలతో పాటు రాత్రికి భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: గండిపాళెం ప్రాథమిక పాఠశాలకు రెడ్డిబత్తిన పరంధమయ్య జ్ఞాపకార్థం గురువారం ఆయన కుమారులు, కుమార్తె పెదనారాయణ, జయనారాయణ, నారాయణమ్మలు రూ.8వేల విలువైన బీరువా వితరణగా అందజేశారు. అలాగే శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, మాజీ ఎంపీటీసీ అడుసుమల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రెడ్డిబత్తిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: గండిపాళెం గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పుష్పరాజ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు పీజీటీ, గణితం పీజీటీ, స్టాఫ్‌నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 2018డీఎస్సీ నియమ, నిబంధనల ప్రకారం ఈ నెల 27వ తేదీలోపు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో డెమో తరగతుల ఆధారంగా తీసుకొని అర్హులను ఎంపిక చేస్తామన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన

అనంతసాగరం, ఆగస్టు 22: చిలకలమర్రి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డికి ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ నుంచి గురువారం అభినందన ప్రశంసాపత్రం అందింది. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇస్రో, మై గావ్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ క్విజ్ పోటీల్లో పాల్గొన్నందుకు ఈ లేఖ అందినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని తోటి ఉపాధ్యాయులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు

వింజమూరు, ఆగస్టు 22 : చాకలకొండ ఎస్సీ కాలనీలో గురువారం పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, పెయ్యదూడలకు టీకాలు వేశారు. అలాగే బీసీ కాలనీలో డాక్టర్ హరినాథ్ ఆదేశాల మేరకు సచివా లయ వెటర్నరీ అసిస్టెంట్ వీరశేఖర్ పశువులకు పెయ్య దూడలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 22: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించే ప్రత్యేక గ్రామసభను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి షేక్ కరీముల్లా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో ఉపాధి పనుల ప్రాముఖ్యతతో పాటు నూతన పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపుతామన్నారు.

చేజర్ల: అభివృద్ధి పనులను గుర్తించేందుకు అన్ని గ్రామాల్లో నేడు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. కొత్తగా చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

సంగం: అన్ని పంచాయతీల్లో ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది పంచాయతీల్లో, మధ్యాహ్నం మిగిలిన పది పంచాయతీల్లో ఈ సభలు జరుగుతాయని తెలిపారు. ప్రతి పంచాయతీకి మండలస్థాయి అధికారి ఒకరిని నియమించామన్నారు. ఉపాధి కూలీలు, గ్రామస్థులు హాజరై ఈ సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపునకు శుక్రవారం నిర్వహించే ప్రత్యేక గ్రామసభలకు నోడల్ అధికారులను నియమించినట్లు ఎంపీడీవో మల్లికార్జున తెలిపారు. నోడల్ అధికారులుగా డీటీ చెంచయ్య, మండల పరిషత్ కార్యాలయ ఏవో వేణుగోపాల్‌రావు, ఎంఈవోలు షావుద్దీన్, రమణయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నందకిషోర్, హనినిస్సి, ఏపీవో అజమ్‌ఖాన్, ఆర్ఐ సాయికిరణ్, ఏవో రవికుమార్, ఈసీ వెంకటేశ్వర్లు, ఏపీఎం వైనారూత్, సీసీలు ప్రమీల, ప్రభావతి ఉన్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సొసైటీ సీఈవోల ధర్నా


వింజమూరు సొసైటీ ఎదుట నిరసన తెలుపుతున్న సీఈవోలు

వింజమూరు, ఆగస్టు 22: పట్టణంలోని కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఎదుట గురువారం వింజమూరు కుడుములు దిన్నెపాడు, కలిగిరి, సిద్ధనకొండూరు గరిమలపంట సీఈవోలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కంప్యూటరీకరణకు గడువు ఇవ్వాలని, సిబ్బంది కొరతను తీర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై శుక్రవారం విజయవాడలో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల సీఈవోలు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేటలో ఉపాధి కూలీ మృతి

ఏఎస్ పేట, ఆగస్టు 22: మండలకేంద్రానికి చెందిన ఖా జా మస్తాన్ (55) గురువారం ఉదయం ఉపాధిహామీ పను లకు వెళ్లాడు. అక్కడ పని చేస్తూ కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కూలీలు 108కి సమాచారం అందజేశారు. వాహ నం వచ్చి తరలించేలోపు ఆయన మృతి చెందాడు. గత కొన్ని సంవత్సరాలుగా అందరితో కలసి ఉత్సహంగా ఉపాధిహామీ పనులు చేస్తున్న వ్యక్తి హఠాత్తుగా మృతి చెందడంతో కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఈసీ నవీ న్, ఏపీఓలు పని ప్రదేశానికి వెళ్లి మృతదేహన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కోల్‌కతా నిందితులను కఠినంగా శిక్షించాలి


ఆత్మకూరు: నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు

ఆత్మకూరు, ఆగస్టు 22: కోల్‌కతాలోని ఆర్‌జీకేఆర్ మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి కొవ్వత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిషోర్‌రెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం నియోజకవర్గ కన్వీనర్ మాహంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతసాగరం: కోల్‌కత్తా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్యా ఉదంతంపై సీఐటీయూ నాయకులు గురువారం సాయంత్రం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. వైద్యురాలి హత్యకు కారణమైన నిందితులను శిక్షించాలని డి మాండ్ చేశారు. కార్య క్ర మంలో నాయకులు అన్వర్ బా షా, మీరామొహిద్దీన్, అంగన్ వాడీ కార్యకర్తలు, వీఏవోలు తదితరులు పాల్గొన్నారు.



అనంతసాగరం: ఆందోళనలో నాయకులు

పొగాకు ధరలు ఆశాజనకం

మర్రిపాడు, ఆగస్టు 22: డీసీపల్లి పొగాకు బోర్డులో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గురువారం బోర్డుకు రైతులు 790బేళ్లను తీసుకొని రాగా, 15కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 693బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 97బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ట ధర రూ.358కాగా కనిష్ట ధర రూ.204నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 22: దుత్తలూరు, నర్రవాడ, నందిపాడు, ఏరుకొల్లు పాఠశాలల్లో బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మణి, సుబ్బు, రాజశేఖర్, కృష్ణప్రసాద్ ఉన్నారు.

విద్యార్థుల ఔదార్యం

చేజర్ల: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన లుంబినీ విద్యాలయ వాచ్‌మెన్ నర సింహులు పాఠశాల విద్యార్థులు రూ.40వేలు ఇచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమేష్, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

వేధింపుల కేసు నమోదు

సంగం, ఆగస్టు 22: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కొరిమెర్లకు చెందిన సుప్రజకు బుచ్చిరెడ్డిపాళెం కాకు అజయ్‌తో నాలుగేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఈ క్రమంలో అజయ్ మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని భార్యను వేధిస్తుండటంతో అతని భార్య సుప్రజ ఏడాది కిందట పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో బాధితురాలి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

చిల్లచెట్లతో రాకపోకలకు ఇబ్బందులు

వలేటివారిపాలెం, ఆగస్టు 22: మండలంలోని అయ్యవారిపల్లె నుంచి రామలింగాపురం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు పక్కకు తొలగే అవకాశం లేనంతంగా చిల్లచెట్లు పెరిగాయి. ట్రాక్టర్‌లో వెళ్లే ప్రయాణికులను చిల్ల చెట్లు తగిలి గాయాలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్ల చెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అయ్యవారిపల్లె - రామలింగాపురం రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

ఆగిన అభివృద్ధిని పునఃప్రారంభిస్తాం : ఎంపీ వేమిరెడ్డి

కొండాపురం, ఆగస్టు22: గత ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులను పునఃప్రారంభిస్తుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాయిపేటలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అభివృద్ధిపై ఎలాంటి దృష్టి పెట్టకపోగా జరుగుతున్న పనులను నిలుపుదల చేసిందన్నారు. పంచాయతీలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటుచేయాలని, గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు గంటా లక్ష్మీనరసింహులు కోరగా, రెండు ప్లాంట్లు ఇస్తానని వీపీఆర్ హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెంచలబాబు యాదవ్, కాకర్ల వెంకట్, టీడీపీ నాయకులు కుంకు మోహనరావు, దామా మహేశ్వరరావు, వల్లూరు వెంకటేశ్వర్లు, దామా శివబాబు, ఓరుగంటి సుమన్, ఇర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఘనంగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

సాయిపేటలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయుడి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పండితులు సాదరంగా ఆహ్వానించారు. విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలుచేసి ఎంపీ వేమిరెడ్డికి, భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందచేశారు. విదేశాలకు వెళ్లడంతో ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరుకాలేదు.


కొండాపురం : అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీ వేమిరెడ్డి తదితరులు

వైభవంగా అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

చిట్రగుంట, ఆగస్టు 22: బోగోలు మండలం సుందరగిరివారికండ్రికలో గురువారం అభయ ఆంజనేయుడి విగ్రహం, శ్రీవారి శంఖు,చక్ర, నామాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామపెద్దల ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా చిల్లకూరుకు చెందిన ఈపూరు గోవిందరాజుఆచారి బృందం నాలుగురోజుల పాటు ప్రత్యేక పూజాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉదయం యంత్రస్థాపన, విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకాల అనంతరం 21 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. భారీగా భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ, ప్రసాద వితరణ చేశారు.


చిట్రగుంట : అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు


అల్లూరు : ఆలయం వద్ద కళా ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కందుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఆనందపురంలో గురువారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల ప్రజలు, బంధువుల కోలాహలం మధ్య ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దామచర్ల చంద్రమౌళి, ఆయన కుమారులు సుమన్, సతీష్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ

అల్లూరు : మండలంలోని పడమర గోగులపల్లిలో గురువారం పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. ఉదయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రాత్రి ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆట తిరుమల, ఆట మధు, నాయకులు బండి అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జిల్లాలోని లింగసముద్రం, జలదంకి మండలాల్లో బుధ, గురువారాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం పోలీసులు స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. ఆ వివరాలు..

లింగసముద్రం : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మన్నేరులో ఇసుకను అక్రమంగా నింపుకొని వెళుతున్న రెండు ట్రాక్టర్లను గ్రామ శివారులో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది పట్టుకొని, డ్రైవర్లను, ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనలో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జలదంకి : మండలంలోని జమ్మలపాలెం వద్ద ఎన్‌హెచ్ బీజీ167 రహదారిపై ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం అర్ధరాత్రి కలిగిరి సీఐ వెంకటనారాయణ సీజ్‌చేశారు. లింగసముద్రం మండలం పెద్దపవని వద్ద నుంచి ఇసుకను జమ్మలపాలెం తరలిస్తుండగా పట్టుకున్నారు. గురువారం ఈ ట్రాక్టర్లకు జరిమానా విధించి విడుదల చేశారు.

నేడు వీవీ పాలెం మండల సమావేశం

వలేటివారిపాలెం, ఆగస్టు 22 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎపీడీవో శేషుబాబు గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అంకభూపాలపురంలో పారిశుధ్య పనులు

వలేటివారిపాలెం, ఆగస్టు 22 : మండలంలోని అంకభూపాలపురం వీధులను గురువారం పంచాయతీ కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రెగడ మోహన్‌కుమార్, మంగి సురేష్, మల్లెల అంకయ్య, మంగి సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి'పై గ్రామసభలు

అల్లూరు, ఆగస్టు 22 : ఉపాధి హామీ పనులపై మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్థులు ఈ సభలకు హాజరై అవగాహన పొందాలని ఆమె పేర్కొన్నారు.

జలదంకి : మండలంలోని 17పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభలు జరగున్నాయి. సర్పంచిల అధ్యక్షతన జరిగే ఈ గ్రామసభల్లో అవసరమైన పనులు గుర్తించనున్నామని ఉపాధి హామీ ఏపీవో శ్యామల పేర్కొన్నారు.

సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

కావలి: మండల లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌జైలులో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఎం. శోభ ముఖ్యఅతిథిగా పాల్గొని ఖైదీలకు చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ చినసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రకాశం' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్కే మీరాషరీఫ్ డాక్టరేట్ సాధించారు. చెన్నై సెయింట్ పీటర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ నుంచి ఆయన పీహెచ్‌డీ సాధించినట్లు కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ అధికారులు

కందుకూరు, ఆగస్టు 22: పొలాల్లో మేతకు వెళ్లిన గేదెలు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాయి. ఈ ఘటనలో బాధిత రైతులకు విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన నష్టపరిహారం చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం అందించారు. వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన పెగడ రమణయ్య, నరసింహారావులకు చెందిన గేదెలు ఇటీవల పొలాల్లో మేతకు వెళ్లి మృత్యువాత పడ్డాయి. వారిద్దరికీ నష్టపరిహారం కింద రూ. 1.55 లక్షలు మంజూరు కాగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కులను అందించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ ఏ. వీరయ్య, డీఈఈ విజయ్‌బాబు, ఏఈఈ టీ. మధుబాబులు పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు


గుడ్లూరులో కేక్ కట్‌చేస్తున్న చిరంజీవి అభిమానులు

గుడ్లూరు, ఆగస్టు 22 : మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం గుడ్లూరులో చిరంజీవి అభిమానులు, జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో బాణసంచా కాల్చి, కేక్ కట్‌చేసి, అల్పాహార విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నన్నిశెట్టి గిరిబాబు, శానం రాజేష్, కొట్టే పుల్లయ్య, అలా శివ, చిరంజీవి అభిమానులు మెలిశెట్టి రాజా, పసుపులేటి జానకిరామయ్య, మురారిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


బలిజపాలెంలో మొక్క నాటుతున్న చిరంజీవి అభిమానులు

లింగసముద్రం : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను గురువారం లింగసముద్రంలోని బలిజపాలెంలో చిరంజీవి అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మాటూరి శ్రీనివాసరావు, శ్రీశ్రీనివాస పబ్లిక్ స్కూల్ చైర్మన్ ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, యువకులు గ్రామంలోని రోడ్లకిరువైపులా సుమారు 300 మొక్కలు నాటారు.

కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా అనూష

కందుకూరు, ఆగస్టు 22: కందుకూరు మున్సిపల్ కమిషనర్‌గా కె. అనూష నియమితులయ్యారు. 2018 - 19 మధ్యకాలంలో ఆమె కందుకూరు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ప్రస్తుతం తెనాలి మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న అనూషను కందుకూరు కమిషనర్‌గా నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. కందుకూరులో కమిషనర్‌గా ఉన్న కేవీ కృష్ణారెడ్డిని కడప కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

కలుపు నిర్మూలనపై అవగాహన

కందుకూరు, ఆగస్టు 22: స్థానిక కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు పట్టణంలోని కేంద్రీయ విద్యాలయంలో గురువారం వయ్యారి భామ కలుపుమొక్క నిర్మూలనపై అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపాల్ అర్జున్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్ర మంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్ జీ. ప్రసాద్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వెంకటేష్, నిహారిక, జ్యోతి, మయాంక్ పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, కేవీకే శాస్త్రవేత్తలు